మహర్షి వివేకానందుడు

—శ్రీ కె టి యల్ నరసింహాచార్యులు



తిరుమల తిరుపతి దేవస్థానముల
ప్రచురణ

మహర్షి వివేకానందుడు

రచయిత

శ్రీ కె టి యల్ నరసింహాచార్యులు

ప్రచురణ

కార్యనిర్వహణాధికారి

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

1991

Maharshi Vivekanandudu
by
Sri K.T L. Narasimhacharyulu

Edited by
Sri D Nagasidda Reddi

T T D Religious Publications Series No 389

First Edition 1971
Second Edition 1991

Published by

Sri M V S Prasad I A S
Executive Officer
T T Devasthanams,
Tirupati

Printed at

T T Devasthanams Press
Tirupati

ముందుమాట

విశ్వమానవ ప్రేమ పూరితుడు, భక్తి జ్ఞాన కర్మ యోగాల సమన్వయ స్వరూపుడు, ప్రాచ్య పాశ్చాత్య విజ్ఞాన సాగరాల సమన్వయకర్త, అయిన స్వామి వివేకానందుణ్ణి గురించి వివరించడానికి ప్రయత్నించడం సూర్యుడికి దివ్విటీ చూపించినట్లు అవుతుంది వేదమత ప్రాశస్త్యాన్ని దేశదేశాంతరాల్లో చాటి హైందవ ధర్మ స్వరూపస్వభావాల వైశిష్ట్యాన్ని వివరించిన ఘనత ఈ మహామనీషికే దక్కింది మానవసేవే మాధవసేవగా భావించి దరిద్రనారాయణులను ఉద్ధరించడానికి పుట్టినకారణజన్ముడు స్వామి

"నా దేశంలో ఒక కుక్క వస్తువడివున్నా దానికి ఆహారం పెట్టి రక్షించడమే నా పరమధర్మం ఇదే నా మతం తద్భిన్నమంతా అధర్మమే, కృత్రిమ ధర్మమే"– అనీ, "నిరుపేదయైన నా భారత నారాయణుణ్ణి – నా యిష్ట దేవతను అర్చించడానికై ఎన్ని జన్మలైనా ఎత్తగలను, ఎన్ని బాధలనైనా అనుభవిస్తాను"– అని ప్రకటించి అన్నదాన విద్యాదాన జ్ఞానదానాలచే ప్రజాసేవ చేస్తూ యావద్భారతదేశంలోనే కాకుండా ప్రపంచమంతటా ప్రఖ్యాతి వహించిన శ్రీరామకృష్ణమరసేవా సంఘాల్ని స్థాపించిన ఘనత వివేకానందుడికే దక్కుతుంది

ఈశ్వర ప్రేరిత మహావక్త, వేదాంతి శిరోభూషణం, హైందవ ఝంఝూ మారుతం– అని పాశ్చాత్య మేధానిధుల ప్రశంసల్ని పొందిన స్వామి మహోన్నత వ్యక్తిత్వాన్ని కొండను అద్దంలో చూపినట్లుగా

ఈ గ్రంథంలో శ్రీ కె టి యల్ నరసింహాచార్యులు వారు వివరిం చారు. హైందవధర్మ వైశిష్ట్యాన్ని గ్రంథ ప్రచురణ, ప్రచారాల ద్వారా సాగిస్తూ వున్న తిరుమల తిరుపతి దేవస్థానముల వారు పుస్తకాన్ని ముద్రిస్తున్నారు

లలితము, సరళము అయిన సులభశైలిలో రచించబడ్డ ఈ గ్రంథాన్ని పాఠకులాదరించి స్వామి మహోన్నతాదర్శాల్ని జీవితధ్యేయాలుగా స్వీక రిస్తారని ఆశిస్తున్నా

తిరుపతి

ఎం వి ఎస్ ప్రసాద్
కార్యనిర్వహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు

జూన్ 20, 1991

విషయసూచిక

హంసావతరణము

వందే విశ్వకవిం ప్రాజ్ఞం వివేకానందయోగినమ్,
యస్య బోధప్రభావాభ్యాం ధన్యేయం భారతీ, ధరా

ప్రియమైన విద్యార్థులారా!

"విద్యా దదాతి వినయం వినయాద్యాతి పాత్రతామ్,
పాత్రత్వాత్ ధనమాప్నోతి ధనాద్ధర్మం తతః సుఖమ్"

దీని యర్థమే క్రింది పద్యము సుమండీ!

"విద్య యొసఁగును వినయంబు, వినయమునను
బడయుఁ బాత్రత, పాత్రతవలన ధనము
ధనమువలనను ధర్మంబు, దానివలన
నైహికాముష్మికసుఖంబు లందు నరుఁడు"

విద్య వినయము నిచ్చును వినయశీలుడైన మానవుడు మాత్రమే దేనికైనను యోగ్యత సంపాదించుకొనును యోగ్యతచే ధనము కూడ లభించును ధనముచే ధర్మమేగాక ఐహికసుఖములు గూడ అబ్బును విద్యచే ఇవి మాత్రమే గాక వివేకము, వికాసము, విజ్ఞానము, వినోదము, విలాసము మొదలయినవి గూడ సంపాదించుకొననగును

మహర్షి వివేకానందుడు

మానవునకు పై యన్నిటిలోను ముఖ్యమయినది యుక్తాయుక్త జ్ఞానము మంచి చెడులను వేరుచేసి తెలిసికొనుటయే యుక్తాయుక్త జ్ఞానము దీనినే వివేకమని గూడ నందురు హంస నీరక్షీర వివేకమున పేరు గాంచిన దని మీకు తెలిసియే యుండును ఈ విషయమే భర్తృహరికవీంద్రుడు వ్రాసిన సుభాషిత త్రిశతిలోని శ్లోకమును ఏనుగు లక్ష్మణ కవి యిట్లు పద్యబద్ధము చేసినాడు

వనజభవుండు కోపమున వాహనమైన మరాళభర్తకున్
వనజవనీవిహారకలనంబుఁ దొలంగఁగఁజేయుఁగాని గుం
ఫమున దుగ్ధజీవన విభాగ విధాన నిరూఢనైపుణీ
జనిత మహాయశోవిభవ సారము హంసకు మాన్పఁజాలునే!

పాలలో కలసిన నీరును వేరుచేసి చూపుశక్తి హంస కొక్కదానికి మాత్రమే కలదని దీని యర్థము

ఇట్టి వివేకముచే సంపాదింపదగినది మరొకటి గలదు అదియే ఆనందము ఆ ఆనందమున గూడ భేదములు కలవు పసిబి డ్డకు పటికబెల్లము చేతిలో పెట్టిన ఆనందపడును గదా! మరి దానితో పెద్దలను తృప్తపరుప గలమా! పెద్దలకు కావలసిన ఆనందము గూడ పలుతెరగులుగా నుండును

కొంతమంది కడుపునిండుగా తమకు కావలసిన పదార్థములు భుజిం చుటతో మాత్రమే తృప్తిపడుదురు మరికొందరి కితర భోగములు కూడ కావలయును ఇంద్రియములచే అనుభవింపదగిన విషయసుఖములే భోగములు నాటకములు, సినిమాలు మొదలయినవి చూచుట, ఆట లాడుట, పాటలు పాడుట, పాటలు వినుట, స్త్రీలతో వివిధ సుఖము లనుభవించుట మొదలయిన వన్నియు భోగములే ఇట్టి వానితో కాలము గడపువాడే భోగి

వేర్వేరు అనుభవములచే లభించు తృప్త పేరు లౌకికానందము కాని ఈ తృప్త క్రమముగా అసంతృప్తి కే దారితీయును; కాన లౌకికానం దము శోకముగా పరిణమించుట కవకాశము గలదు దీనిని మించినది మరొకటి గలదు అదియే రసానందము లౌకికానందముచే శోకము మిగులగా ఈ రసానందముచే శోకము శ్లోకముగా పూర్ణమైన ఆనం దముగా మారును కాన రసజగత్తుకు చెందిన యీ అలౌకికానందము జగత్తులోని శోకమును దూరము చేసికొనుటకు సాధనముగా మన కుపయోగపడును కాననే కవి సృష్టించిన కావ్యము శోకమూలమే యయి గూడ శ్లోకమయి మగును పద్యమేగాక దానిచే లభించు రసానందమును గూడ శ్లోక మనవచ్చును కాన శోకమును శ్లోకముగా ఆనందముగా మార్చుటయే ఈ అలౌకికానందముయొక్క ప్రధానలక్షణము, అదియే దీని లక్ష్యమన్నను అనవచ్చును

కవులు, కళాకారులు, శిల్పులు తమ రచనలచే ఈ రసము సృష్టం తురు రసస్వరూపుడగు పరమాత్మను పొంది కవి ఆనంద మందును కాననే లౌకికానందముకంటె అలౌకికానందము చాల రెట్లు ఉన్నతము కాని దీనిని మించిన తృప్తికూడ మరొకటి గలదు అదియే ఆత్మానం దము ఆత్మ అననేమో ముందు తెలిసికొందము

మనకు కనుపించు పదార్థములకు ప్రకృతి యని పేరు ఇది పంచ భూతములచే నిర్మితము మట్టి, నీరు, గాలి, వెలుతురు, ఆకాశము ఇవి పంచ భూతములు ఈ ప్రకృతి అస్థిరము మన శరీరముగూడ పాంచభౌతికమే గదా! ఇట్టి శరీరమునకు మూలభూతమయినదే ఆత్మ ఆత్మలేని శరీరము శవమే ఆ ఆత్మ మరల రెండు విధములు, జీవాత్మ, పరమాత్మ అని ఆ రెంటికిని సచ్చిదానందములు సమాన లక్షణములు సత్=స్థిరమైనది, చిత్=జ్ఞానము, ఆనందము=మిక్కుట మగు సంతోషము జీవాత్మకును, పరమాత్మకును ఈ మూడు లక్షణములు సమాన మయినపుడు మరి భేద మేవిషయమున అని మీ రడుగవచ్చును ఖద్యోతము అని ఒక పదము గలదు దానికి ఆకసమున మెరయునది అని వ్యుత్పత్తి ఆ పదమునకు గల అర్థములు సూర్యుడు, మిణుగురుపురుగు ఆకసమున మెరయుట అను సమాన ధర్మము ఉన్నంత మాత్రమున పై రెండును ఒకే విధమయినవి కావు గదా!

సూర్యుడు వెలుగు నిచ్చునట్లే దివిటీ గూడ వెలుగు నిచ్చును కాని ఈ ఒక్క ధర్మముచే మాత్రమే సూర్యుడును దివిటీయును సమాన మని యెవ్వరును తలపరు గదా! అట్లే మనకు కనుపించు సూర్యునికంటె గూడ పరమాత్మ వేయి రెట్లు ప్రకాశవంతమై తీక్ష్ణమై వెలుగొందును

ఇది భగవద్గీతా సూక్తి—

"దివి సూర్యసహస్రస్య, భవే ద్యుగపదుత్థితా,
యది భాస్సదృశీ సా స్యాత్ భాసస్తస్య మహాత్మన "

ఈ పరమాత్మనే బ్రహ్మ పరబ్రహ్మ యని కూడ నందురు జీవాత్మ పరబ్రహ్మను తలచుకొని, లేక ప్రత్యక్షము చేసికొనినపుడు అను భవించు ఆనందమే బ్రహ్మానందము ఆత్మానంద మన్నను ఇదియే ఆ బ్రహ్మను ఉపనిషత్తు లెట్లు నిర్వచించినవో వినుడు—

"యతో వా ఇమాని భూతాని జాయంతే
యేన జాతాని జీవంతి,
యత్ప్రయంత్యభిసంవిశంతి
త ద్విజిజ్ఞాసస్వ
తద్బ్రహ్మేతి"

దీని యర్థమే పోతన యీ పద్యము—

"ఎవ్వనిచే జనించు జగ మెవ్వనిలోపల నుండు లీనమై,
ఎవ్వనియందు డిందుఁ బరమేశ్వరుఁ డెవ్వఁడు, మూలకారణం
బెవ్వఁ డనాదిమధ్యలయుఁ డెవ్వఁడు, సర్వము తానయైన వాఁ
డెవ్వఁడు, వాని నాత్మభవు నీశ్వరునే శరణంబు వేఁడెదన్"

అట్టి బ్రహ్మయొక్క స్వరూపస్వభావములు తెలిసికొనగల్గిన వాడే పరమహంస ఆత్మస్వరూపము చక్కగా గుర్తించిన యోగీశ్వరుడే పరమ హంస హంసకు సూర్యుడు, ఆత్మయని గూడ అర్థాంతరములు గలవు కదా!

గత శతాబ్దిలో మన భారతభూమిలో అవతరించి జగజ్జ్యోతియై వెలు గొంది ఖండఖండాంతరములయందు గూడ మాక్సుముల్లర్, రోమారోలా వంటి శిష్యసత్తములను సంపాదించుకొన్న శ్రీ రామకృష్ణ పరమహంస విశ్వవిశ్రుతుడు ఆ మహామానవుని ఆదర్శము లన్నియు తు, చ తప్పక ఆచరణలో నిడుటకే శ్రీ వివేకానంద మహర్షి కర్మభూమియగు నీ భరతఖండమున అవతరించినాడు

"అయం నిజః పరో వేతి గణనా లఘుచేతసామ్,
ఉదారచరితానాం తు వసుధైవకుటుంబకమ్"

సంకుచితబుద్ధులు గలవారు మాత్రమే వీరు నావారు, వారు నావారు కారు అని తలతురు మహాత్ములకు లోకమే కుటుంబము చిత్రమేమన రామకృష్ణు డీతనిని మొదటిసారి చూడగనే యెంతో వాత్సల్యముతో "ఎన్నాళ్ళకు కనిపించితివోయి నాయనా, నా కన్నులు నీకై కాయులు కాచి యున్నవి" అని దగ్గరకు తీసుకొని కౌగిలించుకొనెను అట్టి అమృత సరస్సు శ్రీ రామకృష్ణుడు ఆ సద్గురువులోని గుణములన్నియు పుణికి పుచ్చుకొన్న శిష్యరత్నము శ్రీ వివేకానందుడు సంపూర్ణమానవుడు "నా దేశమున నొక కుక్క యయినను వస్తువడి యున్నంతవరకు దాని కాహారమిడి రక్షించుటయే నా పరమధర్మము తక్కినదంతయు నధ ర్మము" అని ప్రకటించిన ఆ మహాపురుషుడు అన్నదాన, విద్యాదాన, జ్ఞానదానములచే నేడు భారతదేశమునకే గాక యావద్విశ్వమునకు సేవలు చేయుచున్న రామకృష్ణ మఠసేవా సంఘములను స్థాపించిన దేశభక్తాగ్రగణ్యుడు, విశ్వమానవ ప్రేమవిలసితుడు, వేదాంతశిరోమణి!

విద్యార్థులయిన మీరు విద్యకు నిజమయిన యర్థము తెలిసికొని శ్రీ వివేకానందస్వామిని మీ హృదయఫలకమున చిత్రించుకొనుటకును, దాని మూలమున వివేకవంతులై బ్రహ్మానందమను జీవిత పరమావధిని అందుకొనుటకును, ఈ చిన్ని పొత్త మేమాత్ర ముపకరించినను నా యీ శ్రమ సార్థకమయినదిగా భావింతును

స్వామి జీవితచరిత్ర ఒక మానస సరస్సు దానిలో దిగి యందలి శీలసౌందర్యమను అమృతము మీరు గ్రోలుట కీ ప్రకరణము సోపాన మువలె నుపయోగపడుగాక!

జననము

వంగదేశమున కలకత్తాలోని సిమ్లా యను పేటలో అనేక కాయస్థ కుటుంబము లుండెను వానిలో దత్తవంశ మొకటి వివేకానందుని తాత దుర్గాచరణదత్తు ఆతడు సంస్కృతపారసీకభాషలలో గొప్ప పండితుడు ఇరువదియైదేండ్లకే ఆతడు సర్వసంగములను త్యజించెను ఆతని పుత్రుడు విశ్వనాథదత్తు

విశ్వనాథుడు పెరిగి పెద్దవాడై పారసీకాంగ్ల భాషలు చదివి వంశపారంపర్యముగ వచ్చు న్యాయవాదవృత్తి అవలంబించెను రెండు చేతులతో సంపాదించి ఆతడు అడిగిన వారికెల్ల లేదనకుండ దానము చేయుచుండువాడు కాన ఆతని తరమునుండి దత్తవంశము ప్రభువంశమని ప్రఖ్యాతి గాంచెను పంక్తిలో పదుగురు కూర్చుండనిదే అతడెన్నడును భుజింపలేదు అతని దీనజనప్రేమ వర్ణనాతీతము!

ఆ గృహస్థుని ఇల్లాలు భువనేశ్వరీదేవి, ఆతనికి తగిన సహధర్మచారిణి రుక్మిణీకృష్ణులను బోలిన వారి అనుకూల దాంపత్యమును చూచి అందఱును అబ్బురపడుచుండువారు పోతనార్యుని యీ సూక్తి కా దంపతులు మచ్చలేని యుదాహరణ మనవచ్చును

"తగు నీ చక్రి విదర్భరాజసుతకున్, దథ్యంబు వైదర్భియున్
దగు నీ చక్రికి, నింత మంచిదగునే దాంపత్య, మీ యిద్దఱన్
దగులం గట్టిన బ్రహ్మ నేర్పరి గదా! దర్పాహతారాతియై
మగఁడౌ గావుతఁ జక్రి యీ రమణికిన్, మా పుణ్యమూలంబునన్"

ఆ దంపతులకు చాలకాలమువరకు బిడ్డలు లేరు సంతానమునకై ఆమె కాశీలోని వీరేశ్వరశివుని భక్తితో అర్చింపసాగెను ఈ దేవునే మనము విశ్వనాథు డందుము ఆమె పూజలు ఫలించెను 1863 వ సంవత్సరము జనవరి 12వ తేదీన మకరసంక్రాంతి పర్వదినమున ఆమె గర్భమునుండి ఒక పుత్రరత్నము అవతరించెను సనాతనధర్మమను మహాసాగరమును ఉప్పొంగజేయుటకు, భారతీయవేదాంతమును ప్రాచ్య పాశ్చాత్యఖండములందు వ్యాపింపజేయుటకును ఆ వీరేశ్వరుని అంశమున జన్మించిన బాలచంద్రుడే మన కథానాయకుడు శ్రీ వివేకానందుడు ఆతని బాల్యనామము వీరేశ్వరుడు క్రమముగా నాతడు నరేంద్రనాథ్ అయ్యెను 'బిలే' అని 'నరేన్' అనిగూడ ఆతని ముద్దు పేర్లు

నరేంద్రుని అల్లరి అపరిమితమైనది తల్లి దాని నాపుటకు ఒక మంత్రము కనిపెట్టెను "అల్లరి చేసినచో శివుడు నిన్ను కైలాసమునకు రానీయడు" అని ఆమె బిడ్డను బెదరించును వెంటనే నరేంద్రుడు కుక్కిన పేనే అయ్యెడివాడు ఎప్పుడైన విసుగు చెంది ఆమె 'పుత్రుని కోసము శివుని ప్రార్థించితిని కాని యాతడు తన భూతగణములలో నొకనిని నా కంటగట్టునని కలలో గూడ తలపలేదు గదా" అని అనుకొనును

బైరాగులను చూచిన ఆతని ఆనందమున కంతుండదు ఒకనాడొక బైరాగి వారింటిముందు నిలచి "నారాయణ, భవతి, భిక్షాం దేహి" అని పిలచెను క్రొత్త బట్టలు ధరించిన నరేంద్రు డాతనిని చూచి పొంగిపోయి తన యొద్దనున్న పట్టు రుమాలు అతని కిచ్చివేసెను ఆతని సర్వసంగపరిత్యాగమున కిదియే నాంది కాబోలు! ఇది తెలిసి కొనిననాటినుండియు బైరాగు లెవరయిన వచ్చినప్పుడు ఆ బాలుని గదిలో పెట్టి తాళము వేయువారు

శ్రీరామచంద్రుని పవిత్రచరిత్రమగు శ్రీమద్రామాయణమును, శ్రీకృష్ణుని బాల్యక్రీడలతో నిండియున్న భాగవతమును తల్లి యాతనికి వెన్నతో పెట్టి నేర్పెను తన తల్లి చెప్పు భారతకథలు కూడ అత డత్యంతాసక్తితో ఆలకించువాడు ఈ విధముగా పసితనముననే దైవభక్తిబీజ మాతని హృదయక్షేత్రమున దృఢముగా నాటుకొనెను సీతారామవిగ్రహముల నేకాంతప్రదేశమున నిల్పి తలుపులు బిగించుకొని

వారి నాతడు కండ్లు మూసికొని ధ్యానింపసాగెను తల్లిదండ్రుల కాతడు కనుపింపనందున ఇల్లంతయు వెదకిరి చివరకు మేడమీది గది మూయబడియుండుట చూచి తలుపులు గ్రుద్దిరి, గట్టిగా నరచిరి కాని బదులులేదు బాలు డేమయ్యెనో యని భయపడి వారు తలుపులు బ్రద్ద లుకొట్టి లోనికేగి చూచిరి ఏమాశ్చర్యము! ఆతడిచ్చట నిశ్చలధ్యాన నిమగ్నుడై యుండెను పాలు త్రాగు వయస్సుగల పసిబిడ్డ యేమి! నిశ్చలధ్యాననిమగ్నుడగుట యేమి! ఇది అనేకజన్మార్జిత తపఃఫలముగాక మరేమగును!

అతడు ఎఱ్ఱని పట్టురుమాలు చుట్టుకొని నేను 'శివుడను' అని చిందులు త్రొక్కును శివప్రసాదముచే తనకు లభించిన వీరేశ్వరుని యీ ముద్దుపల్కులు వినునప్పు డా తల్లి యానందము నెవరు వర్ణింప గలరు! ధ్యానము చేసినచో జుట్టు జడలు కట్టి జటాజూటమువలె నగు నని అతని కెవ్వరో చెప్పిరి ఇకనేమి! అతడు పద్మాసనమున నిశ్చలుడై కూర్చొని కండ్లు మూసుకొని ధ్యానింపసాగెను జడలు కట్టకపోవుట చూచి మరల ధ్యానించి ఎంతసేపటి కయినను తలవెంట్రుక లెదుగనేలేదే యని అతడు విచారించుట చూచి భువనేశ్వరి 'తాతగారివలెనే ఈతడు గూడ సన్యసించును గాబోలును' అని భీతిచెందెడిది చూచితిరా, తల్లి ప్రేమ!

ధ్యానము నరేంద్రునకు సహజ బాల్యక్రీడ యని తెలిపితిని గదా! అతడొకనాడు ధ్యానస్థితుడై యుండగా పెద్ద త్రాచుపామొకటి యెదుట ప్రాకసాగెను తోడి బాలురది చూచి భయపడి 'పాముపా'మని యరచి నరేంద్రుని లెమ్మని కేకలిడుచు పారిపోయిరి కాని యాతడు మాత్రము పరమేశ్వరధ్యానరతుడైనందున కదలనే లేదు సుమండీ! పాము కొంత సేపటికి ఎటో పోయెను 'పామో, గీమో నాకా గొడవే తెలియదు ధ్యానములో నా కప్పు డెంత హాయిగా నుండెనో' అని అతడు పల్కెనట

బాల్యచేష్టలచే అతడు తన అక్కచెల్లెండ్రలను చాల విసిగించు వాడు ఇంటి ఆవుతో ఆత డాట లాడువాడు పెంపుడు పావురములు, నెమలి, కోతి, మేక మొదలగు జంతువులు గూడ నరేన్‌కు బాల్య స్నేహితులే ఎఱ్ఱకుచ్చు తలపాగా కట్టుకొని, కొఱడా వుచ్చుకొని గుఱ్ఱ పుబండి తోలుచున్న వానిని చూచునపుడు 'ఇదియే నా కోర్కెగూడ' అని ఆతడనుచుండువాడు ధర్మమను దండమును ధరించి, జ్ఞాన

మను పర్వతశిఖరము నారోహించి, మానవులను గుత్తముల నడపిన నరేంద్రుడు అట్లు కోరుకొనుట సహజమే గదా!

వక్తలలో సింహమై, పండితులలో బృహస్పతియై, గురువులలో శంకరాచార్యుడై ప్రఖ్యాతి గాంచిన నరేంద్రుడు బాల్యమునుండియు బాలుర బృందమునకు నాయకత్వము వహించుటలో ఉత్సాహపడుచుండువాడు నరేంద్రుడు తమ నాయకు డగుట తలచుకొని తోడి బాలు రెంతో గర్వించువారు

ఆటలలో నరేంద్రుడే నాయకుడు గోలీలతో ఆడుట, కుస్తీపట్టుట, మొదలగు ఆటలలో ఆతడు మేటి తోడి బాలురు తమ తగవులు తీర్చుటకై అతనిని మధ్యవర్తిగా ఎన్నుకొనువారు పోరాటమనిన అతని కేవగింపు కాననే కయ్యమునకు కాలుదువ్వు రెండు పక్షముల నడుమ బాలనరేంద్రుడు ప్రేమమూర్తియై నిల్చి వారిని శాంతింపజేయువాడు

న్యాయవాది యగుటచే అతని తండ్రివద్ద కనేకులు వ్యాజ్యముల కొఱకు వచ్చుచుండువారు ఆ దేశమర్యాద ననుసరించి ఆ యా జాతుల వారికి ప్రత్యేక హుక్కా (పొగ త్రాగు గొట్టము)లు అమర్చబడి యుండెడివి వారిలో ఒక మహమ్మదీయుడు విడిగా గూర్చుండి హుక్కా పీల్చువాడు నరేంద్రు డతనిని 'మామా' యని పిలుచును ప్రతివ్యక్తి హుక్కాతోపాటు ఆ మహమ్మదీయుని హుక్కాగూడ కుమారుడు పీల్చుట చూచి ఒకసారి విశ్వనాథుడు మందలించెను 'జాతిభేదము మీరిన నేమగునో చూచుచుంటిని' అని నరేంద్రుని సమాధానము!

బాల్యచేష్టలలో నరేంద్రుని యుద్రేక మపరిమితము ఒకప్పు డాతడు పూజామందిరపు మెట్లమీదనుండి కాలుజారి క్రింద పడెను తల రాతికి తగిలి గాయ మయ్యెను దానిచే కలిగిన మచ్చ కుడికంటి పైభాగమున అతనికి జన్మాంతముండెను నరేంద్రుని గురుడగు శ్రీరామకృష్ణుడా దెబ్బను గూర్చి "నరేంద్రుని శక్తిసామర్థ్యము లా ప్రమాదము వలన కొంతవరకు నిరోధింపబడక పోయినచో నాతనివలన లోకమల్లల లాడిపోయి యుండును" అని వచించెను కాని లోకము నాతడు కంపింపజేయకపోగా పైపెచ్చు లోకోద్ధారకుడగుట గూడ సంభవించెను గదా!

విద్యాభ్యాసము

నరేంద్రుడు పెరిగి పెద్దవాడగుచున్న కొలది ఆతని బుద్ధిచాతుర్యము గూడ శుక్లపక్షచంద్రునివలె దినదినాభివృద్ధి నందసాగెను ప్రేమాను రాగములకు నిలయమగు ఆతని హృదయమును, శాస్త్రకౌశలమునకు పట్టుగొమ్మ యగు ప్రతిభయు, ధైర్యసాహసములకు సాగరమగు ఆత్మ విశ్వాసమును, బాల్యముననే నరేంద్రునందు వికసింపసాగెను రూప సంపదతో బాటు సౌశీల్యసంపదగూడ ఆతని వరించెను గదా! ఇట్టి యాత డిరుగుపొరుగువారి ప్రేమకు పాత్రు డగుటలో అబ్బుర మేమి మగవారిని 'అన్నా' 'తండ్రి' అనియు ఆడువారిని 'అమ్మా' 'అక్కా' యనియు ఆతడు వరుసలతో పిలచుచుండువాడు

ఆతని కారవయేట అక్షరాభ్యాసము జరిగెను పురోహితుడు వేద సూక్తములతో నరేంద్రుని సరస్వతి కప్పగించి, బాలుని కుడిచేతితో మనబొగ్గు పట్టించి నేలమీద అ, ఆ, లు వ్రాయించెను దారము నకు కట్టబడిన రెల్లుకలము మొలనుండి వ్రేలాడచుండ, చిన్ని చాపను చంకను బెట్టుకొని, క్రొత్తబట్టలతో, ముద్దులు మూటగట్టుచు, ఆతడు బడికేగు చుండగా చూచినవారికి అలనాటి వామనమూర్తియే గుర్తుకు వచ్చువాడట!

తోడి బాలురు ఇతరులతో కుస్తీ పట్టుచుండగా నరేంద్రు డా వయ సుననే చదువుట, వ్రాయుట చక్కగా నేర్చెను సంస్కృతభాషలోని ముగ్ధబోధవ్యాకరణము, రామాయణమహాభారతము లందలి యనేక ఘట్టములు ఆ పసియాడుననే అతనికి కంఠస్థములై కరతలామలకమ య్యెను

1870 వ సంవత్సరమున తన యేడవ యేట న రేంద్రుడు ఈశ్వర చంద్రవిద్యాసాగరుని పాఠశాలలో మొదటితరగతిలో ప్రవేశించెను పట్టుమని పది నిముసములు కూడ ఆత డుపాధ్యాయుని యెదుట కుదురుగా కూర్చుండువాడు కాడు పాఠశాలను తన క్రీడారంగముగ మాత్రమే ఆతడు భావించును పాఠములు జరుగు సమయమున గూడ తన స్నేహితులను రామాయణభారతకథలతోనో, తన చమత్కా రముతోనో వినోదింపజేయువాడు ఒకసారి యది చూచి ఉపాధ్యా యుడు హఠాత్తుగా 'నేనేమి బోధించుచున్నానో చెప్పుడు' అని బాలురను

గద్దించెను తక్కినవారలు దిక్కులు చూచుచుండగా నరేంద్రు డాయన ప్రశ్న లన్నిటికిని తగిన సమాధానము లిచ్చెను అసాధారణమేధాశక్తియే అతని నంత మహాపురుషుని చేసినది!

అత డేకసంథాగ్రాహి బాలురందరిలో గురువు నెదుట కండ్లు మూసుకొని నిశ్చలుడై కూర్చుండి యుండువాడు ఈ విచిత్రము చూచి ఉపాధ్యాయు డొకనా డాగ్రహపరవశుడై అతని చేతులు పట్టుకొని గుంజి 'ఏల ఈ మందకొడి తనము, పాఠమును ఒప్పగింపుము' అని దండించెను గంటక్రింద జరిగిన పాఠము నరేంద్రుడు ఒక పొల్లుగూడ పోకుండ ఒప్పగించెను ఆగ్రహోదగ్రుడైన ఆ గురువు ఆశ్చర్యముతో తల మున్కలై అతనిని ప్రేమతో గాఢముగా కౌగలించుకొనెను

విదేశీయుల భాషయగు ఇంగ్లీషును మొదట నరేంద్రుడు నిరాకరించెను కాని తర్వాత శ్రద్ధగా నేర్చుకొనెను పెద్దవాడైన తర్వాత ఆంగ్లభాషయం దాతడు నిర్మించిన వివేకానందవచనామృతము ప్రపంచముననే నూతన శకము సృష్టించినది ఆంగ్లవిద్యాభ్యాసమున నరేంద్రుడు చూపిన అసాధారణప్రజ్ఞ పాఠశాలలో విద్యార్థులతో పా టుపాధ్యాయ లోకమును గూడ అశ్చర్యాంబుధిలో ముంచెను రవీంద్రనాథఠాకూరు వలెనే ఈతడు గూడ తన కవితాపటిమచే పెద్దవాడైన తర్వాత విశ్వకవి బిరుదమును గెల్చుకొనగల్గెను అందుకు తగిన కవితాబీజము లా చిన్నతనములోనే అతని హృదయమున గాఢముగా దాగుకొని యుండెను

ఆ వయస్సుననే నరేంద్రునకు సన్న్యాసమనిన పరమానంద మని ముందే పలికితినిగదా! తాను సన్న్యాసియై యే యే ప్రదేశముల కరుగునో, యెట్టి ఘనకార్యములు చేయునో ఆ వివరములు తోడిబాలుర యొడలు పులకరింప నాతడు తరచు ముచ్చటించువాడు బాలు రెవ్వరైన తమచేతులు పరీక్షించుకొని భావిజీవితము నిర్ణయించుకొను వారు వారందరకు జ్యోతిషము చెప్పువాడు నరేంద్రుడే 'తాను సన్న్యాసిగుదునని యొక జ్యోతిష్కుడు పలికె'నని చెప్పుచు నరేంద్రుడు వారికి తన చేతిరేఖలు చూపువాడు

నరేంద్రునికి తార్కికజ్ఞానముగూడ చిన్ననాడే వికసింపసాగెను తండ్రి యుండగా నాతని యింటి కనేకులు పండితులు వచ్చుచుండు

వారు నరేంద్రుడు తన తండ్రికి వారికి మధ్య జరిగిన ప్రసంగములు శ్రద్ధగా విని తాను గూడ తన యభిప్రాయములు నిర్భయముగా వెల్ల డించువాడు కాని యెంత పెద్దవారైనను నరే తనను తూలనాడినచో సహించువాడుకాదు వంగభాషాపండితుడగు ఒక వృద్ధునితో ఆత డొక నాడు చర్చలో దిగి అనేకప్రమాణగ్రంథములనుండి శాస్త్రములనుండి గ్రహించిన శ్లోకములను వర్షముగా గురియించుచు ఉపన్యసింపసాగెను ఆ పండితు డీయన అసాధారణమేధాశక్తి కబ్బురపడి, 'నాయనా నీ కీర్తి ప్రపంచమంతటు వ్యాపించు దినములువచ్చి తీరు'నని దీవించెను

నరేంద్రుడు తన జీవితములో ఎన్నో ఘోర యాతన లనుభవిం చెను కాని యాతడు నిర్వికారచిత్తముతో వాని నన్నిటిని లెక్క చేయకుండుట కాతని మాతృదేవి భువనేశ్వరి యొక్క బోధలే మూల కారణములు తల్లియే బిడ్డకు ప్రథమ గురువు కదా!

బాల్య విశేషములు

ఆటపాటలలో కాలముగడపుటయనిన నరేంద్రునకు పెద్ద సరదా! విషమపరిస్థితులలో చిక్కుకొన్నప్పుడు గూడ అతడు నిరుత్సాహపడక ధైర్యమునే ప్రకటించువాడు ఆ ధైర్యోత్సాహములే ఆతనిని వివేకానం దములకు పట్టభద్రునొనర్చినవి

విద్యాభ్యాసమున నరేంద్రుని చాకచక్య మద్భుతము పాఠములు చదివి అప్పగించుట కాతనికి దినమునకొక గంట చాలును మిగిలిన కాలమంతయు ఆత డాటలకే వినియోగించుకొనువాడు చిరుతిండికై యిచ్చు డబ్బులు గోలీలకో, బంతులకో వినియోగించుట ఆతని కలవాటు సంవత్సరమున తొమ్మిది నెలలిట్లు వినోదవిలాసములతో గడచిపోగా చివరి కాలమున ఏ రెండు నెలలో ఆతడు పాఠములు చదువువాడు పరీక్షలో ఉత్తీర్ణుడగుట కాతని కంతకంటె యెక్కువ కృషి యక్కరలేకపోవు చుండెను అంత తక్కువకృషి చేసినను ఆంగ్లము, సంస్కృతము, దేశచరిత్ర అను వానిలో అతనిదే ప్రథమ స్థానము కాని గణితమన్న నాతనికి కంటగింపు!

బుద్ధిబలముతోబాటు దేహబలమున గూడ నాత డద్వితీయుడే ఒక వ్యాయామమండలి స్థాపించి సాము గరిడీలలో, కుస్తీలోగూడ, ఆత

డారితేరెను వ్యాయామ ప్రదర్శనలో ఉత్తమ బహుమతి నందెను మల్ల యుద్ధమున గెలిచి వెండి సీతాకోకచిలుకను గ్రహించెను

వంటలలో ప్రవీణుడు కావలెనని యాతడు తోడి బాలురతో పందెము వేయించి చిత్రవిచిత్ర పదార్థములను వండి వారికి వడ్డించి వారిచే వహ్వా యనిపించుకొనువాడు సంభాషణలవలెనే అతని పిండివంటలు గూడ రసవంతములై యుండెడివి అయినను తీక్ష్ణమయిన అతని వాగ్ధాటివలెనే ఎండివంటలుకూడ పచ్చిమిరపకాయల కారముచే చుఱ్ఱు మని ఎంచెడివట!

వాక్చాతుర్యమున గూడ అత డందెవేసిన చేయి! ఒక క్రైస్తవమత బోధకు డొకప్పుడు విగ్రహారాధనను నిరసించుచు 'మీ విగ్రహము నా చేతికఱ్ఱతో పూజించిన ఏమి చేయును?' అని ప్రశ్నించెను ఇంతలో నరేంద్రు డాదారిని బోవుచు ఆగి 'వీం1 దేవుడు నేను దూషించినచో ఏమి చేయును?' అని యెదురు ప్రశ్న వేసెను గ్రుడ్లువచ్చి పిల్లను వెక్కిరించుచున్నట్లున్న యీ ప్రతిప్రశ్న కాత డుగ్రుడై 'నీవు చచ్చిన తర్వాత నిన్ను నరకాగ్నిలో త్రోయును' అని శపించెను 'నీ మరణా నంతరము మా విగ్రహము గూడ నిన్నట్లే చేయు' నని బాలనరేంద్రుని సమాధానము!

సాహసమున నరేంద్రుడు విక్రమార్కుడు ఏడేండ్ల వయసుననే నరేంద్రు డొక తీర్థమునకు పోయెను అచట శివవిగ్రహములు కొని తన మిత్రునితో తిరిగి వచ్చుచుండెను చీకటి పడెను గుఱ్ఱపుబండి ధ్వనివినిపించెను అతడు వెనుదిరిగి చూచును గదా అతని మిత్రు డా బండి క్రిందపడుటకు సిద్ధముగా ఉండెను నరేంద్రుడు ఆలసింపక మెరపువలె ముందుకురికి ఆ మిత్రుని బట్టి వెనుకకు లాగి వాని ప్రాణములు కాపాడెను మరొకప్పుడు బిడ్డ నెత్తుకొన్న యొక తల్లి నిట్టి యాపదనుండియే రక్షించెను నరేంద్రుని ధైర్యస్థైర్యములు ప్రక టించు నిట్టి సంఘటనలు వివరించుచుబోయిన బాలురికని చిన్నదిగా వ్రాయుట కుద్దేశించిన యీ పుస్తకము వామనమూర్తి త్రివిక్రమావ తారముతో విజృంభించినట్లు పెరిగిపోవును గదా! భర్తృహరికవీంద్రుని యీ సూక్తి నరేంద్రునియెడ ఈ పట్టున సర్వథా సార్థకము

"కరమున నిత్యదానము, ముఖంబున సూనృతవాణి, యౌదలన్
గురుచరణాభివాదన, మకుంఠితవీర్యము దోర్యుగంబునన్,
వరహృదయంబునన్ విశదవర్తన మంచితవిద్య వీనులన్,
సురుచిరభూషణంబు లివి శూరులకున్ ఎరిలేని యప్పుడున్"

నరేంద్రుని ప్రతిభాతిశయము ప్రకటించు విద్యలలో గానము ప్రధానము ఒక ప్రత్యేకోపాధ్యాయుని యొద్ద అతడు సంగీతము నేర్చుకొనెను హార్మోనియము, ఫిడేలు వాద్యములలో గూడ అతడు ప్రవీణు డయ్యెను వీనులకు విందు గూర్చునది ఆతని కోమలగాత్రము గానవిద్యకు శిలలు కరగునని మ్రోడులు చివురించునని మన మెఱిగినదే గదా! నరేంద్రుని శ్రీరామకృష్ణునకు సన్నిహితునిచేసి శిష్యోత్తమునిగా నొనర్చిన దీ గానమే యని మనము ముమ్ముందు తెలిసికొనగలము

విశ్వనాథుడు రాయపురమున కొంతకాలము నివసింపవలసివచ్చుటచే నరేంద్రుని విద్య కాటంకము కలిగెను 1878వ సంవత్సరమున వారికుటుంబము మరల కలకత్తాకు తిరిగివచ్చెను వెంటనే అతడు పాఠశాలలో ప్రవేశించి మూడేండ్లు నేర్చవలసిన పాఠములన్నిటిని ఒక్క యేటిలోనే ముగించి ప్రవేశ పరీక్షలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడయ్యెను అతని బుద్ధిబలము కొనియాడ నాతరమా! నక్క యెక్కడ, నాగలోక మెక్కడ!

విశ్వవిద్యాలయ జీవితము

ఆటపాటలతో నరేంద్రుని జీవితము గడచిపోయెను బాధ్యతతో గూడిన యౌవన మాతని శరీరమున పొడసూపెను పదునారేండ్ల వయస్సులో ఆతడు కళాశాలలో చేరెను పాఠ్యపుస్తకములతో మాత్రము తృప్తిపడక ఆత డితరగ్రంథములను గూడ విజ్ఞానార్జనకై పరిశీలించువాడు పాశ్చాత్యుల దేశచరిత్రయే గాక వారి తర్కశాస్త్రమును గూడ అతడపుడే మధించెను వ్యాసరచనను, ఉపన్యాసమిచ్చుటను గూడ అపుడే అలవరచుకొనెను

అద్భుతమగు ధారణాశక్తియే కళాశాలలో గూడ ఆతనికి పేరు తెచ్చినది పరీక్షలకు రెండు మూడు నెలలకు ముందు మాత్రమే పాఠ్యపుస్తకములు చదివి ఇతరకాల మంతయు విజ్ఞానాభివృద్ధికై ఆతడు వినియోగించువాడు గ్రంథము నక్కడక్కడ చదువుచు అందలి భావము లాతడు గ్రహించువాడు పుటలో మొదటి పంక్తి చివరి పంక్తి చదివినచో అందలి తాత్పర్య మాతనికి కరతలామలక మయ్యెడిది అట్టి యాతని నిరుపమానధీశక్తి కళాశాలాధ్యక్షుడు హేస్టీ మహాశయుని గూడ ఆకర్షించెను శ్రీ రామకృష్ణుని దివ్యానుభవముల నీ హేస్టీ యే నరేంద్రునికి తెలిపినవాడు!

విమర్శనశక్తి ఈ కాలముననే ఆతనిలో పెరిగెను విమర్శనము అను దీపమునపోయుముచే ప్రతివిషయమును నిశితముగ ఆతడు పరిశీలించువాడు ఆత్మమోక్షమునకును జగత్కల్యాణముకొఱకును అవతరించిన ఆతనిలో ఏదో అసంతృప్తి, తీవ్రవాంఛ, మానసికపరివర్తన కలుగ సాగెను ఆహారనిద్రాదులచే కలుగు సుఖమొక్కటే జీవిత పరమావధి కాజాలదని అతడు బాల్యముననే తెలిసికొనెను విషయ సుఖములపై ఆతనికి ఆదినుండి గూడ ధ్యాస లేదు ఆతని ధీరగంభీర వాక్చాతుర్యమును చూచి సహపాఠు లెంతో ఆనంద మందువారు ఆతని స్వతంత్రభావములు స్వదేశప్రేమ, ఆధ్యాత్మిక జిజ్ఞాస మున్నగునవి వారి నాతనివైపు బలముగ ఆకర్షించెడివి

కష్టములలో ఉన్నవారి కెట్లు సాయము చేయుదునా అని నరేంద్రుడు సదా పరితపించుచుండువాడు పట్ట పరీక్షకు పోవు సమయమున అతని మిత్రుడొకడు పరీక్షారుసుమ్ము మాత్రమే గాక నెలజీతము గూడ గట్టలేక పోవుటచే ఆతనికి పరీక్షకు పోవుటకు వీలులేకపోయెను నరేంద్రు డాతనికి చదువు మానవలదని ప్రబోధించి, ప్రోత్సహించి, కళాశాలాధికారుల కెట్లో నచ్చజెప్పి యొప్పించి ఎంతో సాయపడెను

ఈ సందర్భమున ఈ సూక్తి సదా మననీయము

"హృ[illegible]వచశ్శరీరముల నెంతయుఁ బుణ్యసుధా ప్రపూర్ణులై,
[illegible]ముఁ [illegible] [illegible]లకున్ [illegible]చుచున్,
[illegible] కొ[illegible]చేసి మెచ్చుచున్,
మదిని వికాసయుక్తులగు మాన్యులు కొందరు వొల్తు రిద్ధరన్"

—భర్తృహరి

ఇట్టి పరోపకారములతోను ప్రామాణిక గ్రంథపఠనములతోను ఆ సంవత్సరమున చాలకాలము చేయి జారి పోవుటచే పరీక్షలకుముం దహోరాత్రము లాతడు శ్రమించుచుండువాడు తలనొప్పి మాన్పు కొనుటకై తేయాకు పానీయము సిద్ధముగ ఉంచుకొనువాడు ఐనను కునుకు వచ్చినచో తటాలున తాను మేల్కొనుటకు వీలుగా ఆతడు ఒక త్రాటిని కుర్చీకి కట్టి రెండవకొన తన కాలికి బిగించి యుంచు కొనువాడట సుకుమారుడని యాతని కరుణించి నవుడెల్ల, నిద్రాదేవి కాలి త్రాడు చివుక్కున లాగి సరస్వతీదేవిని ఆతనిచే స్మరింపచేయు చుండెడిది విద్యకై పలు పాట్లు పడక తప్పదనుటకు ఈ ఆర్యోక్తి గమనింపుడు

"సుఖార్థీ చేత్ త్యజేత్ విద్యాం
విద్యార్థీ చేత్ త్యజేత్ సుఖమ్,
సుఖార్థిన కుతో విద్యా?
కుతో విద్యార్థిన సుఖమ్?"

సుఖము కోరినచో విద్యను వదలుకొనుము విద్య కావలెనన్న సుఖ మునకు తిలోదకము లిమ్ము

విద్యార్థులారా! చూచితిరా, నరేంద్రుడు బాల్యమున విద్యార్జన కొఱ కును, తన్మూలమున లభించు వివేకము కొఱకును ఎట్టి కఠోరతప మాచరించి దిగ్విజయ పరంపర లందుకొనువాడో! ఆతని వలెనే మీకు కూడ ఇహపరములు లభింపగలవు సుమండీ!

మానసికపరివర్తనము

నరేంద్రుడు కేవలము, ఐహికవిద్యలు సంపాదించుటయే తన లక్ష్య ముగా పెట్టుకొన్నవాడు కాడని, అది దైవసంకల్పము గూడ కాదని మనము పూర్వమే తెలిసికొన్నాము గదా! "పుస్తకములలో ఏమున్నది? భగవత్సన్నిధిలో పాండిత్యముతో పనియేమి" అని పట్టపరీక్షాదినమున నరేం ద్రుని కూహ జనించెను భగవత్పరితాప మొకటి మాత్రమే ఆతని హృదయమును వికలము చేయసాగెను అతని ఈ స్థితిని ధూర్జటి కవీశ్వరుని యీ పద్యముతో వ్యాఖ్యానింపవచ్చునేమో!

"ఏ వేదంబు పఠించె లూత, భుజగం బే శాస్త్రముల్ సూచె, తా
వే విద్యాభ్యసన మ్మొనర్చెఁ గరి, చెంచే మంత్ర మూహించె, బో
ధావిర్భావనిదానముల్ చదువులయ్యా? కావు, నీ పాదసం
సేవాసక్తియె కాక జంతుతతికిన్, శ్రీ కాళహస్తీశ్వరా!"

పరీక్ష వ్రాయవలసిన దినమది సహపాఠులగది గుమ్మమువద్ద నరేంద్రుడు నిలబడెను బ్రహ్మానంద మాతని వదనరంగముపై చిందులు త్రొక్క సాగెను నరేంద్రుని దివ్యనామసంకీర్తనమునకు విద్యార్థులు మేల్కొని తలుపులు తెరచిరి పరీక్షనాడు గూడ ఆత డిట్లు నామసంకీర్తనముతో కాలము గడుపుచుండుటకు వారు మిగుల అబ్బురపడిరి అపుడు నరేంద్రు డిచ్చిన సమాధానము మన మీ భర్తృహరి పద్యములో గనగలము

"ఆయువు నూఱు వత్సరము, అందు సగంబు గతించు నిద్రచేఁ
నాయుఱలో సగంబు గతమయ్యెను బాల్యజరాప్రవక్తిచే,
బాయక తక్కినట్టి సగపాలు గతించెఁ బ్రయాసవృత్తిచే
నాయువు చంచలంబగుడుఁ బ్రాణుల కెట్లు సుఖంబు చేకురున్?

దైవము నరేంద్రుని బ్రహ్మానందసామ్రాజ్యపట్టభద్రునిగా చేయదలపగా నీత డైహికవిద్యాపట్టభద్రు డగుట యెట్లు పొసగును?

అవు డాతడు అంతకుముందు కలకత్తా దక్షిణేశ్వరమున కలసికొన్న శ్రీ రామకృష్ణుని గూర్చియే అనుక్షణము ఆలోచింపసాగెను సన్యాసి యగు అతని వినిర్మల వర్తనము, భగవత్పరితాపము, లోకకల్యాణకాంక్ష నరేంద్రుని హృదయమును లోగొనెను కనుకనే అతడు యముని గూడ ఎదిర్చి నిలువబడగల సన్యాస ఘనతను మనసులోనే తలపోయసాగెను వృద్ధుడగు రామకృష్ణునియం దీ విధముగ ఆతని కేలనో అవ్యాజమైన ప్రీతి జనించెను

అహమ్మద్ ఖాన్, వేణీగుప్త అను ప్రసిద్ధ గాయకుల యొద్ద నరేంద్రుడు శాస్త్రోక్తముగా నాలుగేండ్లు గానము నభ్యసించెను ఆ సాధనచే గీతవాద్యము లందాతడు ప్రవీణుడాయెను హైందవగానకళను గూర్చి కాలాంతరమున ఆతడు వ్రాసిన విషయములు అతని గానకళాపాండితిని వేనోళ్ళ జాటుచున్నవి ఆతడు రచించిన స్తోత్రములు కీర్తనలు

గూడ నేడును రామకృష్ణాశ్రమములలో సంకీర్తనసమయములందుపయో గింప బడుచున్నవి ఇట్టి నరేంద్రుని గానమాధురికి పరవశుడై బ్రహ్మానంద సరోవరమున తేలియాడిన హంసరాజమే శ్రీరామకృష్ణ పరమహంస!

విద్యలలో నరేంద్రుని ప్రతిభగాంచి ఇంగ్లాండులో ఐ సి యస్ పరీక్ష చదువుటకై చాలినంత కట్నమిచ్చెదమని సంబంధములు రాసాగెను కాని నరేంద్రు డదివరకే ముక్తికాంతను వరించియుండెను గదా! భగవ త్సందర్శనమునకై నరేంద్రుని తహతహ ప్రబలమయ్యెను

యౌవనారంభమునుండియు నరేంద్రునకు నిద్రలో పరస్పర భిన్న మగు జీవితదృశ్యములు స్వప్నగోచరమగు చుండెను దారాపుత్రాదులతో కీర్తిప్రఖ్యాతులతో, భోగభాగ్యములతో ఒప్పారు గృహస్థజీవిత మొకవైపు, సమస్తము త్యజించి ముక్తికాంతను పరించి పరమేశ్వరుని పాదారవింద మకరందమును గ్రోలుచున్న దృశ్యము వేరొకవైపు—అంతర్ముఖుడైన కొలదియు ఆతనికి సంసార జీవనదృశ్యముకంటెను రెండవ దృశ్యమే వేయిరెట్లు అందమై అధికమై భాసింపదొడగెను

భగవత్సాక్షాత్కారమునకై పరితపించుచు ఆతడు బ్రహ్మసమాజ సభ్యు డగు దేవేంద్రనాథుని "మహాశయా, మీరు భగవంతుని దర్శించితిరా" అని ఉద్రేకముతో ప్రశ్నించెను దాని కాతడు సమాధానము చెప్పజాలక "వత్సా! నీవి యోగినేత్రములు సుమా" అని వచించి యూరకుండెను

గురు చరణ సన్నిధి

గదాధరుడు 1836వ సంవత్సరమున ఫిబ్రవరి 18వ తేదీన కల కత్తావద్ద కామార్పుకుర్ అను గ్రామమున జన్మించెను ఆతడు పిన్నతనమునుండియే కామవాంఛనములకు విముఖుడై బ్రహ్మదునివ లెనే చిత్తమును ఈశ్వరాయత్తము చేసెను కాననే అతడు కలకత్తాలో నున్న దక్షిణేశ్వరమున కాళీమాత కర్చకుడుగా కుదిరి తన కాలము సద్వినియోగపరచుకొనసాగెను అతడు ఘోరతపస్సు చేసి జగజ్జననిని ప్రత్యక్షముగా సందర్శింప గల్గెను ఆతని భార్య శారదామణీదేవి, ఆతని గుణములన్నిటికిని తగినజోడు కాననే ఐహికవిముఖుడగు ఆతనిని సంసారమువైపు ఆకర్షించుటకు ఆమె యత్నింపలేదు అంతేగాదు, పైగా

అన్ని ధర్మకార్యములందును ఆతనికి తోడుగా నుండుచు సహధర్మచారిణి యను మాట సార్థకపరచుకొనెను కామకాంచనవిజయమును మున్నె వ్వరును కని విని యెరుగని రీతిగా సాధించిన జితేంద్రియుడైన ఆ సాధుపుంగవుడే శ్రీరామకృష్ణపరమహంస యను పేరుతో విశ్వవిఖ్యాతి నందెను!

ఆ ఆధ్యాత్మికవేత్తయొద్దకు పామరులే గాక పండితులు గూడ వచ్చి తమ తాపత్రయములు తీర్చుకొని అపూర్వానంద మందెడివారు సర్వ మతసామరస్యము రూపు దాల్చినట్లు ప్రశాంతముఖమండలముతో వెలుగొందుచున్న ఆతనివద్దకు భగవత్పరితాపతప్తుడగు మన నరేంద్రుడు చెంత చేరెను చంద్రదర్శనముచే సముద్రముప్పొంగునట్లు నరేంద్రుని చూడగనే శ్రీ రామకృష్ణుని హృదయవాహినీతరంగములు ఒడ్డు లొరసి పొంగి పొరలెను పరమహంస ఆనందపారవశ్యముతో నేత్రముల నుండి ఆనందబాష్పములు రాల్చుచు "ఎంతో కాలమునకు వచ్చితివోయి తండ్రి ఇంతవరకు నాపై నీ కింత నిర్దాక్షిణ్యమేల నయ్యా, ప్రాపంచిక ... తుచ్ఛప్రసంగములచే నా చెవులు చిల్లులు పడుచున్నవి నాయనా! ఇక ... తాపమంతయు నీతో చల్లార్చుకొందును నీవు నరు డను పురాతనఋషివి ఇపుడు మానవకోటి బాధలను రూపుమాపుటకై అవ తరించిన నారాయణుడవు" అని ఆవేశముతో గొంతు బొంగురుపోవగా ... ఎలికెను

నరేంద్రుడిట్టి ప్రేమపాశముచే, చూడగనే ప్రథమ దర్శనమందే పర మహంసను ఎట్లు బంధింప కలిగెనో మీకు తెలియునా? మన భారతీయుల జన్మసిద్ధాంతము విశ్వసంతురుగదా! దీనినే "ఇది యీ ... మైత్రి, గత జన్మాధారసంస్కారసంపదుపనీతము" అని ... కవి యొకరు వర్ణించినారు అనేకజన్మలనుండి యీ గురు శిష్యులు ... కావునే పరమహంస యీతనిని చూడగనే తన ప్రాతమిత్రుడని ... నరేంద్రు డింతవరకు ఈ జన్మమున తపశ్శక్తి గాని దివ్య ... సంపాదించనందున తమ యిరువురి పూర్వోక్తసంబంధమును ... లేకపోయెను

రామకృష్ణు డాతని భక్తితత్పరతను, గానమాధురిని గూర్చి విని ... నామసంకీర్తన చేయుమని కోరెను నరేంద్రుడు ... తో గాన మారంభించెను ఆతని గానవాహిని పరమ

హంసను బ్రహ్మానందసాగరమున నోలలాడించినది వెంటనే పరమహంస శరీరస్మృతిని గోల్పోయి సమాధిలో నిమగ్ను డాయెను భగవద్ధ్యాన మున పూర్తిగా ఒడలు మరచిపోవుటయే సమాధి నరేంద్రుడు పాడిన వంగభాషలోని ఆకీర్తన యిది—

"మన చలో నిజనికేతనే,
సంసారవిదేశే విదేశిర్ వేషే
భ్రమ కేనొ అకారణే"

మనసా, స్వస్థానమునకు పోదము పద! విదేశమగు ఈ సంసార మున పరుడవై ఏల పరిభ్రమించెదవు?

నరేంద్రుడు సెలవు తీసికొని వెళ్ళిపోయెను కాని వెంటవెంటనే అతనిని చూచుటకు, అతని గానమాధురిలో ఓలలాడుటకు పరమ హంస పడిన పరితాపము అవర్ణనీయము ఇట్లారు నెల లాతడు దుర్భరదుఃఖముతో గడపెను ఆతని చేష్టలు, వింతమాటలుమాత్రము నరేంద్రునకు బోధపడలేదు కాని అతని జీవితమునకును, అతని మాటలకును అద్భుతమైన సామరస్యముకలదని నరేంద్రుడు త్వరలోనే గ్రహించెను

నరేంద్రు డీ సంఘటన నొక మిత్రునితో ఇట్లు వర్ణించెను "మహా శయా, మీరు దేవుని చూచితిరా" అని నేను పరమహంసను ప్రశ్నించితిని 'అవును నిన్ను చూచుచున్నట్లే, అంత కంటె వేయిరెట్లెక్కువగ కూడ దేవుని చూచుచున్నాను కాని భగవంతునికై త్రికరణశుద్ధిగా పరితపించు వారెవరు నాయనా! పుత్రులు లేరని, ధనములేదని విలపింతురుగాని' అని ఆయన సమాధాన మిచ్చెను ఈ మాటలు నా మనఃఫలకమున శాశ్వతముగా ముద్రితము లయ్యెను ప్రత్యక్షముగా తాను దేవుని చూచితినని పల్కిన ధీరుని కనుగొనుట నా కదియే మొదటిసారి ఈతడు దివ్యపురుషుడా లేక పిచ్చివాడా! ఒక వేళ పిచ్చివాడే యగు గాక! కాని యిట్టి దృఢమైన వైరాగ్యసం పద యెంతమంది కబ్బును! ఈతడు యథార్థమైన మహర్షి ప్రపంచ మీతని పాదసేవ యొనర్పవలయు ననుట కీ యొక్క యుదాహరణ చాలును"

రామకృష్ణుడు పిచ్చివాడని భావించినను నరేంద్రు డాతని సన్నిధిలో ఏదియో యొక అపూర్వానందమును, అనిర్వచనీయ సౌఖ్యమును అను

భవించి యుండెను తాను పాడినంతనే యాతడు బ్రహ్మానందపరవశుడగుట, దేహస్మృతి కోల్పోవుట, మరల స్మృతి కలుగుట, ఆతని సహజ సరళసంభాషణలు, శిష్యు లాతని దేవునివలె పూజించుట, ఇవన్నియు నాతనికి భ్రిగ్భ్రాంతి కలుగ చేసినవి కాని యింత గౌరవమాతనిపై తనకు కల్గినను వెంటనే మాత్ర మాతడు రామకృష్ణుని తన గురువుగా నంగీకరింపలేదు

ఒక నెల గడచిన తర్వాత నరేంద్రుడు రెండవసారి రామకృష్ణుని వద్ద కేగెను చూడగానే ఆతడు నరేంద్రునిపై దృష్టి నిగిడ్చి మెల్లగా ఆతనిని సమీపించెను ఆ తర్వాత జరిగినది నరేంద్రుని మాటలలోనే వినిపింతును—"వెనుకటి వలెనే ఆతడొక విచిత్రచర్య చేయును కాబోలు ననుకొంటిని కాని ఒక చిత్రము జరిగినది క్షణములో ఆతడు తన కుడిపాదము నా శరీరముపై ఉంచెను వెంటనే నా కొక అపూర్వానుభవము కలుగసాగెను కండ్లు తెరచుకొని చూచుచుండగనే యామందిరము సమస్తవస్తువులతో గిఱ్ఱున తిరుగ నారంభించి క్షణములో అదృశ్యమయినది నాతో బాటు విశ్వమంతయు ఒక మహాశూన్యమున లయించి పోవుచున్నట్లు తోచెను నా కిక మృత్యువు సమీపించుచున్నదనిపించెను 'నన్ను మీ రేమి చేయుచుంటిరి? నాకింట తల్లిదండ్రులున్నా'రని భయముతో వల్కితిని ఆతడు పెద్దపెట్టున నవ్వి, ఇప్పటికిది చాలును అని పలికెను ఆతడిట్లు పల్కగానే ఆ విచిత్రానుభవము త్రుటిలో మాయమయ్యెను సమస్తము నాకు మరల యథాప్రకారముగా కనుపించెను నేను మరల పూర్వపు నరేంద్రుడనైతిని "

ఇంత జరిగినను నరేంద్రుడాతని పూర్తిగా నమ్మలేదు తర్వాత ఒకసారి గురుదేవుడు సమాధినిమగ్నుడై నరేంద్రుని తాకెను ఈసారి నరేంద్రుని బాహ్యస్మృతి వీడిపోయెను స్మృతి కలి;; చూచునరికి గురుదేవుడు నరేంద్రుని హృదయము నిమురుచుండెను నరేంద్రుడు ధ్యానసిద్ధుడని, ఆత్మద్రష్టయగు మహర్షియని, నిజస్వరూపము గ్రహించిన మరుక్షణముననే యోగమార్గమున శరీరత్యాగ మొనర్చునని రామకృష్ణుడు గ్రహించెను ఇది యంతయు నరేంద్రుని గూర్చి తన్నాతడు చేరకమునుపే ఆతడు గ్రహించెను

గురుదేవుని పాదస్పర్శచే తన కపూర్వానుభవము కల్గినప్పటినుండి నరేంద్రుని మనోభావ మాతనియెడ సంపూర్ణముగా మారిపోవసాగెను రామకృష్ణుడు ఎచ్చివాడు కాడని, అహంకారమమకారములకు వశులై కామి నీకాంచనములే జీవితపరమార్థముగా తలచి లోకమను పిచ్చి ఆసుపత్రిలో నివసించుచుండు వేలకొలది ఎచ్చివారి నడుమ ఆ బ్రహ్మర్షి యొక్కడే సుస్థిరమతియని, ధీరాగ్రేసురుడని నరేంద్రుడు గ్రహించెను

పారమార్థికవిషయములలో నరేంద్రున కింకను దృఢమయిన అధ్యవ సాయము కలుగలేదు అయినను ఇందు స్వానుభవమే ఆతనికి గురువు ఏ విషయమునైనను సరే, యెవ్వరో మహాపురుషుడు చెప్పినంత మాత్రముచే, లేక యేదియో ఒక గ్రంథమున చదివినంతమాత్రముచే నమ్ముట అతని స్వభావమునకు విరుద్ధము

విద్యార్థులారా! చూచితిరా, ఈ అపూర్వగురుశిష్యుల అద్భుత సమావేశము!! ఇది నరేంద్రుడు వివేకానందుడగుటకు మొదటి మలుపు సుడీ!

గురుశిష్యులు

శ్రీరామకృష్ణనరేంద్రుల గురుశిష్యసంబంధ మద్భుతము వారిద్ద రేకశరీరమున నెలకొనియుండు మనఃప్రాణములు భగవత్సాక్షాత్కార మను మహాఫల మందిన వారెవరును తామొక్కరే దాని ననుభవించి యుండలేదు "ఏకః స్వాదు న భుంజీత" మధురపదార్థ మొంటరిగా భుజింపరాదనుట సర్వసామాన్యసూక్తి గదా! ఇక బ్రహ్మానందమను అలౌకిక మధురానుభవమును గూర్చి చెప్పవలసిన దేమి గలదు! మహ ర్షులు ఆ బ్రహ్మానందమాధుర్యమును అర్హులచే అనుభవింపచేయుటకే సదా తహతహ లాడుచుందురు రామకృష్ణునకు శిష్యకోటి అపరిమి తము నరేంద్రు నొక్కనే ఆతడింత పక్షపాతముతో ప్రేమింపనగునా! ఇది జ్ఞానియగు అట్టి మహర్షికి తగునా? యని మీరడుగ వచ్చును నరేంద్రుని సర్వవిధార్హతలు, తీవ్ర భగవత్పరితాపము ఆ శిష్యకోటిలో ఏ ఒక్కరిలోను లేకపోవుటయే అందుకు కారణము అని చెప్పిన మీరే మందురు?

నరేంద్రుని రాక ఆలస్యమయినచో రామకృష్ణుడు కాళీమాతను సమీపించి "అమ్మా, జగజ్జననీ! ఆతనిని చూడకనే నేను జీవింప

జాలనమ్మా! కరుణించి వెంటనే అతని నిటకు రప్పించి నా ప్రాణములు నిలువుము తల్లీ!" అని ప్రార్థించిన సమయములు గూడ అనేకములు గలవు గురుదేవు డిట్లు తల్లిని ప్రార్థింపగనే నరేంద్రుడు చుక్క తెగిపడిన ట్లెచటనుండియో ప్రత్యక్షమగువాడు 'చిరకాలము నుండి సేవించుచున్నవారము, మేమందరముండగా నిన్నగాక మొన్న వచ్చిన నరేంద్రునిపై ఈముసలివానికింత పక్షపాత మేలనో కదా!' అని పలికిన ఆతని శిష్యులును లేకపోలేదు ఆ దినములలో గురుదేవుడు, నరేంద్రుని నామమే జపించెను, ఆతనికొరకే పరితపించెను

రామకృష్ణుని పసిహృదయము, భగవద్భక్తిపారవశ్యము—నరేంద్రుని లోగొనగా నరేంద్రుని అచంచలాత్మ విశ్వాసము, భగవత్పరితాపము — గురువును స్వాధీనము చేసికొనెను ఆతడు శిష్యులతో నిట్లనును—"ఇచ్చటకు వచ్చు మోక్షార్థులలో ఈతని కీతడే సాటి ఈ శిష్యులలో ఒక దష్టదళపద్మము మరొకడు షోడశదళపద్మము నరేంద్రుడో సహస్రదళపద్మము! చూడు డీ బాలు డెంత వినమ్రుడో! ఎంత శాంతమూర్తియో! ఈతడు నిత్యశుద్ధుడు ఇట్టివా రీశ్వరకోటి లోనివారు, ఆచార్యకోటిలోనివారు వీరు జగద్గురుత్వము వహించుటకై జన్మించుచుందురు వీరు పొందు శిక్షణయంతయు లోకకల్యాణమునకే ఇతరులలో జ్ఞానము దీపమై వెలుగుచుండ నరేంద్రునిలో అది ప్రచండ సూర్యబింబమై ప్రజ్వలించుచున్నది " నరేంద్రుని జీవితపరమార్థము వివరించుటకు శ్రీరామకృష్ణుని యీ మాటలకంటె ఇతర ప్రమాణమేల?

గురుదేవు డీ శిష్యు నితరశిష్యుల కంటె ప్రత్యేకముగా చూచుచుండెను ఆహారవిహారాదులలో ఇతరశిష్యుల కెన్ని నియమము లేర్పరచినను నరేంద్రున కట్టివి లేవు "నరేంద్రుడు నిత్యశుద్ధుడు, జాజ్వల్య మానమగు ఆతని జ్ఞానాగ్ని దహింపజాలని ఆహారపదార్థమే లేదు గోమాంసము తిన్నను నరేంద్రునకు దోష మంటదు" అని యాతడు వచించును

నరేంద్రు డా దినములలో విగ్రహారాధనను తీవ్రముగా నిరసించువాడు రాఖాల్ అను శిష్యుడు కాళీ విగ్రహమునకు మ్రొక్కుట చూచి "ఇదేమి అవివేకము?" అని నిందించెను ఎంత నచ్చజెప్పినను నరేంద్రుడు విననందున గురుదేవుడు విసిగిపోయి "అమ్మ నొప్పుకొనని వాడవు నీ విచటికేల రావలయును! ఇక రావలదు పొమ్ము" అని

విసరికొట్టెను "ఏమీ, ఇచటకు వచ్చినంతమాత్రమున మీ కాళీమాత సిద్ధాంతము ఒప్పుకొనవలెనని యున్నదా!" అని నరేంద్రు డెదిరించెను రామకృష్ణుడు "నరేన్! త్వరపడకుము ఆ జగన్మాతకై నీవు విలపించుదినములు వచ్చి తీరును" అని పలికెను

ఆ దినములలో నరేంద్రున కద్వైతవాదము — ప్రకృతి ఆత్మ ఒకటే యను సిద్ధాంతము — అసందర్భముగ తోచుచుండెడిది నరేంద్రుడు మిత్రులతో "ఈ కూజా బ్రహ్మము ఎంతటి అవివేకము, అక్రమము, అసహజము" అని పలుకుచుండువాడు కాని రామకృష్ణుని సాహచర్య మలవడినకొలది ఆతని మనఃస్థితి విచిత్రముగ మారసాగెను చరాచర ప్రపంచమంతటను ఆతనికి బ్రహ్మము తప్ప ఇతరమేమియు కాన్పింప దాయెను భోజనముచేయ గూర్చుండునరికి భుజింపదగిన ఆ భోజన పదార్థములు, భోజనపాత్రము, భోజనమిడు తల్లి, భోక్త అగు తాను సమస్తము బ్రహ్మమే అయి గోచరింపగా ఆతడు నిశ్చేష్టుడగువాడు తల్లి ఆతని స్థితి గమనించి, "తినవేమి? నరేన్, అని హెచ్చరింపగా ఆత డదే పనిగా తినును ఈ మనఃస్థితి కొంచెము మారగానే ఆతని కీ ప్రపంచము స్వప్నముగా తోచెను చివర కద్వైతసిద్ధాంత మాతనికి ప్రత్యక్ష గోచరమయ్యెను ఈ విధముగా ఆతనికి గురుదేవునియందు భక్తి తాత్పర్యములు వేయిరెట్లు పెరిగెను

శ్రీరామకృష్ణు డెవ్వరినైనను పూర్ణముగా పరీక్షింపనిదే తన శిష్యునిగా చేసికొనువాడు కాడు అట్లే ఆయన నరేంద్రుని గూడ కఠినపరీక్షలకు గురి చేసెను ఈ శిష్యుని చూడగనే గురువు స్మృతి కోలుపోయి సమాధిస్థితి నందుట మన మెరుగుదుము కదా!

ఒకపరి నరేంద్రు డాతని యొద్దకు వచ్చెను గురువు పలుకరింపలేదు కన్నెత్తి చూడలేదు పెడమొగము కూడ పెట్టెను ఇంత చేసినను నరేంద్రుని కాతనియెడ గురుభావము రవంతయైన మారలేదు ఇట్లనేకపర్యాయములు జరిగెను అయినను నరేంద్రు డాతని వద్దకు వచ్చి పోవుచునే యుండెను రామకృష్ణు డాతని యచంచలభక్తికి సంతసించి "వత్సా, నేను నీతో నోరు విప్పి అయినను మాటాడుటలేదు కదా, నీవు వచ్చుచునేయుంటి వేల?" అని అడిగెను "అయ్యా! మీరు మాట్లాడక పోయినంతమాత్రమున నే నూరకొందునా?" అని నరేంద్రుని

సమాధానము! శ్రీరామకృష్ణుడు తన శిష్యుని గురుభక్తికి బ్రహ్మానంద మందెను

మరొకసారి గురువు నరేంద్రునితో "ఘోరతపముచే నేను సాధించిన శక్తులను నీ కిచ్చెదను, పుచ్చుకొమ్ము" అని పలుక "భగవత్సాక్షాత్కారమునకు వినియోగించనివి నాకెందుకు?" అని ఆతడు వానిని తిరస్కరించెను

ఈ గురుశిష్యుల యనురాగము నెంతని వర్ణింపగలము! ఆ వర్ణనకు తగిన మాటలు నాబోటి సామాన్యున కెట్లు లభించును? ఒకవేళ యెట్లో ప్రయాసపడి వానిని వెదకితెచ్చి కూర్చగల్గినను ఈ చిన్ని పొత్తమున వానిని వివరింపదగిన తా వేది? భగవత్సాక్షాత్కార మను మహాభాగ్యమునకు నోచుకొన్న యీ గురుశిష్యుల ప్రేమానురాగము లూహాతీతముగదా!

బుద్ధివికాసము గుణవిశేషములు

ఆత్మను దర్శించుటకు సహాయపడని విద్య విద్యగాదు దాని పేరు అవిద్య శాస్త్రము చదివినంతనే, కళలను అభ్యసించినంతమాత్రమున ఎవ్వడును పండితుడు కాడు ఆత్మను గూర్చి తెలిసికొన్నవాడే పండితుడు అట్టి పండితునకు చదువుట, వ్రాయుట చేతకాకపోయినను లోపములేదు, ప్రమాద మంతకంటె లేదు

శ్రీ రామకృష్ణున కేమి పాండిత్యము కలదని నరేంద్రు డాతని నాశ్రయించెను? భగవంతుని దర్శించుటయే ధర్మము ఆత్మజ్ఞానమే వేదాంతము నేటి విశ్వవిద్యాలయమున ఆతడు చదివినాడు, కాని సనాతన విద్యావిధానమును వదలలేదు పూవునకు తావి పుట్టుకతోనే అబ్బినట్లు సహజముగనే ఆతడు పారమార్థికచింత కలవాడు తల్లిదండ్రులు దానికి గూడ వన్నె తెచ్చు గురుచరణసన్నిధియు తోడుపడగా ఆతని ప్రతిభ దినదినాభివృద్ధి గాంచసాగెను

కళాశాలలో నరేంద్రుడు తత్త్వశాస్త్ర మభిమాన విషయముగా నభ్యసించెను పాశ్చాత్యతత్త్వశాస్త్రజ్ఞుల గ్రంథములు కూలంకషముగా తరచి వాని సారము గ్రహించెను సనాతనభారతీయ వేదాంతశాస్త్రములను,

వాని వ్యాఖ్యానములను ఆధునిక దృష్టితో అధ్యయనము చేసె రెంటికి గల తారతమ్యము పరిశీలించబూనెను కాని సనాతన ధర్మసిద్ధాంత ములను ఆతడు శిరసావహించుటకు మాత్రము గురుచరణ సన్నిధియే ముఖ్యకారణము

వేదాంతము నరేంద్రునకు కిరీటము కాగా కవిత్వ మాతనికి కంఠాభరణ మయ్యెను సంస్కృతాంగ్లములలో ఆత డా వయసు ననే అనర్గళముగా పద్యము లల్లువాడు విద్యార్థులైన మీరు చక్కగా చదువు కొని ఆ మహర్షియొక్క కవిత్వ మర్థము చేసకొని భావము గ్రహించి ధన్యత గాంతురుగాక!

ఈ ప్రపంచ మస్థిరము స్థిరమయిన ఆత్మతత్వమును కనుగొన్న వాడే ఆనందామృతమున ఓలలాడగలడు గ్రుడ్డి వాని చేయి పట్టుకొని నడచు అంధుడు గమ్యస్థానము చేర జాలనట్లే అనిత్యమగు శరీరసుఖ ములను నమ్ముకొన్నవాని స్థితిగూడ త్రిశంకుస్వర్గమువలె ఉభయభ్రష్టము కాగలదని ఆతని విశ్వాసము కనుకనే ఆత్మదర్శనములకై ఆత డా వయసునుండియే కృషి చేయసాగెను దానికి శ్రీరామకృష్ణ సన్నిధి కూడ ఎంతో దోహద మిచ్చెను

గానము, ధ్యానము, గ్రంథపఠనము ఇవి మాత్రమే నరేంద్రుని మనస్సు నాకర్షించినవి సాంసారిక విషయములపై ఆతనికి రోత పెరు గుసాగెను స్వభావముచే నరేంద్రుడు వేదాంతి కాని శ్రీరామకృష్ణుని సాహచర్యముచే భక్తుడుగా మారెను ఈతని భక్తి క్రమముగా వృద్ధి చెందెను దైవభక్తి తప్ప మరి ఏ విషయముమీదను దృష్టి పోనందున అతని ఆ భక్తికి ప్రహ్లాదుని భక్తితోనే పోలికతెచ్చుట తప్పనిసరిగదా!

"మందారమకరంద మాధుర్యమునఁదేలు మధుపంబు వోవునే? మదనములకు
నిర్మల మందాకినీ వీచికలఁదూగు రాయంచ చనునే! తరంగిణులకు
లలిత రసాల పల్లవ ఖాదియై చొక్కు కోయిల సేరునే? కుటజములకుఁ
బూర్ణేందుచంద్రికాస్ఫురిత చకోరకం బరుగునే? సాంద్రనీహారములకు
నంబుజోదర దివ్యపాదారవింద
చింతనామృతపానవిశేష మత్త చిత్తమేరీతి నితరంబుఁ జేరనేర్చు
వినుతగుణశీల! మాటలువేయునేల!"

విపత్పరంపర

1884వ సంవత్సరమున నరేంద్రుడు బి ఏ , పట్టపరీక్ష కేగెను తర్వాత అతని కొక్క మహావిపత్తు తటస్థించెను పరీక్షాఫలితము లింకను రాలేదు కలకత్తావద్దనున్న బారానగరమున నరేంద్రుడు తన యింటిలో గానము చేయుచు ఆనందామృతమున ఓలలాడుచుండగా గుండెజబ్బుచే తన తండ్రి మరణించెనను వార్త అతని గుండెను బల్లెపుపోటై అతని నిశ్చేష్టుని చేసెను కొంతవడికి తెలివొందెను దిగ్భ్రాంతితోనే అతడు శవముతో రుద్రభూమి కేగెను

తండ్రిని చూచి యాతని కన్నీరు కాలువలు కట్టి సాగెను తండ్రి శవమా ఇది? తన తండ్రి తన్నెంత ప్రేమించినాడు? అట్టివాడు చనిపోవుట యేమి? ప్రేమమూర్తి యగు తండ్రిలేనిదే తాను బ్రతుకుటయా! అసలు తాను బ్రతుక గలడా! ఇట్టి దుఃఖభావసంఘర్షణతో అతని ధీరహృదయ మెంతో కలవరపడెను

కట్టెలతో చితి పేర్చబడెను శవము నందుంచిరి నరేంద్రు డగ్ని నంటించెను అంతయు జ్వాలామయ మయ్యెను ఆ జ్వాలలను చూచి నరేంద్రున కజ్ఞానము నశించి జ్ఞానోదయమయ్యెను అతని కప్పుడీ భావములు మనసున పొడమెను-" ఈ దగ్ధమగునది శరీరము మాత్రమే నశించుటయే దాని స్వభావము! ఇందుండు ఆత్మమాత్రము స్థిరమే గదా! అస్థిరముగు ఈ శరీరముపై నాస కోసినైచు కొనుటయే వివేకవంతుల లక్షణము " ఈ విధముగా చివరకు నిర్ణయించుకొని అతడు తన విద్యా విజ్ఞానసంస్కార బలముచే వివేకవంతుడయ్యెను దగ్ధశేషము నాతడు గంగార్పణము చేసి నిశ్చింతుడయ్యెను

అతని కష్టపరంపరలకు జనకుని మృతియే నాంది భోగభాగ్యములతో అల్లారుముద్దుగ పెరిగిన నరేంద్రుడు దుర్భరదారిద్ర్యమునకు గురియయ్యెను తండ్రి సిరిసంపద లాతనితోనే పోయినవి నలువురు తోబుట్టువులు, తల్లి ఇంతమంది నాత డొక్కడే పోషింపవలసివచ్చెను గోరుచుట్టుపై రోకటిపో టన్నట్లు తండ్రిచేసిన అప్పులు తీర్చుమని ఋణదాతలు గూడ చుట్టుముట్టి అతనిని పీడింపసాగిరి దీనికి తోడు కొద్దియో గొప్పయో మిగిలిన యాస్తిని దాయాదులు హరించు క క

కంకణులై రి నాటి యాతని దుఃస్థితిని ఈ పద్యముతో కొంతవరకు వర్ణింపవచ్చునేమో చూడుడు!

గురువుల రాక, దాసిమృతి, గుబ్బవు దాడియు, నల్లవల్కుయున్,
వరవతిగర్భవేదన, వివాహము, విత్తులుజల్లు కార్తెయున్,
పొరుగున నప్పుబాధ, చెవిపోటును, వీథిని, దొమ్మరాటయున్,
కలవు, దరిద్ర, మార్గికము కల్గి నొకప్పుడు, కృష్ణభూవరా!

నరేంద్రు డింకను న్యాయకళాశాలలో చదువుచునే యుండెను ఎంత దూరమైనను నడచిపోవలసిన దుర్గతి యాతనికి పట్టెను కాలికి జోడు కూడ కరవాయెను సరియయిన దుస్తులు నున్న కొన్నిమార్లాతడు పస్తులతోనే బడి కేగువాడు మిత్రు లాతని తమయింటికి భుజింప రమ్మని ఎలుచుచుండువారు కూడ కాని తన కుటుంబదుఃస్థితిని తలచి యెవరింటికిని ఆతడు పోవువాడు కాడు గడపె డాకలితో ఇంటికేగి వారు తినగా మిగిలిన యే కలియో, గంజియో త్రాగి బడి కేగువాడు ఈ బాధలలో చదువెట్లు సాగును? కాన విధిలేక ఆతడు చదువునకు స్వస్తి చెప్పవలసిన వాడయ్యెను

దారిద్ర్యబాధనుండి తన కుటుంబమును ఎట్లో కాపాడుటకై ఆత డీశ్వరచంద్రవిద్యాసాగరుని పాఠశాలలో ఉపాధ్యాయుడుగా కొంతకాలము పనిచేసెను ఎంత కష్టించినను కడుపార భుజించుటకు గూడ ఆతడు నోచుకొనలేదు కాని ఈ విపత్పరంపర లను అగ్నిజ్వాలలే ఆతని జీవితమును బంగారమునకు మెరుగుపెట్టి ఆతనిని ఉజ్జ్వలతేజునిగా, సాహసికాగ్ర గణ్యునిగా చేసినవి ఈ కష్టములే తనను నిజమయిన మానవునిగను, కార్యశూరునిగను చేసినవని తలచి వాని కాతడు తన కృతజ్ఞతాంజలుల నర్పించెను

కష్టములు పెరుగుచున్నకొలది ఆతనికి వాని నెదుర్కొని తీరవలె నను పట్టుదలకూడ పెరుగసాగెను నిశ్చల భగవద్భక్తి, నామసంకీర్తన తనకు తోడు కాగా కష్టములలో గూడ ఆతడు నిర్వికారచిత్తముతో కాలము గడపువాడు తన ముద్దుకొమరుని కష్టములు చూడలేక భక్తి పరాయణ యగు భువనేశ్వరీదేవిగూడ విసిగిపోయి చివరకు "మూర్ఖుడా, చాలు నీ ప్రార్థనము, చిన్ననాటినుండియు దేవుడు దేవుడని అరచి గొంతు చించుకొంటివి గదా! నీ కాతడు చేసిన మేలేది చూపుము!"

అని గర్జించెను ఈ సంఘటనతో గజేంద్రుని హృదయము వలెనే నరేంద్రుని హృదయము గూడ తాత్కాలికముగ దేవుడున్నాడా! లేడా యని సంశయ డోలలో నూగులాడెను

"కలడందురు దీనులయెడఁ, గలఁడందురు పరమయోగిగణముల పాలన్,
కలఁడందు రన్ని దిశలను, కలఁడు కలండనెడివాడు కలడో? లేఁడో!"

—భాగవతము

చివరకు నరేంద్రుడు గురుదేవునివద్దకేగి తెగించి "ఈ దుర్భరదారిద్ర్య దావాగ్నినుండి మీ యీ శిష్యుని కుటుంబమును మీరు కాపాడకపోయిన మా గతి యేమగును? దేవుడున్నాడో, లేడో, ఒక వేళ ఉన్నను మా కుటుంబముపై కక్షగట్టినాడేమో! గురువు తర్వాతనే గదా దేవుడు! మీరు మమ్ము కటాక్షింపక తప్పదు!" అని మొరపెట్టుకొనెను

రామకృష్ణుడు 'నేనీ తుచ్ఛవిషయమును తల్లి యెదుట ప్రస్తావించజాలనని, వలసిన నీవే వెళ్ళి దక్షిణేశ్వరములోని కాళిమాత యెందులకై ప్రార్థింపు'మని పలికెను ఆతని యానతిప్రకారము నరేంద్రుడు తల్లి నడుగబోయెను కాని చిత్రము! ఆమె దివ్యమంగళస్వరూపము దర్శింపగనే తాను వచ్చిన పని మరచిపోయి ఆమెను పాదాదికేశపర్యంతము స్తుతింపసాగెను రెండుమూడు మార్లిట్లు జరిగెను "ఏమి నాయనా, తల్లిని నీ కోర్కె తీర్పుమని ప్రార్థించితివా" అని రామకృష్ణు డడుగగా "నేను ఆమెను దర్శించగనే నా తుచ్ఛమగు కోరికను మరచిపోవుచున్నాను ఆ పని నావలనగాదు మీకు మాత్రము తప్ప" దని విన్నవించెను శిష్యవత్సలుడగు గురువు దయతో "సరి మీ కుటుంబమునకు ఇక అత్యావశ్యకమగు అన్నవస్త్రముల కెట్టి కొదువయు ఉండదు" అని వర మనుగ్రహించెను లోకమాత కాళికాదేవియే గురువు వాక్కున నిలిచి నరేంద్రుని యీ కోరిక తీర్చె ననుటలో సందేహ మేమి?

'కలలోనం దను మున్నెఱింగిన మహా కష్టాత్ములై నట్టి దు
ర్బలు లాపత్సమయంబున న్నిజపదాబ్జాతంబు లుల్లంబులోఁ
దలఁప, న్నంతన మెచ్చి యార్తిహరుఁడై తన్నైన నిచ్చున్, మని
శ్చలభక్తిన్ భజియించువారి కిడఁడే? సంపద్విశేషోన్నతుల్!'

— పోతనామాత్యుడు

భగవంతుడు లోకమాతయని భావము కలుగుట కేమి, విగ్రహారాధన విస్పష్టమగుట కేమి నరేంద్రుని కిదియే ప్రారంభము నరేంద్రుని యీ మహత్తర పరివర్తనము గాంచి రామకృష్ణు డపరిమితానందమగ్నుడయ్యెను

గురునిర్యాణము

శ్రీ రామకృష్ణుని అధ్యాత్మ విద్యాశిక్షణవిధానము అత్యద్భుతము ఆటపాటలలో ఆతడు మహోన్నత విషయములు గూడ అరటిపండు ఒలిచి అరచేత బెట్టినట్లు బోధించెడువాడు ఆ సద్గురువు సన్నిధి లభించిన మన నరేంద్రు డెంత ధన్యుడో గదా! శిష్యకోటిలో నరేంద్రుడొక్కడే రామకృష్ణునకు పరమప్రీతిపాత్రు డగుటకు ఆతని పూర్వజన్మార్జిత సుకృతమే ప్రధానకారణము!

నరేంద్రుని గానవాహినిలో రామకృష్ణుడును, ఆతని గీతామృతమున నరేంద్రుడును మునిగిపోయి ఒడలుమరచుట ఆ యిద్దరకు పరిపాటియే ఈ యిరువురి బ్రహ్మానందస్థితి చూచిన యితర శిష్యులు గూడ ఒడలు మరచిపోవుచుండు వారనుటలో అబ్బురమేమి?

'విగ్రహారాధన చేయదగునా'యని నరేంద్రుడు ప్రశ్నింప గురువు 'ఏ విధముగా ఆరాధించినను సరియే తీవ్రపరితాప మొకటే భగవద్దర్శనమున కావశ్యకము కాని భగవద్దర్శన కాంక్షమాత్రము చాలదు ప్రతిజీవియు పాక్షాద్భగవత్స్వరూపమని గ్రహించి చేయవలసినది దేశసేవ' అని సమాధాన మిచ్చును గురుదేవుడు బహ్మానందసాగరమున మునిగి కనుగొన్న ఆధ్యాత్మిక రత్నరాసులను నరేంద్రుడు ప్రపంచమున కందింపవలసిన సమయ మాసన్నమాయెను

ప్రతిదినము సుమారు పదిగంటలు నిద్రాహారము లంటకుండ శిష్యులకాధ్యాత్మిక విద్యాబోధన చేయుచున్న శ్రీరామకృష్ణునకు అనారోగ్యము ప్రబలెను అది కంఠమున వ్రణముగా రూపొందెను వైద్యులసాయము తేలికగా లభించుటకై ఆతని బస దక్షిణేశ్వరమునుండి కలకత్తాలో కాశీపురము అను ప్రాంతమునకు మార్చిరి తన మరణసమయము సమీపించినదని ఆ యోగిపుంగవుడు దివ్యదృష్టిచేత తెలిసికొని ముందు జాగ్రత్తలు పడసాగెను

తన ఆశయములు కార్యరూపమునకు తెచ్చుటకై ఆతడు శిష్యులకు చక్కని శిక్షణగూడ ఇచ్చెనని మీకు తెలిపితినిగదా! వారిలో నాయకమణియగు నరేంద్రుని ఆతడు ముందే తన యుత్తరాధికారిగా నియమించియుండెను తా నీ లోకము వదలినచో వారికి దిక్కెవ్వరని విచారించిగూడ నరేంద్రుడే తన సమస్తబాధ్యతలు నిర్వహింపగలడని తలచి గురుదేవుడు స్తిమితపడెను పరమహంస ఇట్లనెను "చూడు నరేన్, ఈ బాలుర నందరను నీ చేత బెట్టుచున్నాను పాల ముంచినను, నీటముంచినను నీదే భారము నేను గతించిన తర్వాత గూడ వీరు తమ యిండ్లకు పోరాదు పారమార్థిక బాధ్యతలు వీరు విడువకుండునట్లు చూచు బాధ్యత నీదే సుమీ!"

భావి సన్యాసజీవితమునకు సంసిద్ధుల నొనర్చుటకై గురువు బాలశిష్యుల నొక్కనాడు 'ఇంటింటికి తిరిగి బిచ్చ మెత్తుకొని రండు' అని ఆజ్ఞాపించెను వెంటనే వారందరు హరినామస్మరణతో భిక్షాటన చేసి బియ్యముతెచ్చి వండి గురువున కర్పించిరి ఆదర్శమూర్తియై తమ కిట్లు మార్గదర్శకు డయిన రామకృష్ణునెడ నరేంద్రుని భక్తిభావము నానాటికి అభివృద్ధి చెందసాగెను అట్టి ఆతని యస్వస్థత నరేంద్రునకు పరితాపకారణ మయ్యెననుటలో ఆశ్చర్యమేమి?

గురుశిక్షణచేతను, కటాక్షముచేతను, ధ్యానము నరేంద్రునకు స్థిరాభ్యాసమగుచుండెను స్పర్శమాత్రమునకే ఆతడు తన దివ్యానుభూతి నితరులకు ప్రసాదింప సమర్థుడయ్యెను అనేక జన్మార్జిత తపఃఫలమగు నిర్వికల్పసమాధి నరేంద్రున కీ సమయముననే లభించెను అపుడే గురు వా బాలశిష్య్య లందరకు కాషాయవస్త్రములు, రుద్రాక్షమాలలు పంచిపెట్టెను తన దినములు సమీపించినవని యెరిగి రామకృష్ణుడు భవిష్యత్తున నరేంద్రుడు తన శిష్యుల నెట్లు ఐకమత్య మను సూత్రమున కట్టవలెనో, సన్యాసజీవితమునకు వలయు శక్తిసామర్థ్యములను వారల కెట్లలవడ జేయవలెనో, వారల నెట్లు ప్రేమించి ఆదరించవలెనో బోధించెను ఆతని మహాసమాధి కిక మూడునాల్గు దినములు మాత్రమే గలవు నరేంద్రు నాతడు తన యొద్దకు పిలిచి తదేకదృష్టితో ఆతని చూచుచు ధ్యాన నిమగ్నుడాయెను తోడనే విద్యుత్ప్రసారమువలె ఒక సూక్ష్మ శక్తితరంగము తనలో ప్రవేశించుచున్నట్లు నరేంద్రునకు తోచెను వెంటనే నరేంద్రుడు బాహ్యస్మృతి కోలుపోయెను స్మృతి వచ్చిన

వెనుక ఆతనితో గురువు ఇట్లు పలికెను-- "నేడు నా సర్వస్వము నీకు ధారవోసి నేను ఫకీరునైతిని నేనొసగిన యీ శక్తిచే నేను చేయ జాలని ఘనకార్యములను నీవు చేసి లోకమున విఖ్యాతి నందగలవు "

ఈ విధముగ అనేకవత్సరములు ఘోరతపముచేసి గురుదేవు డార్జించిన అఖండ శక్తి, అనిర్వచనీయ ప్రతిభ, ఆధ్యాత్మికసంపద నరేంద్రున కప్రయత్నముగా లభించినవి ఎవరైన ఒక పుష్పము నిచ్చునట్లు, కానుక నొసగునట్లు, గురువు తన సర్వస్వమును లోకకల్యాణమునకై ధారపోసెను త్యాగమున కింతకంటె పరమావధి యేది?

గురువు మహాసమాధి కిక రెండు దినములు మిగిలెను తటాలున నరేంద్రు డిట్లనుకొనెను "ఈయన అనేకపర్యాయములు తా నవతారమూర్తినని తెలిపినాడు కాని శరీరబాధచే, మరణయాతనచే దుర్భరమగు ఈ స్థితిలో గూడ తా నవతార మూర్తినే యని చెప్పినచో నమ్మెదను " ఆతని యూహా గమనించి వెంటనే గురుదేవుడు "నాయనా, నీ కింకను సంశయము తీరలేదా? సరే వినుము— ఎవ్వడు రాముడో, ఎవ్వడు కృష్ణుడో వాడే ఈ శరీరమున రామకృష్ణుడు" అని పల్కెను రామకృష్ణ డవతార మూర్తి అనుటకు నిదర్శనము కన్నులార గాంచి గూడ తాను గురువును సంశయించినందుకు నరేంద్రుడు సిగ్గుతోను పశ్చాత్తాపముతోను కుంచించుకొని పోయెను

శ్రీ రామకృష్ణు డపరిమిత శరీరయాతన లనుభవించుచు గూడ నరేంద్రుని చేరబిలిచి యంత్యోపదేశము నొసగెను ముమ్మారు కాళీమాతను, సంస్మరించి 1886వ సంవత్సరము ఆగష్టు 16 వ తేదిన శ్రీ పరమహంస అఖండసచ్చిదానందమయమగు పరబ్రహ్మతో ఐక్యమందెను

కాశీపురోద్యానభవనము దుఃఖనిలయ మయ్యెను తండ్రి లేని బిడ్డలవలె శిష్యులు దీనులయి విలపింపసాగిరి బ్రహ్మతేజస్సుచే ప్రకాశించు తమగురువునేత్రములు మూతపడుట నిజమేనా? ఇక నవి యెప్పటికిని తెరచుకొనవా? వేలసంఖ్యలో నన్ను తన శిష్యుల నేత్రములు, తద్వారా యావత్ ప్రపంచ ప్రజల కన్నులు తెరపించుటకు పాటుపడిన ఆయన కన్నులుమూయుట ఎట్టిమాట!

శిష్యులా యోగిశరీరమును కాషాయవస్త్రముచే కప్పి చందనాదులచే అలంకరించిరి భౌతిక శరీరమును సమీపమున ఉన్న బారానగర

శ్మశానమునకు గొనిపోయిరి ఆజ్యముతో, సుగంధద్రవ్యాదులతో ఆయన భౌతికశరీరము దగ్ధమై పంచత్వమందెను

కాని నిజముగా గురుదేవుడు మరణించెనా? ఆత్మజ్ఞాన స్వరూపుడై అమృతత్వమందిన యాతడు మరణించుటెట్లు? ఎవ్వాని జీవితము, సదాచరణము, విశ్వకల్యాణకారణములై విలసిల్లుచున్నవో, అట్టి శ్రీగురు దేవుడు భౌతికశరీరము చాలించినంత మాత్రమున మరణించెననవచ్చునా? శ్రీరామకృష్ణుడు శిష్యుల యంతరాత్మకాడా! విశ్వాంతర్యామి కాడా?

మహాపురుషులు మరణించిరనుట మన అజ్ఞానము నిజమునకు వారు శరీరమువదలి తర్వాతనే వారి ఆత్మలు జ్ఞానవిజ్ఞాన తరంగములై సుకృతాత్ముల హృదయతంత్రులు మీటి వారిలో జ్ఞానచైతన్యములు కల్గించును అట్టివారి యొక్కొక్క ఆత్మ కోటిగుణితమై విశ్వమానవుల హృదయమందిరములలో గూడు కట్టుకొనును

తీర్థయాత్రలు బోధలు

గురుదేవునిపై తాము ఇంతవరకు చూపిన భక్తితాత్పర్యములు శిష్యులందరు నరేంద్రునిపైపు మరలించిరి తన నాయకత్వముచేతను, ప్రేమాదరములచేతను నరేంద్రుడు శిష్యులందరను శ్రీరామకృష్ణుని మఱపించునట్లు చేసెను అచటకు సమీపమున కలకత్తాలోనున్న బారానగరమున ఒక యింట గురుదేవుని అస్థులను, ఛాయాపటమును స్థాపించి పూజాసంకీర్తనాదు లొనర్ప సాగిరి నేడు జగద్వ్యాప్తమై ఒప్పారుచున్న శ్రీరామకృష్ణమఠసేవాశ్రమముల కీ బారానగరమఠమే బీజము

నరేంద్రుని గురుత్వమున, ఆతని సహచరులు, శిష్యులు సమస్త విద్యలను తరచిరి సర్వశాస్త్రములు పరిశోధించిరి ధ్యాన సంకీర్తనాదులతో కృష్ణాష్టమి, మహాశివరాత్రి మున్నగు పర్వదినములు భక్తులుత్సాహముతో జరుపుకొనువారు ఆ బాలసన్యాసుల తపశ్చర్య పెద్దపెద్ద విరాగులను, భక్తులను గూడ ఆశ్చర్యసముద్రమున ముంచి వేయుచుండెడిది అనేక దినములు వారు నిరాహారులుగనే గడపువారు ఉడకబెట్టిన ఆకులు, అన్నము, ఉప్పు నేలలకొలదిగూడ ఇవియే వారి కాహారము నిరంతర జపధ్యానాదులచే భగవదావేశపూరితులై వారు గడపిన దినములు తలచిన మనకు గూడ ఒడలు పులకరింపక మానవు

ఆ మరముననే నరేంద్రుడును, సోదర శిష్యులును సన్న్యాసదీక్షదార్చిరి ప్రారంభమునుండి ఆ శిష్యులలో సన్న్యాసజీవితేచ్ఛ ప్రబలుచుండెను వారిలో కొందరు గురుపత్ని మాతృశ్రీ శారదాదేవితో బృందావనమున కేగిరి మరికొందరు హిమాలయ ప్రాంతారణ్యములకును, పుణ్యక్షేత్రములకును పయనమైరి నరేంద్రుడు మాత్రమే వీరందరి బంధమును తొలగించుకొని తానొకడే తీర్థయాత్రకై బయలుదేరెను

మొట్టమొదటగా ఆతడు వారణాసీక్షేత్రమును దర్శించెను యుగయుగములనుండి ఆ నగరము సనాతన ధర్మసామ్రాజ్యమునకు కేంద్రస్థానము వేదవేదాంతాది సమస్తవిద్యానిలయము, యతీశ్వరకోటి నివాసము నరేంద్రుడు డట ఆ గంగానదిలో మునిగి తన ఎదలో ఏ మూలనో మిగిలియున్న సుంత తాపమును గూడ పెకలించి పారవేసెను తన జన్మకు కారకుడయిన విశ్వేశ్వరుని దర్శించి "హర, మహాదేవ, దుష్టసంహార, రుద్ర!" అని ప్రార్థించి ఆనందపారవశ్యముచే మైమరచునట్లు శివతాండవమే చేసెను

ఆతడు కాశీనగరమును అనేక పండితులను, పరివ్రాజకులను, పీఠాధిపతులను దర్శించెను వారందరు నరేంద్రుని అద్భుతప్రతిభకు, అఖండ భగవత్పరితాపమునకు ముగ్ధులయిరి అటనే ఆతడు నిరంతర భగవద్ధ్యాన నిమగ్నుడైయుండు త్రైలింగ (తెలుగు) స్వామిని దర్శించి పులకితాంగుడయ్యెను భాస్కరానందస్వామియను మహాపండితు డీతని వాగ్ధాటిని చూచి దిగ్భ్రాంతుడై "ఈతని నాల్కపై సరస్వతి తాండవించుచున్నది ఈతని హృదయము దివ్యతేజోనిలయము" అని ప్రశంసించెను

అయోధ్యలో నరేంద్రుడు శ్రీమద్రామాయణ వైభవమును కన్నులార గాంచెను ఆగ్రాలో తాజ్‌మహల్ దర్శించి ఆశ్చర్యానందముల నందెను బృందావనమున కేగుచు దారిలో ఒక పాకీవాని పొగగొట్టముతో పొగ పీల్చి "చండాలోఽస్తు స తు ద్విజోఽస్తు గురురిత్యేషా మనీషామమ" అను శంకర భగవత్పాదుల శ్రీసూక్తి నాచరణకు తెచ్చెను ఈవిధముగ నరేంద్రుడు సర్వాత్మైక్యభావము నమ్ముచు జాతిభేదాదులు మట్టుపెట్టెను

రాధాకృష్ణులకు నిలయమయిన బృందావనము నాతడు దర్శించెను గోవర్ధనగిరికి ప్రదక్షిణము చేయుచు, అయాచితముగ లభించిన

దానినే భుజింతునని ప్రతిన బూనెను ఆకలి భాధచే దీర్ఘయాత్రచే ఎంత యలసినను స్థిరసంకల్పుడై ముందుకే ఆతడు సాగుచుండెను ఆతనికి వెనుకనుండి ఎవరో తన్ను పిలుచుచున్నట్లు వినబడెను నరేంద్రుడు మాత్రము పరమేశ్వరుని కృపను పరీక్షింప నిశ్చయించుకొనినందున వెనుదిరుగక శక్తికొలది ముందుకే పరుగిడసాగెను ఆ వ్యక్తి గూడ ఒక మైలు పరుగెత్తి ఆతనిని పట్టుకొని చేతనున్న ఆహారమాతని ముందిడి అదృశ్యుడయ్యెను నరేంద్రుని యప్పటి మానసికాహ్లాదము వర్ణింప నేరితరము!

అటనుండి యాతడు ప్రయాణమై రాధాకుండము దర్శించి హరిద్వారము చూడనేగెను దారిలో ఆతడు హత్రాస్‌స్టేషను వద్ద ఆగెను ఆ స్టేషనుమాష్టరు శరచ్చంద్ర గుప్తుడు ఆతని ప్రార్థనచే నరేంద్రుడు కొన్నిదినము లచట గడపెను స్వామితలపై ఎత్తుకొన్న మహాకార్యభారమును గూర్చి విని శరచ్చంద్రుడు స్వామికి తోడునీడగ ఉండుటకు తన కవకాశ మిమ్మని ప్రార్థించెను నరేంద్రు డాతనిని "దండకమండలువులు తాల్చి భిక్షాపాత్ర ధరించి యీ మహాకార్యనిర్వహణార్థము జీవిత మర్పింప గలవా? ఇంటింటికి తిరిగి భిక్ష మెత్తగలవా?" అని ప్రశ్నించెను అన్నింటికి సిద్ధమైన శరచ్చంద్రునకు నరేంద్రుడు మంత్రోపదేశముచేసి తన శిష్యునిగా గైకొనెను తన యుద్యోగము మరొకరి కప్పగించి శరచ్చంద్రుడు గురువువెంట హృషీకేశమున కరిగెను తర్వాత ఆతని గురుభక్తిని నరేంద్రుడు పలుమారులు ప్రశంసించెను కొంతకాలము తర్వాత ఆతడే సన్న్యసించి సదానందుడను పేరుతో మఠమందలి సమస్త కార్యభారమును వహించెను

హృషీకేశమున సోదరశిష్యుడగు అభేదానందస్వామి మన్నెపుజ్వరముచే బాధపడుచుండెను నరేంద్రు డాతని స్వస్థతకు వలయు సౌకర్యములు కలిగించి కాశీకేగి ఘోరతపమాచరించెను ధనములలో కెల్ల తపోధనము గొప్పది కదా! కాననే భర్తృహరి దాని ఆవశ్యకత నిట్లు నొక్కి చెప్పెను

"చెలువౌ రత్నఘటంబునం దతడు సుశ్రీఖండ ఖండంబులం
దిలపణ్యాకము వండె, వారుగల కర్షిన్ సప్తపర్ణావృతుల్
నిలిపెన్, జిల్లెడు దూదికై పుడమి దున్నెన్ పైడినాగేళ్ళ,ని
మ్ముల నెవ్వం డిలఁ గర్మభూమిఁ బుట్టి యెవ్వఁడు తపంబుల్ సేయఁడ ప్రాజ్ఞతన్"

శ్రీరామకృష్ణుని శిష్యుల యగ్రగణ్యులలోనివాడగు బలరామబోస్ మరణ వార్తవిని నరేంద్రుడు దుఃఖసాగరమున మునిగెను "మీరు సన్న్యాసులు గదా! మీరు కూడ విచారపడుటయా?" అని ఒక భక్తుడు స్వామిని ప్రశ్నించెను "ఏమీ! సన్న్యాసియైనంత మాత్రమున హృదయమింకి పోవుననుకొంటివా? మేము శుష్క వేదాంతులము కాము" అని నరేంద్రుడు జవాబు చెప్పెను పరుల దుఃఖమును చూచి బాధపడుట మాత్రమే గాక యట్టి బాధాపరితప్తుల బాధలు నివారించి శాశ్వతమగు శాంతిని కూర్చుటకే బుద్ధభగవానుడు కూడ సన్న్యాసము స్వీకరించినాడు కేవలము తన కుటుంబమున కొక్క దానికై మాత్రమే పరితపింపక లోకకల్యాణ మాచరించుటయే గదా సన్న్యాస యగుటకు పరమ ప్రయోజనము!

స్వామి 'మీారటు' వెళ్ళి అచట ఒక గ్రంథాలయము నుండి కొన్ని పాశ్చాత్యతత్త్వ శాస్త్ర గ్రంథములు తెప్పించి చదవి మరునాడే వానిని పంపి వేసెను గ్రంథాలయపాలకుడు "స్వామీ, అపుడే వానినన్నిటిని చదివివేసితిరా" అని ప్రశ్నించెను "పూర్తిగా చదివితిని ప్రశ్నింపుము" అని పలికి ఆతని ప్రశ్నలన్నిటికి నరేంద్రుడు కంఠస్థము చేసినట్లు తడవు కొనకయే సమాధానము లిచ్చెను ఈ పని యెట్లు సాధ్యమ యినదని అఖండానందు డడుగగా నరేంద్రుడు "పుస్తక మందలి ప్రతి పదము నేను చదువను, చిత్రప్రదర్శనరీతిని ప్రతివాక్యమును పరిచ్ఛేద మును ఒక్కుమ్మడి చదివెదను" అని బదులు చెప్పెను

శ్రీరామకృష్ణపరమహంస జ్ఞాపకార్థము కలకత్తాలో గంగానదియొడ్డున ఒక ఆలయము నిర్మింపవలెనని స్వామి మిగుల తహతహ లాడెను ఆ పరితాపమును, మహాసంకల్పమును నేడు కలకత్తానగరమున దేదీ ప్యమానమగు శ్రీ రామకృష్ణ దేవాలయరూపము దాల్చినవి ఆ బృహదాలయనిర్మాణమునకు భక్తి అను అమెరికాదేశీయ మహాళామతల్లి యేడు లక్షల రూప్యముల నొసగి తన జన్మము సార్థకము చేసికొన్న దట! ఆహా! శిబి, దధీచి, కర్ణాదులను బోలిన యా త్యాగశీలనామము ఆచంద్రార్కము స్థిరముగా ఖండఖండాంతరములందును కీర్తింపబడుటలో అబ్బురమేమి? భర్తృహరి కవీశ్వరుని యీ సూక్తి ఎంతసత్యము!

"తమయుదకంబు వాహినులు త్రావని భంగి, ఫలించినట్టి వృ
క్షములు ఫలంబులన్ దినని చందమువన్, జలదంబు పీట స
స్యములకుఁ దృష్టిఁజేసి యవి సమ్మతిఁగోరకయున్న మాడ్కి, స
త్తముల ధనంబు సజ్జనులఁదార్కొనుఁ బ్రత్యుపకారనిస్పృహన్"

సన్న్యాసిగా జీవింపవలెనను కోరిక నరేంద్రునకు ప్రబలమయ్యెను కాన ఇటనుండి నరేంద్రుని స్వామి అని వ్యవహరింతము స్వామి తన సోదరసమితితో 'తత్త్వానుభవము లభించువరకు తిరిగి రాబోను' అని పలికి శారదామాత కడకరిగి ఆమె దీవనలందుకొని అందరిని వదలివేసి ఏకాకిగా బయలుదేరెను

వివిదిషానందు డను పేరుతో స్వామి ఢిల్లీ చేరి తర్వాత రాజపుత్ర స్థానమున ఆళ్వారు నగరము ప్రవేశించెను అచట ఒక మౌల్వీసాహెబ్ ఆయనకు కనుపించెను స్వామి మతవిషయములను గూర్చి ప్రసంగించుచు మౌల్వీతో పలికెను, "పదకొండువందల సంవత్సరములనుండి నేటివరకు ఎట్టి కూర్పు చేర్పులును లేక ఖురానుషరీవు ఏకరీతిగా నిలచి యున్నది "

ఆయన అలౌకిక ప్రతిభకు ముగ్ధులయి హిందువులు, మహమ్మదీయులు గుంపులుగా వచ్చి స్వామిని దర్శింప సాగిరి విద్యాపతి, చండీదాసు మొదలగు భక్తుల కీర్తనలను మనోహరముగా పాడియు, శంకర, రామానుజ, చైతన్యాది మహాపురుషుల పరమాదర్శములు ప్రదర్శించియు, వేద వేదాంత రహస్యములను బోధించియు శ్రోతల నాతడు దివ్యావేశముతో పూరించెడువాడు

స్వామి జయపురము పోయి ఒక పండితునియొద్ద పాణిని రచించిన సంస్కృతవ్యాకరణము చదువసాగెను కాని మూడు దినములు ప్రయత్నించి కూడ స్వామి తలకెక్కున ట్లాయన పాఠము బోధింపలేకపోయెను స్వామి ఆ సూత్రార్థము ఏకాగ్రచిత్తుడై స్వల్పకాలముననే గ్రహించి ఆ పండితునితో అనెను 'దృఢసంకల్పముచే సాధ్యముకానిదేదియును లేదు దానిచే కొండలు కూడ పిండి చేయనగును '

స్వామి అచటనుండి క్షేత్రిపట్టణమున కేగెను ఆయన తత్త్వబోధనప్రావీణ్యమును చూచి క్షేత్రిమహారాజు ఆశ్చర్యపోయి స్వామికి వశుడయ్యెను అతడు అఖండభక్తిభావముతో స్వామి శిష్యత్వ మంగీకరించెను ఆ మహారాజు స్వామిపాదసేవ చేసి తరింపగల సౌభాగ్యమునకు కూడ పాత్రుడయ్యెను

దీనప్రజల దుస్థితిని పరిశీలించుచుండుట స్వామి తన కర్తవ్యముగా తలచువాడు అట్లే అవుడవుడు రాజభవనముల కేగుటకు గూడ వెను కాడెడువాడు కాడు సర్వసంగపరిత్యాగియగు స్వామికి విత్తమదమత్తచిత్తులగు రాజులతో ఏమి పని యని మీారు సందియపడవచ్చును కాని ఏదేని ఒక ప్రయోజన మాశింపనిదే స్వామిని బోలిన దూరదర్శి అట్లు చేయడు గదా! సోదర భారతీయకోటి నుద్ధరించుటయే గదా స్వామిలక్ష్యము! లక్షలాది ప్రజలపై ఆధిపత్యముచేయు రాజులను ధర్మ మార్గములకు త్రిప్పగల్గినచో వారు ప్రజాక్షేమమునకై పాటుపడుదు రని, వారి ననుసరించి ప్రజలుగూడ మారుదురని స్వామి ఉద్దేశము "యథా రాజా తథా ప్రజా!" అన్నారు గదా! ఈ అభిప్రాయముతోనే స్వామి ఒక ప్పుడు శకటారూఢుడై చక్రవర్తులతో రాజోద్యానములందు విహరించును మరొకప్పు డేకాంతముగా పాదచారియై ధూళితో కప్పబడిన శరీరముతో ఏ దీననారాయణు నింటికైన మురికినందులలో ప్రయాణము చేయు టకుగూడ వెనుదీయుడు కార్యసాధకులు కష్టసుఖములు పరిగణింపరు గదా? ఇప్పట్టున చెప్పిన భర్తృహరి పద్య మెంత రసవట్టుగా నుండెనో చూడుడు!

"ఒకచో నేలను బవ్వళించు, నొకచో నొప్పారు పూసెజ్జపై,
నొకచో శాకము లారగించు, నొకచో నుత్కృష్టశాల్యోదనం,
బొకచో బొంత ధరించు, నొక్కొక యెడన్ యోగ్యాంబరశ్రేణి, లె
క్కకు రానీయఁడు కార్యసాధకుఁడు, దుఃఖంబున్ సుఖంబున్ మదిన్"

తర్వాత నాతడు మైసూరున కేగి మహారాజు చామరాజేంద్ర ఒడ యారును దర్శించెను అతడు స్వామి సుగుణసంపదచే ఆకర్షితుడై స్వామిని అఖండముగా సన్మానించెను కాని ఆయన చేయు ఇతర సత్కారముల నొల్లక స్వామి మేలయిన ఒక పొగచుట్ట మాత్రమే తీసి కొని సంతోషించెను స్వామి కోరినకోర్కె దేని నయిన తీర్తు నని మహారాజు వచించెను స్వామి తన మహోద్యమమును గూర్చి ఆతనితో ముచ్చటించెను వేదాంతమతము ప్రబోధించుటకు పాశ్చాత్య దేశముల కేగుటకగు వ్యయ మంతయు తాను భరింతునని ఆ రాజు పల్కినను స్వామి కారణాంతరములచే దాని కంగీకరింపలేదు అట నుండి యాతడు రామేశ్వరము మీాదుగా కన్యాకుమారి యాత్ర కావించెను

కన్యాకుమారి

కన్యాకుమారి చేరగనే స్వామియుత్సాహము కార్య దీక్షతో ఉరక లువేయ సాగెను వెంటనే ఆయన సముద్రము నీదుకొనిపోయి ఒక గుట్టను చేరెను దాని శిఖరమున ఒక శిలపై ఆసీనుడై యావద్భారత దేశచరిత్రను స్మరించి ఒడలు పులకరింప ధ్యానమగ్నుడయ్యెను

ఆ సమయమున స్వామి హృదయసాగరమున ఎంతటి తీవ్రమైన భావతరంగసంచలనము కల్గెనో వర్ణింప నా తరమా! భారతదేశమునందలి దుర్భరదారిద్ర్యము, విద్యావిహీనత స్వామికి కండ్లకు కట్టినట్లయ్యెను తన మనస్సునందలి క్షోభ నరికట్టుకొనలేక ఆ శిలాతలముపై కూర్చుండి ప్రాకృత మానవునివలే స్వామి ఇట్లు విలపింప సాగెను

'అన్నమోరామచంద్రా' యని అలమటించు దరిద్రులకు మతబో ధయేల అని నా గురుదేవుడు వచించెను గదా! జనసామాన్యము నుద్ధరింప లేనిమనకు జాతీయత కలలోని వార్త కాని యీ దోషమును మనము సనాతనధర్మమునకు అంటగట్టరాదు ఇది ప్రజల దోషము ఆ కళంకమును దూరముచేయుటకు నే నిపుడే కంకణము కట్టుకొను చున్నాను భారతదరిద్రనారాయణుల నిమిత్తము ఈ సముద్రము దాటి పశ్చిమ ఖండమున కేగెదను నా ప్రతిభాసామర్థ్యములచే ధనసంపా దన చేసెదను తిరి వచ్చి నా భారతదేశమును, నా భారతీయులను పునరుద్ధరించుటకు ్రానుకొందును కానిచో ఆ ప్రయత్నమున నా ప్రాణములనే విడిచెదను

స్వజాతి, స్వమతము, స్వవిజ్ఞానము గొప్పవని గర్వముతో విఱ్ఱవీగు పశ్చిమఖండముచేత సనాతనధర్మస్వరూపమయిన భారతీయువిజ్ఞానమును అర్చింప చేసెదను'' అని దృఢ ప్రతిజ్ఞ చేసెను

విద్యార్థులారా! శ్రీ రామకృష్ణుని ఉపాస్యదేవత కాళీమాతయే యీ కన్యాకుమారి సుడీ! కన్యాకుమారిని శ్రీ వివేకానందస్వామి దర్శించి దృఢప్రతిజ్ఞ చేయుటచేతనే మన భారతదేశము సనాతన ధర్మశిఖరమును మరల నధిరోహించి సంపూర్ణవిశ్వమున తన కీర్తిపతా కను ఎగురవేయగల్గినది కన్యాకుమార్యగ్రమున ఏ ప్రదేశమున స్వామి కూర్చొని నిశ్చల ధ్యానమగ్నుడై యింతటి ఘనకార్యములకు తన స్థిర సంకల్పముతో పునాదివేసెనో అచటనే నేడు మన భారతీయులు వివేకా నంద శిలావిగ్రహ ప్రతిష్ఠా మహోత్సవములు జరుపుకొనుచున్నారు అచట

ఆయన కంచువిగ్రహమును ప్రతిష్ఠించినారు కోట్లకొలది ప్రజలు ఆ మహోత్సవములు తిలకించుటకు ఖండఖండాంతరములనుండి వచ్చి ఆనంద పారవశ్య మందుచున్నారు ఈ విధముగ ఆ స్వామి ఋణమును తీర్చుకొనగలుగుట మనలో ప్రతి ఒక్కరికి గర్వ కారణము సుమండీ! ఆ పుణ్య తీర్థయాత్ర కేగి స్వామియొక్క ధీరగంభీరపవిత్రమూర్తిని దర్శించు నవకాశము మన కెన్నటికో గదా!

స్వామిని వివేకానందుని జేసిన రెండవమలుపు ఈ కన్యాకుమారియే సుడీ!

పశ్చిమ ఖండయాత్ర

1892వ సంవత్సరమున స్వామి కన్యాకుమారి నుండి బైలుదేరి, విద్య లకును, పూర్వాచారములకును నిలయమయిన చెన్నపట్నము చేరెను ఇచటనే అతని కీర్తిచంద్రికలు ఖండాంతరములందు గూడ వ్యాపించు నవకాశము లభించెను పశ్చిమఖండయాత్రకై స్వామికి ధనము సమ కూర్చిన దీ నగరమే యని మనము మరువరాదు

డబ్బుదేమిలెక్క, డబ్బుకేమికరువు అని కొందరందురు గాని యది సరికాదు దుష్కార్యములతో బాటు సత్కార్యములు చేయుటకు గూడ ధన మావశ్యకము గదా! కాని దానిని సద్వినియోగపరచి నపుడు మాత్రమే సంపాదించిన ధనము సార్థకమగును దీనినే భర్తృహరి పలుకులలో వినుడు

"దానం, భోగో, నాశః తిస్రో గతయో భవంతి విత్తస్య,
యో న దదాతి, న భుంక్తే, తస్య తృతీయా గతిర్భవతి"

దానము, భోగము, నశించుట అనునవి ధనమునకు గల మూడు దశలు ఒకరికిపెట్టుట ఉత్తమము, తాను అనుభవించుట మధ్యమము ఈ రెంటికి ఉపయోగపడకుండ ధనలక్ష్మిని పెట్టెలో పెట్టి బంధించుట అధమము మొదటి రెండు దారులలో ఖర్చు కాని డబ్బు మూడవదారినే వెదకికొనును కాన ఈ విధముగా స్వామియొక్క మహోల్లక్ష్యసాధనకు హేతుభూతమయిన చెన్నపురవాసుల త్యాగము కీర్తనీయము వా రితర విధముగా చాల డబ్బు ఖర్చు చేసియుందురు కాని వీరి యీ త్యాగ మొక్కటియేగదా వారికి తరుగని కీర్తి ధనమును ప్రసాదించుటతో బాటు

భారతదేశము నింత యున్నతస్థితికి తీసికొని పోగల్గినది! ధనమును, విద్యను ఎట్లు కష్టపడి సంపాదింపవలెనో పెద్దలు చెప్పిన యీ పద్దె ముచే తెలిసికొనుడు

"జరయు మృతియులేని జమునట్లు ప్రాజ్ఞుండు
ధనము విద్య గూర్పఁదలప వలయు,
ధర్మమాచరింపఁ దగు, మృత్యుచేఁ దల
పట్టి యీడ్వబడినవాఁడు పోలె"

—భర్తృహరి

స్వామి చేరె నను వార్త సూర్యకాంతి వలె చెన్నపురి నలువైపుల వ్యాపించెను అతని వచనామృతము గ్రోలుటకు ఆ నగరవాసులే గాక ఆ ప్రాంతీయులు గూడ తండోపతండములుగా తీర్థప్రజవలె రా సాగిరి

పరుల కష్టము చూచిన స్వామిహృదయము బ్రద్దలయిపోయెడిది ధనమును మంచినీటివలె వెచ్చబెట్టు ఆ మహానగరమున పొట్టకు పట్టెడు మెతుకులకు గూడ నోచుకొనని వారిని, తమ తల్లులతో బాటు మోల బంటి లోతు నీటిలో పని చేయుచున్న పల్లెబిడ్డలను చూచి కన్నీరు విడుచుచు స్వామి "దైవమా, ఈ నిర్భాగ్యుల నెందుకు సృజింతు వయ్యా! వారి కష్టముల నిక నేను చూడజాలను" అని దీనాతిదీనుడై విలపించిన రోజులు గూడ గలవు

సరిగా చెన్నపురి చేరునరికి అమెరికాఖండములో షికాగో నగరమున విశ్వమతమహాసభ జరుగునని స్వామికి వినవచ్చెను సాటిలేని స్వామి రూపమాధురి, అనితర సాధ్యమగు ఆయన బుద్ధి వైభవమును చెన్నపురి యువకుల మానసములను అమితముగా ఆకర్షించెను స్వామి పశ్చిమ ఖండయాత్ర చేయవలెనని అపుడే తన మనసున తలచెను సనాతన ధర్మసందేశమును ఖండాంతరములందు వ్యాపింపజేయ నిశ్చయించుకొన్న స్వామి సంకల్పమును ఆ యువకులు గ్రహించిరి ఐదు వందల రూపా యలు యాత్రకై సిద్ధముచేసి స్వామికి సమర్పించిరి తల్లి పిలుపు తన కింకను వినరాలేదని పలికి స్వామి ఆ ధనమును బీదసాదలకు పంచి పెట్టివేసెను చూచితిరా స్వామి యౌదార్యము!

పౌరుల ఆహ్వానముపై స్వామి హైదరాబాదు చేరెను పండితులు, ప్రభుత్వోద్యోగులు మొదలగు వా రైదువందల మంది స్వామి కఖండ స్వాగతమిచ్చిరి వేదాంతమత ప్రచారమునకై పశ్చిమఖండయాత్రకై వలయు ధనమిచ్చెదనని హైదరాబాదు నవాబు ముందుకు వచ్చెను అచట స్వామి ఆ యాత్రలో తాను చేయబోవు పనులను గూర్చి మహోపన్యాస మిచ్చి మరల చెన్నపురి చేరెను

ఈ సారి తల్లియాజ్ఞకై గురుదేవు ననుజ్ఞకై స్వామి ప్రార్థించెను శ్రీరామకృష్ణపరమహంస సాగరతీరమునుండి సముద్రమున ప్రవేశించుచు త న్ననుసరింపు మని ఆదేశించుచున్నట్లు స్వామి దివ్యదర్శనమును కాంచెను ఆహో నేటికి గదా మన స్వామికలలు పండినవి ఇక సంశయము విడనాడి స్వామి ఆ మహాయాత్రకై ధైర్యోత్సాహములు కూడకట్టు కొనెను స్వామిని తన జ్యేష్ఠపుత్రుడుగా ప్రేమించు మాతృశ్రీ శారదాదేవి కూడ స్వామిపూనికను విని లేఖ ద్వారా ఆయన నాశీర్వదించెను ఇక నేమి, శిష్యులు మహోత్సాహములతో కొండంత బలముతో వలయు సన్నాహము చేయసాగిరి వారి ఉత్సాహోద్రేకము లూహింప వలసినదేగాని వ్రాయనలవిగాదు

లోగడ ఖేత్రిమహారాజు పుత్రు నను గ్రహింపుమని స్వామిని వేడు కొనెను సరిగా ఇప్పుడే మహారాజుకు పుత్రు డుదయించెను ఆయన స్వామిని ఖేత్రి నగరమునకు పిలువనంపి విదేశయాత్రకు వలయు సకల సౌకర్యములను సమకూర్చెను 1893వ సంవత్సరము మే 31వ తేదిన స్వామి బొంబాయిలో పౌరుల ఘనమైన వీడ్కోలుతో "పెనిన్సులర్" ఓడ నెక్కెను అఖిల ప్రపంచ మతమహాసభలో ప్రాచీన మహర్షుల సందేశమును వినిపించుటకు స్వామికంటె యోగ్యు డీ భారత భూమిలో మరి యెవ్వరు? అసలు శ్రీరామకృష్ణుడే విశ్వమత మహాసభయయి యుండ ఆయన శిష్యోత్తముడగు మహర్షి వివేకానంద స్వామికంటె ఈ మహత్తరకార్యభారము వహింపగల సమర్థు లెవ్వరు? చైనా, జపానుల మీదుగా స్వామి షికాగో నగరముచేరెను

విశ్వమత మహాసభ

ఆ మహాసభకు చూడవచ్చిన జనులతో షికాగో నగరము నిండిపోయినది ఆ చలిదేశమునకు తగిన దుస్తులు గాని, చేత పైస గాని స్వామివద్ద లేవు రెండు మాసములకు తర్వాత గాని మహాసభలు జరుగవని, ప్రఖ్యాత సంస్థల ప్రతినిధులకే గాని యితరుల కందు ప్రవేశార్హత లే దని తెలిసికొని స్వామి కుప్పగూలిపోయెను ఆ సభలో స్వామి యుపన్యసించుటకై ముందుగా శిష్యు లెట్టి సన్నాహములును చేసియుండలేదు గదా!

ఐనను భగవత్కటాక్షము స్వామిపై ప్రసరించెను చెన్నపురివాసి యొకరు స్వామిని గూర్చి అమెరికాలోని తన మిత్రునకు వ్రాసెను ఆ మిత్రుడు స్వామిని కలిసికొని విశేషముగా గౌరవించెను షికాగో కంటే బోస్టను నగరమున సులభముగా జీవింపవచ్చునని స్వామి అచటకు ప్రయాణమయ్యెను బోస్టనులో ఆ రెండునెలలు గడపి మరల షికాగోకు బయలు దేరెను

విశ్వమత మహాసభలో మాటాడుట కవకాశమెట్లు దొరకునా, అని స్వామి విచారింపసాగెను దైవికముగా హార్వర్డు విశ్వవిద్యాలయాచార్యుడగు రైటు పండితుని ఆయన కలుసుకొనుట తటస్థించెను స్వామిని చూడగనే, పది నిముషములు మాటాడగనే స్వామిప్రతిభాప్రభావముల నాత డర్థము చేసికొనెను మహాసభ కభ్యర్థుల నెన్నుకొనునట్టి తన మిత్రుడగు ఆ సభాధ్యక్షునకు స్వామిని పరిచయము చేసె రైటు పండితుడు స్వామిఘనవిజయమునకు కారణమయ్యెను విధివిలాసమున కచ్చెరు వందుచు స్వామి షికాగో నగరమునకు వెడలెను కాని ఆ విధిచేతనే వంచితుడై త్రోవ తప్పెను ఆహా! దైవ నిర్ణయమెట్టిది? స్వామి బోటి త్యాగశీలునకు గూడ విధి విడంబనమా! హో, హతవిధీ! ఎంతపని చేసితివి!

"గురుఁడు గురుండు, వాలుశతకోటి సుపర్వులు వాహినీపతుల్,
సురభవనంబు కోట, మధుసూదనుఁడున్ సయిదోడు, దంతిది
క్కరివతి సొగ హొవ్వ బలఘాతియు దాయల కోడి వాడిలో,
శరణము దైవమే, పురుషశక్తి నిరర్థక మెన్ని భంగులన్"

—భర్తృహరి మహాకవి

చీటికిమాటికి భర్తృహరి పద్యములనే ఈ రచయిత ఉటంకించుట యేలయని మీా రనుకొనచ్చును భారతదేశమునే గాక యావత్ప్రపంచ మును తన చల్లని వెలుగుతో త్రికాలములయందును ప్రకాశింపజేయు చుండు కవిచంద్రు డీతడని మీరు తెలిసికొనుడు తెలిసికొనుటయే కాదు, ఆ మహాకవి సంస్కృతభాషలో రచించిన 'సుభాషిత త్రిశతిని' ప్రతిపదార్థ తాత్పర్యములతో మననము చేసికొని ధన్యులు కండు అందు కవకాశములేనిచో కనీసము ఏనుగు లక్ష్మణకవి పద్యానువాదమునైన కంఠస్థము చేసికొన యత్నింపుడు అపుడు మాత్రమే విద్యార్థులు అని మిమ్ముఁలను అనవచ్చును భర్తృహరిసూక్తులు ఈ పొత్తమునకే కాదు, ఏ పొత్తములకైనను మకుటములు సుడీ!

విశ్వమత మహాసభను మరునాడు సింహగర్జనను బోలిన తన ప్రసంగముచే దద్దరిల్ల జేయవలసిన స్వామికి ఆ రాత్రి వరుండుటకు తావు దొరకలేదు ఆయన సామాన్యుల రైలు పెట్టెలో దిక్కులేని దీనునివలె పరుండెను ఉదయమున లేచి అమెరికాలోని కోటీశ్వరులను క్షుద్బాధచే యాచింపవలసిన గతి పట్టెను గుప్పెడన్నమునకై ఆతడు మొగము వాయవలం వచ్చెను ఆయాసముచేతను ఆకలిచేతను స్వామికి అడుగు ముందుకు పడలేదు

కాని ఎంత చిత్రము! స్వామి కెదుటనున్న యొక దివ్య భవనము నుండి జార్జిహేర్ అను మహిళ తలుపులు తెరచుకొని రివ్వున బాణమువలె స్వామివద్ద కేతెంచి విషయమును తెలిసికొని ఆయనను తన యింటి కాహ్వానించెను ఆహా! క్షణములో ఎంత మార్పు! స్వామి యీ విధివిలాసము అర్థము చేసికొని చిరునవ్వు నవ్వెను ఆమె స్వామిని తగురీతి నాదరించి యాతిథ్యమిచ్చుటయేగాక ఆ మహాధ్యక్షునివద్ద కాతని గొనిపోయి పరిచయము కల్గించెను సభవారు సంతసముతో స్వామిని ప్రతినిధిగా అంగీకరించిరి అప్పటి స్వామి మనఃస్థితి వర్ణింప నెవరి తరము? స్వామి తన కృతజ్ఞత నెట్లు తెలుపగలడు! సనాతనమహర్షుల భారతీయుసందేశము సభాముఖమున వెల్లడించు అర్హతను, శక్తిని ప్రసా దింపుమని ఆతడు అఘటితఘటనాసమర్థుడగు భగవంతుని ప్రార్థించెను స్వామికి వివేకానందుడని పేరు వచ్చుట కీ సభ మూడవ అనగా చివరి మలుపు సుడీ!

1893వ సంవత్సరములో షికాగోలో జరిగిన ఆ మహాసభ మతవిష యక మయిన నిఖిలప్రపంచమహాసభ ఆ సభ మూలముననే వివేకానం దములు సంపాదించుటకు మార్గమును లోకమున కుపదేశించి స్వామి వివేకానందుడను సార్థక నామము ధరించెను కాన మనము గూడ ఇక ముందు నరేంద్రుని స్వామి అని గాక వివేకానందస్వామి అనియే పేర్కొందము

ప్రాచ్యపాశ్చాత్యఖండములందలి పేరెన్నికగన్న తత్త్వకోవిదులు, కళా ప్రపూర్ణులు, పండిత ప్రకాండులు ఆ సభ నలంకరించిరి పదివేల జనుల సాగరఘోషతో అది ఘూర్ణిల్లుచుండెను వివిధ మతప్రతినిధులు వేయి పత్రములు ఆ సభలో చదివిరి రోమన్ కాథలిక్ సంస్థకు సర్వాధికారి 'కార్డినల్ గిబ్బన్స్' మహాశయుడు పగలు గూడ కండ్లకు మిరుమిట్లు గొలుపు దుస్తులు దాల్చి సభామధ్యమున ఉన్నతాసనమున గూర్చుండెను దేదీప్యమానములగు వస్త్రములను, స్వర్ణ చ్ఛాయతో ఒప్పు తలపాగను తాల్చి వివేకానందస్వామి మధ్యాహ్నకాలమున చండకి రణునివలె వెలిగి పోవుచుండెను

ప్రార్థనగానముతో సభ ప్రారంభమైనది ప్రతినిధు లొకరివెనుక నొక రుపన్యసింప సాగిరి కాని స్వామి 'యీ మహాజనసాగర సమక్షముననా నే నుపన్యసించుట' అని తలచి ముందు కొంత భయకంపితుడయ్యెను సభాధ్యక్షు డెన్నిసా ర్లుపన్యసింపు మని కోరినను "తర్వాత" అనియే స్వామి సమాధానము! చివర కధ్యక్షుడు వివేకానందుడే చివరి వక్త యని ప్రకటించెను 'ఇక తప్పదురా బాబు' అని తలచి స్వామి లేచి నిలబడెను ఆతని ముఖము సహస్రరత్నకాంతులతో సమముగా ప్రజ్వలించెను ఆ ధీరగంభీరమూర్తిని చూడగనే సభయంతయు కిక్కు రుమనకుండ కూర్చొనెను ప్రతివాడును చెవులు రిక్కించి వినుటకు సిద్ధమయ్యెను ఆతడు శారదామాతకు నమస్కరించి "అమెరికా సోద రసోదరీమణులారా" అని సభ్యులను సంబోధించెను ఆ ఎలుపుతోనే ఒక మహోత్సాహతరంగము సభాసాగరమునుండి వెలువడి కరతాళధ్వ నులతో ఒక్కపరి మార్మ్రోగెను సభ్యులు తనకు సమర్పించు ఈ ఘనస్వాగతమునకు స్వామి దిగ్భ్రాంతుడే యయ్యెను స్వామి చేసిన ఉపన్యాసముయొక్క సారముమాత్రమే యిందిచ్చుచున్నాను

"వేర్వేరు ప్రదేశములలో బుట్టిన నదులు సముద్రమున చేరునట్లే వివిధభావములతో మానవులు అవలంబించుచున్న ఆరాధనా మార్గము లన్నియు ఎన్ని చుట్టుదారులలో ప్రయాణము చేసినను ఆ భగవంతునే చేర్చును ఎవరెట్లు భావించిన భగవంతు డట్లే వారి ననుగ్రహించును సర్వధర్మ సమన్వయమే వేదాంతము మానవుని వర్తమానస్థితి అతని పూర్వజన్మకర్మ ఫలితమే ప్రస్తుత కర్మలు భావిదశను నిర్ణయించును భౌతిక శాస్త్రదృష్టితో చూచినను ఏకత్వమే అద్వైత సిద్ధాంతమని నిర్ణయింపనగును భగవత్సాక్షాత్కారమే సమస్త ధర్మముల తత్త్వము భారతీయ సనాతనధర్మతత్త్వ మిదియే విశ్వమందలి సమస్త ధర్మములకు సనాతన ధర్మతత్త్వమే మూలము"

దేశకాలాదుల కతీతమయిన సనాతనధర్మమే స్వామి నాడు ప్రదర్శించిన హిందూమతము అట్టి విశ్వమానవమత దివ్యతేజము నెదుట ఇతరమత సంప్రదాయములు లా సభలో కాంతిహీనములై వెలవెలబోయెను స్వామి యీ దివ్యసందేశము విని ఆ సభ్యులందరు వివేకానందస్వామిని జగదేకాచార్యుడని, మహాప్రవక్తయని కీర్తించిరి ఆ సభావిశేషములు వర్ణింపదలచిన ఒక చిన్న పొత్తమే వేరుగా వ్రాయవలసి యుండును స్వామియొక్కడే సర్వమతగమ్యమగు మహోత్కృష్ట మతమును గూర్చి బోధింపవచ్చిన మహనీయుడని సభ్యులందరు నమ్మిరి వారు స్వామిని ఒక నరేంద్రునివలెనే పూజించి నరేంద్రు డను అతని బాల్యనామమును సార్థకము గావించి ధన్యులైరి ఆ యందరి ప్రశంసల నిటకూర్చుట సాధ్యము కాదు కాని జగత్ప్రసిద్ధురాలగు ఆనిబిసెంటు మహాశాయ తల్లి ప్రశంసను మాత్రము వినదము-"ఆ మహనీయుడా, క్రైస్తవమత బాహ్యుడు! ఆ మహనీయుని దేశీయులయొద్దకా, మన క్రైస్తవ మత బోధకులను పంపుట! వారే మన వద్దకు మతబోధకులను పంపుట యుచితము!"

విశ్వమతమహాసభ లోకమున కొసగిన సందేశము స్వామియే యిట్లు చాటెను "పూజ్యత, పవిత్రత, త్యాగము ఇవి ప్రపంచమున, ఏ మతసంస్థకును ప్రత్యేకమయిన హక్కులు కావని, ప్రతి మతమునను

లోకోత్తర చరిత్రులగు పురుషులును స్త్రీలును ఉద్భవింపగలరని సభ చాటినది. వలయునది కలహము కాదు, సహకారము; అ మత ద్వేషము కాదు, వాని ఆశయములు గ్రహించుట మాత్రమే; శత్రుత్వము కాదు, శాంతియుత సహజీవనము

ఊరు పేరు లేక సన్న్యాసియై తిరుగు స్వామి ఈ సభలో ఉపన్యసించిన నాటినుండి జగద్విఖ్యాతమహావక్తగా పేరందెను. త్రిజగద్వ్యాప్తమగు త్రివిక్రమావతారమును ఆయన దాల్చిన దిచటనే. షికాగో నగర వీధులలో ప్రతి గోడయు స్వామి నిలువుపటములతో అలంకరింపబడెను. ఈ హిందూయోగి వర్ణనలతో, ఆతని, సుగుణసంకీర్తనలతో ఆ నగరపు పత్రికలన్నియు నిండిపోయెను. ఆ సువర్ణోత్సవమును తలచుకొన్నచో మన యొడలు గూడ పులకరించుట లేదా?

కాని యిట్టి విశ్వవిఖ్యాత గౌరవముచేత గూడ స్వామి గర్వింపలేదు సుమండీ? ఎన్నవేల నదినదములు తన్ను జేరినను హద్దుదాటని విశాలసముద్రమువంటి దాతని హృదయము! ఆ విజయము లభించిన నాటి రాత్రి స్వామి తనకింక స్వేచ్ఛామయ సన్న్యాసజీవితానందదినము లంతరించినవిగదా యని బాలునివలె ఆక్రోశించెను. కాని తోడనే భారతదేశ స్థితిని తలచుకొన్నంత మాత్రాన ఆతని కడుపు చెరువై పోయినది. నా మాతృదేశమున ఘోరదారిద్ర్యము వికట తాండవము చేయుచుండగా నాకీ పేరు ప్రతిష్ఠ లేల? పట్టెడన్నమునకు గూడ మొగమువాచి సామాన్యజను లలమటించుచుండగా ఇచ్చట వీరు కేవలము విలాసములకొత్తె లక్షలు వ్యయపరచుచున్నారే! నా భారతదరిద్ర నారాయణకోటి నెవ్వ రుద్ధరింతురు? తల్లి, వారలకు నే నెట్లు తోడ్పడగలనో తెల్పుము అని స్వామి దుఃఖావేగముతో విలవిలలాడిపోయెను. దీనదరిద్రులం దాయనకు గల యఖండప్రేమయే స్వామి యొనర్చిన ఘనకార్యములకు మూలకారణము! అదియే స్వామి కాంచిన ఘనవిజయమునకు నిదానము!

ఉద్యమవ్యాప్తి

ప్రసిద్ధమగు ఒక ఉపన్యాససంస్థ స్వామిని అమెరికాలో పర్యటించి ఉపన్యసింపు డని ఆహ్వానించెను ఈ యాత్రలో స్వామి షికాగో, కేంబ్రిడ్జి, బోస్టన్, వాషింగ్టన్, న్యూయార్కు మొదలగు ముఖ్య పట్టణము లన్నిటియందును సనాతన హైందవవిజ్ఞానమును సహస్రముఖములుగా వ్యాపింపజేసెను క్రైస్తవ మతాచార్యులాతనిని తమ ప్రార్థనాలయములలో ఉపన్యసింపు మని ప్రార్థించిరనగా జనసామాన్యము మాట వేరుగా చెప్పవలెనా!

ఆ యుపన్యాసముల సార మిది—

“మీరు మీ దేశీయులకు విద్య చెప్పించుట మా దేశమునకు వచ్చి మా ఋషులను, మా యాలయములను, మా మతమును నిరసించి దూషించుటకే గదా! మీ పోకడలను మేము రవ్వంత విమర్శించగనే మీరు చేయు గందరగోళము గగ్గోలు చెప్పనలవి కానివి ఒక్క విషయమున మీ స్థితికంటె మాది మేలు

హేతువిమర్శ చేయనిదే మానవుడు పాపి అను ఘోర సిద్ధాంతమును మేము మా బిడ్డల కెన్నడును బోధింపము భారతీయులందరును లేచి హిందు మహాసముద్రపు టడుగున ఉన్న బురద యంతయు తీసి పాశ్చాత్యదేశములపై బడవేసినను అది మీరు, మాపట్ల సలుపుచున్న ఘోరకృత్యములతో సహస్రాంశమైనను పోలదు మీ మతము వీడి మా మతమవలంబింపజేయుటకు మే మొక మతప్రచారకునైనను మీ దేశమునకు పంపి యెరుగుదుమా? చంప పనికిరాదని మీ రొక ప్రక్క శ్రీరంగనీతులు చెప్పుచునే మరొక ప్రక్క కత్తిదూసి రక్తపాతముచే సర్వ దేశములందును మీ మతమును వ్యాపింపజేసినారు కదా! మీవలెనే విఱ్ఱవీగిన అరబ్బు లేమైరి? రోమను లెట నున్నారు? స్వార్థపరత్వమే మూలాధారమై, భోగానుభవమే పరమార్థమై ఉన్న ఈ సంస్థ నేడో రేపో నశింపక తప్పదు సజీవమై మీ జాతి నిలువవలెనన్న మీ జీవిత విధానమే మారితీరవలెను రాము డేలు హృదయమున కాము డుండజాలడు నేను మిమ్ము పొగడుటకు రాలేదు మీ డంబములు, లోపములు, దోషములు, మీకు తెలిపి మీకు భగవంతుని చేరు మార్గము చూపు

టకై వచ్చియున్నారు మీరు నాబిడ్డలు స్వార్థపరత్వముతో పరమత వినాశైకకాంక్షతో నిండిన మీ హృదయములలో క్రీస్తు మహాశయునకు తావులేదు క్రీస్తు మా ప్రాచ్యుడు కావునే ప్రాచ్యులమగు మా కాతని తత్త్వము మీకంటె సులభముగా విస్పష్టముగా తెలియును" సనాతన ధర్మప్రచారము, మాతృదేశ సముద్ధరణము, ఇవి రెండే స్వామి యీ యుపన్యాసములకు లక్ష్యములు

స్వామి యొనర్చిన యీ యుపన్యాసయాత్ర పాశ్చాత్య ప్రపంచమున సనాతన ధర్మవిజయయాత్ర యని చెప్పనగును క్రైస్తవదేశమున నిలచి నిర్భయముగా వారి దోషములు ప్రకటించిన స్వామి ధైర్యసాహసము లెంతటివో గదా!

స్వామి యీ అఖండ విజయము విని భారతీయులు బ్రహ్మానందభరితులై ఆతనిని కీర్తింపసాగిరి అమెరికా జనులు స్వామిసందేశమును గమనించిన అద్భుత విధానము, స్వామి ప్రతిభాతిశయమును గూర్చి వారొనర్చిన యద్భుత ప్రశంసలు, ఆతని దేశసేవాపరాయణత, సనాతన ధర్మప్రచారము—ఇవియే నాటి వార్తాప్రతికలలోని వార్తలు ఇక బారానగర మఠమందలి సోదర శిష్యులు స్వామి విజయమున కుప్పొంగిపోయినారని వేరుగా చెప్పవలయునా! "నా శిష్యుడు నరేంద్రుడు ప్రపంచమునంతయు నుఱ్ఱూతలూగించు దినములు వచ్చి తీరును" అను గురుదేవుని దివ్యమోఘ వాక్కుల నావేశముతో హర్షపరవశులైవారు తలచుకొని ఒడలు మరచి ఆనందబాష్పములు వర్షించిరి

భారతదేశమంతటను వివేకానందనామము రామనామమువలె వ్యాపించెను ఈ యుత్సాహతరంగములు మొదట చెన్నగరమునుండ, తర్వాత వంగదేశమునుండి బయల్వెడలి క్రమముగా భరతఖండ మందంతట వ్యాపించెను ఆసేతుశీతాచలము, వివిధరాష్ట్రములు వివేకానంద జయ ధ్వనులతో ప్రతిధ్వనించెను చెన్నగర ప్రముఖులు, రామనాథ రాజు క్షేత్రి మహరాజు స్వామికి లేఖలతో అభివందనములు తెల్పిరి ఇతరులే స్వామి యీ ఘనవిజయమునను మురిసుకొని ఆనంద పరవశులయినారనగా స్వామి జన్మస్థాన వాసులగు కలకత్తా పౌరుల హర్షావేగము నే మాటలతో వర్ణింపనగును! వంగదేశములోని పండితులు, పత్రికాధిపతులు న్యాయమూర్తులు, రాజకీయనాయకులు మున్నగు ప్రముఖులు

వేల కొలదిగా పెద్ద సభ చేసి దానిద్వారా స్వామి కథినందన సందేశము పంపిరి దీనితో భారతదేశమున నూతన సందేశము, నూతనోత్సాహము కలుగసాగెను వివిధ రాష్ట్రములవారు సభలు చేసి స్వామిని కీర్తించిరి వివేకానందజనకమగు సనాతనధర్మ మద్వితీయమని ప్రజలు గుర్తింపసాగిరి ఇంతవరకు చైతన్యరహితమై నిద్రపోవుచున్న భారత దేశము వివేకానందుడను సూర్యుడుదయించుటచే మేల్కొనెను ఈ విశ్వమత మహాసభయే భారతశక్తి విశ్వమున విజృంభించుటకు మూల కారణము!

స్వామి వేదాంతోపన్యాసము లొసగుచుండగా ఆతని పరీక్షింప దలచి కొందరు తుంటరులు తుపాకులు ప్రేల్చిరి కర్ణ కఠోరముగ గుండ్లు చప్పుడు చేయుచు చెవుల ప్రక్కలనుండి దూసుకొని పోవుచున్నను స్వామి తన యుపన్యాసము నాపలేదు! అనేక పర్యాయము లర్ధరాత్రమున మరునాడు తా నుపన్యసింపవలసిన విషయమును గూర్చి యెవరో ఒక వ్యక్తి తన యెదుట ఉపన్యసించుచున్న ట్లాయనకు విన వచ్చు చుండెడిదట! అదియే మరునాటి స్వామి యుపన్యాసముగూడ నయ్యెడిది!

సముద్రతీరమునుండి మిసిసిపి మహానది వరకుగల పట్టణములలో అతడు మహోపన్యాసము లొసగి సన్మానింపబడెను న్యూయార్కు పట్టణమున వాల్డో కన్య 'హరిదాసి' యను పేరుతో స్వామికి శిష్యురాలయ్యెను భారతదేశములోని క్రైస్తవమత ప్రచారకులు స్వామిని, స్వామి ఉద్యమమును ఖండింపసాగిరి ఆ సందర్భమున స్వామి రచించిన వివేకానందలేఖావళి సారమిది "దీనులను గూర్చి యెవ్వని మనస్సు క్షోభిల్లునో వాడే మహాత్ముడు క్షోభింపనివాడు దురాత్ముడే కోట్ల కొలది జనులు ఆకలిదప్పులతో విద్యావిహీనులై ఎట్లో కాలము గడుపుచుండ వారిని క్రీగంటనైనను చూడక మీదు మిక్కిలి వారి కష్టార్జితముచే విద్యావంతులయిన వారందరు దేశద్రోహులు"

అమెరికాలో స్వామి ప్రకటించిన యోగసిద్ధాంతములు ప్రసిద్ధ మానసిక శాస్త్రవేత్త విలియంజేమ్సు వంటి వారినిగూడ ఆకర్షించెను పాశ్చాత్యప్రముఖు లనేకు లాయన శిష్యులయిరి సామాన్యులు కూడ వేలసంఖ్యలో స్వామికి శిష్యులయిరి అర్హుల కాతడు సన్యాసదీక్ష

గూడ నిచ్చెను తన మహోద్యమ మొక వంక యిట్లు ఆ దేశమున వేరు పాదుకొను చుండగా మరొకవంక సంతతబోధలచే, ఎడతెగని ఉపన్యాసములచే, నిరంతరము పాటుపడుటచే స్వామివంటి మహయోగిని గూడ అప్పుడప్పుడు విసుగుకలుగుచుండెడిది కాని ఆ దౌర్బల్యము క్షణములోనే వదలిపోయి మరల ప్రయాశీలుడై ఆయన కార్యరంగమున దూకువాడు

అపరిమిత కార్యభారముచే స్వామికి విశ్రాంతి అవసరమయ్యెను శిష్యులాతనిని సహస్రద్వీపవనము అను ప్రదేశమునకు తీసుకొనిపోయిరి అది మండువేసవి యయినను స్వామి విసుగుచెందక బోధలతో పాటు మధురాహారములు గూడ వండి పెట్టి శిష్యులను సంతృప్తి పరచుచుండువాడు అచటి మహోపదేశములు హరిదాసకన్య సంగ్రహించి పుస్తకాకారమున తెచ్చెను దానిని తెలుగులో పూజ్యశ్రీ చిరంతనానందస్వామి వారు ప్రబోధరత్నాకరము అను పేరన అనువదించినారు అద్వైత సిద్ధాంతములను స్వామి వివిధాభిప్రాయములను తెలిసికొనుటకో గ్రంథము చాల ఉపయోగపడును బాలురకు గూడ అర్థమగు శైలిలోనున్న దా గ్రంథరాజము!

మిస్ మల్లర్, ఇటి స్టర్డీ అనువారు ఆహ్వానించినందున స్వామి ఆంగ్ల దేశమునకు గూడ బయలు దేరెను దారిలో ప్యారిస్ పట్టణమున ఆయన కొన్ని దినములుండెను స్వామి దిగ్విజయయాత్రచే భారత దేశమున క్రైస్తవమత ప్రచారకుల ఆదాయము ఒక్క సంవత్సరమున కోటిన్నర రూపాయలు పడిపోయినదట

లండను నగరమున స్వామి ఉద్యమవ్యాప్తికై సర్వస్వము సమర్పించి మిస్ మార్గరెట్ నోబుల్ అను మహిళా మణి "సోదరి నివేదిత" అను పేరుతో స్వామికి శిష్యురాలయ్యెను ఈమె విశేషవిద్యావంతురాలు కలకత్తాలో మాతృశ్రీ శారదాదేవి నామముతో ఒక భారతీయ విద్యాలయమును నడిపిన పవిత్రచరిత్రురాలు ఆంగ్లదేశమున స్వామి తన యుద్యమమును సాగించుకొనుచుండగా అచటనే శిష్యులయిన అమెరికావాసులు—అభయానందుడు కృపానందుడు, హరిదాస అను వారు అమెరికాలో స్వామియుద్యమము నిర్వహించుచుండిరి

ఆంగ్లదేశమున తగు ప్రచారముచేసి మరల స్వామి అమెరికాకు వచ్చి కార్యరంగమున ప్రవేశించెను జె జె గుడ్విన్ అను లేఖకుడు స్వామి

ఉపన్యాసములు వ్రాయుటకై నియుక్తుడయ్యెను వివేకానందవచనామృతము నేడు ప్రపంచమున విరివిగా వ్యాపించుట కీయనయే మూలము ఈతడు భక్తితో జీవితాంతము స్వామికి సేవచేసెను స్వామియే ఈతనిని తన కుడిభుజమని కీర్తించినాడు స్వామి న్యూయార్కు పట్టణమున తన బహిరంగోపన్యాసము లారంభించెను ఉపన్యాసక శిరోమణి యను పేరుగాంచెను స్వామి యుపన్యాసములచే అచట గూడ శ్రీ శంకరాచార్య శ్రీరామానుజాచార్య నామములు హక్స్లీ, స్పెన్సర్ల పేర్లతో సమానముగా వ్యాపించెను స్వామి రచించిన రాజయోగభక్తియోగాది గ్రంథరాజములు అమెరికానంతటి నాక్రమించెను హార్వర్డు కొలంబియా విశ్వవిద్యాలయములవంటివిగూడ స్వామిని తమ సంస్థలలో ప్రాచ్యవిద్యాపీఠము నధిష్ఠింప నాహ్వానించెను ఆ గౌరవములను స్వామి నిరాకరించెనని వేరుగా చెప్పవలెనా?

స్వామి తమ కొసగిన 'భారతనారీమణులు ఆదర్శములు' అను ఉపన్యాసమును పురస్కరించుకొని కేంబ్రిడ్జి పురవాసులగు మహిళలు స్వామియొక్క మాతృదేవి భువనేశ్వరికి అట్టి సుపుత్రుని గాంచినందు కభినందనసందేశ మంపిరి స్వామికి లభించిన యిట్టి ప్రశంసలు లక్షోపలక్షలు గదా!

1896వ సంవత్సరమున మరల లండన్ చేరిన స్వామిని శారదానందుడు భారతదేశమునుండి అటకు వెళ్ళి కలుసుకొనెను స్వామి మాతృదేశమును వీడి వెళ్ళినతర్వాత సోదర శిష్యుని కలుసుకొనుటయే ప్రథమము

ఇదేసమయమున మోక్షమూలబుధ యని బిరుద నామము గాంచిన మాక్సుముల్లరు పండితుడు స్వామి నాహ్వానించెను ఆతడు శ్రీ రామకృష్ణునకు దొడ్డభక్తుడు! నిద్రాహారములు గూడ త్యజించి అఖండ కృషిచేసి భారతీయుల వేదశాస్త్రముల యెడల పాశ్చాత్యులకు గొప్పగౌరవము కల్పించుటకు ఏబది సంవత్సరములు శ్రమచేసి ఋగ్వేదభాష్యమును ఆంగ్లమున అనేక సంపుటములలో వెలువరించినవా డా మహాశయుడు. ఆతని సహధర్మచారిణి గూడ పతికి తగిన సతి ఉదారాశయములతో ప్రోగుచేసి విధాత యామెను సృష్టించినాడు ఇల్లాలే యిల్లని పెద్దలనిరి కదా! కాననే ఆయన కుటీరము అనంతశాంతి నిలయమైనది

"జనకునిఁ బూజలం గడుఁ బ్రసన్నునిఁ జేయునతండు పుత్రుఁడే
వనిత మెలంగు భర్తృవశవర్తినియై యది సత్కళత్ర, మే
జనుఁడు విపత్తిసౌఖ్యసదృశక్రియుఁ డాతఁడు మిత్రుఁ, డీ త్రయం
బును జగతిన్ లభించుఁ గడుఁ బుణ్యముచేసిన యట్టివారికిన్"
—భర్తృహరి

ఆ మహర్షిని దర్శింపగనే స్వామికి అరుంధతివసిష్ఠులే జ్ఞప్తికి వచ్చిరి మహోన్నతమయిన సనాతన భారతధర్మము స్వామిస్మృతిపటమున తళుక్కుమని మెరసెను స్వామి శరీరము రోమాంచితమయ్యెను "మా దేశమునకు మీ రరుదెంచినచో ప్రతిభారతీయుడును మీ కఖండస్వాగత మొసగు" నని స్వామి ఆతనితో పల్కెను దాని కా మహర్షి డగ్గుత్తికతొ నిట్లు సమాధానమిచ్చెను నేను భారతదేశమునకు వచ్చినచో మరల నిచటకు రాజాలను అచటనే మీరు నా కంత్యక్రియలు జరుపవలయునచ్చును ఆహా! పూర్వజన్మమున ఆయన మన దేశమున జన్మించిన యే మహర్షియో కదా! కాని నాడు మన దేశముమీాద ఆ దేశియున కొకని కిట్టి భక్తితాత్పర్యము లుండుట యబ్బురము గదా! స్వామికి ఆ ఋషిపుంగవునకును పెంపొందిన మైత్రి వర్ణనాతీతము! ఆయన ఆంగ్లమున వ్రాసిన శ్రీరామకృష్ణపరమహంస జీవితచరిత్ర భక్తిరసభరితము!

స్వామి తీవ్రకార్యభారము చే శ్రమచెందెను కాన విశ్రాంతి నిమిత్తము మల్లరుకన్యయ సెవియర్ దంపతులును స్వామిని పశ్చిమ దేశపర్యటనకై తీసికొనిపోయిరి స్వామి ప్యారిస్ మీాదుగా జినివా కేగి ఆల్ప్సుకొండలు చేరెను జర్మనీలో కీల్ విశ్వవిద్యాలయమున తత్వశాస్త్రపండితుడు దేవసేన యను సామాంతరము గల డ్యూయిసెన్ మహాశయుని ఆహ్వానముపై కిల్ పట్టణము కేగెను ఈయన కూడ పశ్చిమ ఖండమున వేదాంతవిజ్ఞానము వ్యాప్తి చేయుట కఖండకృషి చేసెను వేదాంతొద్యమమున మాక్సుముల్లర్ ద్రోణాచార్యుడుకాగా తదంగరక్షకయు వకబృందమున నగ్రగణ్యుడగు డొయిసెన్ అర్జునుడు ఆ బాలమనిషి ఉపనిషద్రహస్యములను విమర్శించి వేదాంతమే మానవునకు శాంతి నొసగు దివ్యౌషధమని చాటినవాడు

మహర్షి మాక్సుముల్లర్ వలెనే రొమారోలా పండితుడు కూడ శ్రీరామకృష్ణున కాప్త శిష్యుడు కాననే శ్రీరామకృష్ణుని జీవితమును అతడు అత్యద్భుతముగా వర్ణించెను

పశ్చిమఖండమున స్వామి నిరంతరయాత్రలు ఉపన్యాసములు చేసి దానితో తృప్తి చెంది స్వదేశమునకు ప్రయాణమాయెను అపుడొక యాంగ్లమిత్రుడు "మీ రిటునుండి వెళ్ళిన తర్వాత మీ దేశమును గూర్చి ఏమని తలచెదరు" అని ప్రశ్నించెను "నేను ఇచటికి వచ్చుటకు ముందుగా నా దేశము నూరక ప్రేమించితిని ఇపుడో భారతదేశపు ధూళికూడ నాకు పరమపవిత్రము భారతదేశపు గాలి నాకు మహా భాగ్యము భారతదేశ మిపుడు నాకు పావనతమ పుణ్యక్షేత్రము" అని స్వామి సమాధానము!

విజయయాత్ర

వివేకానందస్వామి స్వదేశమునకు తిరిగి వచ్చుటచే నూతనశక మారంభయయినది భారతీయులు స్వామి రాకకై స్వాతివానకు ముత్తెపు చిప్ప వలే ఎదురు చూడసాగిరి స్వామి యెక్కిన యోడ సింహళము చేరునరికి వేలకొలది జనము లట గుమికూడిరి స్వామికి భారతీయు లిచ్చిన మహాస్వాగతము వారి పారమార్థికశీలమును ప్రకటించుచున్నది అచటనుండి స్వామి పాంబన్ పట్టణము చేరెను రామానాథరాజు గుఱ్ఱములు విప్పివేసి స్వామి శకటమును చేతులతో లాగెను విగ్రహము లలో మాత్రమేకాక దరిద్రులలో, దుర్బలులలో, దీనులలో ఉన్న శివుని గుర్తించి అర్చించుటయే శివార్చనమని స్వామి బోధించెను రాజు వేలకొలది బీదల కన్న వస్త్రదానములు చేసెను నలువది యడుగుల యెత్తుగల విజయస్తంభమును స్వామి మాతృదేశాగమనస్మృతిచిహ్నముగ నిర్మించెను స్వామి ఆతనిని రాజర్షి యను బిరుదుతో గౌరవించెను

తిరుచిరాపల్లి, కుంభకోణము, మున్నగు పట్టణములలో అఖండ వైభవములందుచు స్వామి చెన్నపగరము చేరెను స్వామిని చికాగొ మతమహాసభల కంపిన చెన్నపురి పౌరులు స్వామి నాహ్వానించుటకై నేడు మరల తమ కవకాశము లభించినదని మురిసి పోవుచుండిరి "శాంతి సంధాయకా, స్వాగతము జయవివేకానందయతీశ్వరా, స్వాగతము స్వస్తి శ్రీ రామకృష్ణశిష్యాగ్రగణ్యా, సుస్వాగతము!" మున్నగు వాక్యములుగల తోరణములతో పట్టణమంతయు కన్నులపండువుగా నుండెను గంభీరహర్షధ్వనులతో ఊరేగింపు బయలుదేరెను కళా

ల విద్యార్థులు గుఱ్ఱములు విప్పివేసి స్వామి బండి లాగిరి స్వామి అచట తొమ్మిది రోజులుండెను సంస్కృతము, తమిళము, తెలుగు భాషలలో ఇరవది నాలుగు స్వాగతపత్రములు సమర్పించిరి అచట స్వామి చేసిన 'నా సంస్కరణయుద్ధ విధానము', 'భారత భాగ్యోదయము' 'వేదాంతము – నిత్య జీవనము', 'భారత ఋషివరేణ్యుల మొదలగు ఉపన్యాసములు సుప్రసిద్ధములు

ఫిబ్రవరి 16వ తేదిన స్వామి కలకత్తాకు బయలు దేరెను

శ్రీరామకృష్ణ మఠ సేవా సంస్థలు

ఖిదిర్‌పూర్ చేరిన స్వామిని స్వాగతసంఘసభ్యులు ప్రత్యేకపు రైలు బండిలో కలకత్తాకు కొనిపోయిరి స్వామి బండినుండి బయటకువచ్చి అచటకు వచ్చిన వేలాది జనులకు నమస్కరించెను శిష్యసమేతముగ స్వామిని గుఱ్ఱపు బండిపై కూర్చుండబెట్టిరి యువకులు, విద్యార్థుల గుఱ్ఱములు విప్పి బండి తామే లాగిరి

పగలు కాశీపూర్ ఉద్యానమునందును, రాత్రి ఆలంబజారు మఠమునందును స్వామి నివసించుచుండెను ఒకనాడు పౌరాభినందనసభ జరిగెను విద్యార్థులు, జమీందారులు పండితులు పత్రికాధిపతులు మొదలగువారు వేలకొలది ఆ సభ నలంకరించిరి చక్కని రజతసంపుటమున స్వామికి స్వాగతపత్రము సమర్పింపబడెను స్వామి గంభీరహర్షధ్వానములతో లేచి దేశభక్తి సముజ్జ్వలముగ నుపన్యసించెను రామకృష్ణుడు సాక్షాదవతారమూర్తి యనియు, సమస్తమతసంఘశ్రేయమునకై పారమార్థికాదర్శస్వరూపుడై యవతరించెననియు స్వామి యుపన్యసించెను

ఒకపుడు తన సోదరుల కిట్లుద్బోధించెను—"శ్రీరామకృష్ణుని శిష్యులమగు మనము కేవలము ఆత్మమోక్షమునకై ప్రాకులాడుట యత్యంత నీచము ఒక్క ప్రాణికి సాయము చేయగల్గినచో వేయిసారులు కుక్కనయి పుట్టుటకయినను సంసిద్ధుడనే యని గురుదేవుడు వచించియుండలేదా! దరిద్రనారాయణుల నర్చించువిధానము మనము లోకమునకు చూపవలసి యున్నది భారతదేశమున నూతనసన్న్యాససంప్రదాయము నా జీవితోద్దేశము సామాన్యము నుద్ధరించుటకై తమ జీవితములు ధారపోయుటే

ఈ సంన్యాసుల ఆదర్శముగా నుండవలెను "స్వామి సోదరశిష్యు లాతనియాజ్ఞ పాలించుటకు బద్ధకంకణులైరి వెంటనే రామకృష్ణానం దుడు మరము స్థాపించుటకు, తద్ద్వారా గురుసందేశము వ్యాప్తిచేయుటకు చెన్నపురము వెడలెను ఇట్లు స్వామి శిష్యహృదయక్షేత్రమున నాటిన ఈ సేవాధర్మబీజమే కాలక్రమమున మహావృక్షమై శ్రీరామకృష్ణ మరములు, శ్రీరామకృష్ణ సేవాశ్రమములు అనెడి రెండు విభాగములుగా పనిచే యుచు శాఖోపశాఖలయి విశ్వవ్యాప్తమై నేడు దేశసేవనే కాక ప్రపంచ సేవగూడ చేయుచున్నవి

స్వామి తనకు మిక్కిలి విధేయులగు సోదరశిష్యులను నలుగురను "నేనుపెద్దపులినోట చేయి దూర్చు డన్నను, కాల కూటము భుజిం పుడన్నను గంగలోదూకి మొసలిని పట్టుకొను డన్నను, నిరశనవ్రతులై ప్రాణములు విడువు డన్నను, పంచాగ్నిమధ్యమున కాలి పోవుడన్నను మీరు సిద్ధమేగదా!" యని ప్రశ్నించెను వారి యంగీకారము పొంది స్వామి వారికి సన్న్యాసదీక్ష నిచ్చెను వారే విరజానంద, నిర్భయానంద, ప్రకాశానంద, నిత్యానందులను స్వాములు ఆ అభినవ సన్న్యాసులను స్వామి ఆశీర్వదించి యిట్లు పలికెను "మానవ జన్మమున మహో త్తమమగు వ్రతము మీరు దాల్చినారు మీ జననీజనకుల జన్మము ధన్యాతిధన్యము!

లోకకల్యాణ మను మహోద్యమములకై స్వామి సేవాసంఘములను స్థాపించుటకు తలపెట్టెను దానికై గృహస్థ శిష్యులను, సంన్యాసశిష్యు లను ఒక చోట సమావేశపరచి యిట్లుపన్యసించెను

"ఏ మహాపురుషుని పవిత్రనామము, అద్వితీయ జీవితోపదేశ ప్రభా వము, ఆయన నిర్యాణానంతరము పది రెండు వర్షములలోనే ప్రపంచ వ్యాప్తగాంచి, ప్రఖ్యాతి చెందెనో, ఆ దివ్యపురుషుని నామముతోనే ఈ సంస్థ శ్రీ రామకృష్ణ సేవాసంస్థ అను పేరుతో వ్యవహరింపబడును మనమందర మా ప్రభువు సేవకులము మాత్రమే"

గంగాతీరమున కలకత్తాకు నాలుగుమైళ్ళ దూరమున బేలూరు అను నగరమున శ్రీ రామకృష్ణ సంన్యాసి సంప్రదాయ కేంద్రముగా వివేకానందస్వామి 1897వ సంవత్సరమున ఈ రామకృష్ణ సేవాసంఘమును స్థాపించెను దీని లక్ష్యము లివి—

1 శ్రీరామకృష్ణపరమహంసచే ప్రతిపాదింపబడి ఆయన జీవితము చేతనే దృష్టాంతీకరింపబడిన రీతిగా వేదాంతమును, దాని మూలభావములను, బోధించుట, అభ్యసింపజేయుట, వివిధ దేశ భగవత్తత్త్వశాస్త్రములను పోల్చి పరిశీలించు అభ్యాసము కలిగించుట

2 కళలను, విద్యలను, వైజ్ఞానిక విషయములను పరిశ్రమలను బోధింపజేయుట, ఆ విషయములు గల గ్రంథములను చదివించుట

3 పై జెప్పిన విద్యలన్నిటియందు కొందరికి శిక్షణ నిచ్చి వారిచే ప్రజలకు బోధింపజేయుట

4 ప్రజాసామాన్యమున విద్యావ్యాప్తి జేయుట

5 పాఠశాలలు, కళాశాలలు, అనాథశరణాలయములు రసాయనాదిక పరిశోధనశాలలు, ఆస్పత్రులు, వికలాంగులకు వ్యాధిబాధితులకు ఆర్తులకు వసతి గృహములు, ఇతర ధర్మకార్యములను ఒనర్చు సంస్థలను స్థాపించుట

6 పై లక్ష్యముల వ్యాప్తికై పత్రికలు, గ్రంథములు, కరపత్రములు ముద్రించి ప్రజల కందించుట

తగిన కార్యనిర్వాహకులను నియమించి స్వామి యీ సంస్థకు తానే సాధారణాధ్యక్షుడయ్యెను కలకత్తా లోని బేలూరు కేంద్రమఠమునకు బ్రహ్మానందు నధ్యక్షునిగను, యోగానందుని ఉపాధ్యక్షునిగను స్వామి నియమించెను

క్రమముగా సంఘకార్య మభివృద్ధి యగుటచే కార్యనిర్వహణ సౌలభ్యము కొఱకు 1909 వ సంవత్సరమున ఈ సంస్థ శ్రీ రామకృష్ణ సేవాసంస్థయని శ్రీరామకృష్ణమఠమని రెండు భాగములుగా విభజింపబడెను ఈ మఠస్థాపనకు ప్రధాన లక్ష్యము లివి

1) శ్రీ రామకృష్ణజీవితముచే ప్రేరితులయి, నిష్కళంకము, త్యాగపూర్ణము, అనుష్ఠానపూర్ణ పారమార్థికతామయము అగు జీవిత మవలంబింప దీక్షవూనిన ఒక సన్యాసి సమితి నేర్పరిచి, ఆ సమితిలో నుండి, లోకమునకు సర్వ విధసేవ లొనర్చు సమర్థులగు బోధకులకు, కర్మకారులకు, శిక్షణ నిచ్చి ప్రపంచమునకు పంపుట

2) మానవులందరను, పురుషులను, స్త్రీలను, బిడ్డలను, వారిదే కులమయినను, ఏ మతమయినను, ఏ దేశమయినను, ఏ శరీరచ్ఛాయయయినను, అందరిని ప్రత్యక్షదైవములుగనే చూచుచు స్థానిక జనసాహాయ్యముతో మతకార్యములను నిర్వహించుట

ఈ మఠస్థాపనవిషయమై స్వామి అతిముఖ్యాశయమిది-- "స్వీయ మోక్షప్రాప్తిచే నేమి ప్రయోజనము? మధురాహారమును విశేషముగా అనుభవించు వాడెవ్వడు! అంతయు తానొక్కడే తినువాడా లేక అన్యులతో కలసి భుజించువాడా! సమస్తప్రపంచమును, నీతో గూడ మోక్ష సాధమునకు తీసికొని పోవలెను ఈ మాయాప్రపంచమున మన మాధ్యాత్మిక దావాగ్నిని ప్రజ్వలింపజేయవలయును అపుడే భారతీయుల మయిన మనము సచ్చిదానంద సామ్రాజ్యమున సుప్రతిష్ఠితులమై వెలయగలము

మఠమున జేరు ముముక్షువులకు సన్న్యాసిజీవితమునకు వలయు శిక్షణ గరపుటయే ఈ మఠసంస్థ ముఖ్యోద్దేశము వైద్యశాలలు, విద్యాలయములు సేవాశ్రమములు మున్నగు ధర్మసంస్థలు నెలకొల్పి మానవసేవ చేయుటయే రామకృష్ణ మఠసేవాసంస్థల ప్రధానలక్ష్యము సుశిక్షితులైన బ్రహ్మచారులును సన్న్యాసులును మాత్రమే సేవాసంఘ కార్య నిర్వాహకులలో ప్రధాన వర్గమయి యుండుటచే ఈ సంస్థలు రెండును మనశ్శరీరములవలే పరస్పరసంబంధముగలవై యొప్పుచున్నని

కాని ఈ కార్యక్రమములు రామకృష్ణుని ఆశయములకు విరుద్ధము లని, పాశ్చాత్యుల ననుసరించి యివి నిర్మింపబడినవని ఒక శిష్యుడు ప్రతిఘటింపగా స్వామి దివ్యావేశపూరితుడై దాని నిట్లు ఖండించెను—

"గురుదేవుని యాధిక్య మెట్టిదో మీా రె ట్లవగాహన చేసికోగలరు? ఆతడాధ్యాత్మిక సాగరము అతని ఆశయములు అనంతములు బ్రహ్మ జ్ఞానమునకై నను పరిమితి గలదు కాని అగాధమగు మన గురుదేవుని మనస్తత్వమిట్టిదని నిర్ణయింపజాలము ఆ మహాత్ముని కరుణాకటాక్ష శిక్షణ మొక్కటి ప్రసరించిన జాలును వేయిమంది వివేకానందు లరని మునుమున బయలు దేరగలరు! ఐన నాతడు నన్ను నిమిత్తమాత్రునిగ జేసికొని నా మూలమున తన కార్యముల నొనర్ప సంకల్పించినచో ఆ సంకల్పమును నేను శిరసావహించి తీరెదను!

త్యాగానుభవములను మానవసేవతో మేళవించు విధానమును లోక మునకు బోధించుటయే గురుదేవుని జీవితోద్దేశమని గ్రహించిన శిష్యా గ్రగణ్యుడు ఆత్మమోక్ష జగత్కల్యాణముల నొనగూర్చుటకై ఈ సంస్థ లను స్థాపించిన లోకోత్తరచరిత్రుడు గదా శ్రీవివేకానందస్వామి! త్యాగసేవలే నవీనభారతజాతీయాదర్శములని స్వామి ఎడనెడ గొంతెత్తి చాటియున్నాడు

మరొక సోదరశిష్యుడు, రామకృష్ణుని ఆశయములు భక్తిప్రధానములగు మోక్షసాధనములయియుండ స్వామి తెల్పు పాశ్చాత్యసంప్రదాయ సిద్ధ మగు మానవసేవే బంధహేతువనియు గురూపదేశవిరుద్ధమనియు ఖండింప సాగెను స్వామి అతని యీ దుర్విమర్శ విని ఒడలు మండి గూడపైకి మెల్లగా హాస్యపూర్వకముగా ఇట్లనెను— "నీవు పరమ మూర్ఖుడవు ఆ గురువుకు తగిన శిష్యుడవే నీవు [illegible] గణితములో మొదటి అక్షరము 'క' ను చూచి కృష్ణుడు జ్ఞప్తి [illegible] ఇక ముందుకు పోలేని ప్రహ్లా దుని చదువువలె అక్షరాభ్యాసము నాడే నీ చదు వంతమందినది

మీరే కాబోలు భక్తులు, పిచ్చి పుల్లయ్యలు! ముక్కుపచ్చలారని మీకు బ్రహ్మవిద్య యన నేమి తెలియును? 'ఓ దేవా నీ ముక్కెంత చక్కగా నున్నది, నీ కన్ను లెంత అందముగానున్నవి?' అని అర్థరహితముగా స్తోత్రము చేయుదురు మీరు ఇట్టి మిమ్ము అంత్యకాలమున రామకృష్ణుడు వచ్చి మీ చేతులు పట్టుకొని పరమపదమునకు తీసికొనిపోవునని నమ్ము మీ రెంత మూర్ఖులు?"

స్వామి క్రమముగా ఆవేశపడి యిట్లు ఘోషించెను "శ్రీరామకృష్ణుని గూర్చి నాకంటె మీ కెక్కువ తెలియునని మీ యభిప్రాయము! మానవుని బలహీనుని చేయు అర్థరహిత భావోద్రేకమే మీ భక్తి మీ రామకృష్ణు డెవరికి కావలెను? మీ భక్తిముక్తు లెవరికి కావలెను? మీ శాస్త్రబోధ లెవరికి కావలెను అజ్ఞానాంధకారమున కన్ను కానక కొట్టుమిట్టాడుచున్న నా భారతసోదరులను కర్మయోగప్రభావముచే పునరుజ్జీవింపజేసి స్వశక్తిపై నిల్చు ధీరులనొనర్చుటకై మహానందముతో వేయినరకము లనుభవించుట కయినను నేను జంకను నేను రామకృష్ణునకుగాని మరియెవ్వరికి గాని అనుచరుడను గాను నా కార్యక్రమమును కొనసాగించువారికి మాత్రమే నేను అనుచరుడను"

భావావేశముచే స్వామిశరీరము కంపించెను కండ్ల నుండి ఆనంద బాష్పధారలు వర్షించెను స్వామి యీ స్థితి గాంచి సోదరశిష్యులు పశ్చాత్తప్తులై క్షమాభిక్ష వేడుకొనిరి వారి సంశయాంధకారము స్వామి దివ్యావేశ మహానందముచే పటాపంచలయినది శ్రీరామకృష్ణుడే వివేకానందుని హృదయాంతర్జ్యోతియై వెల్గొందు చుండెనని శిష్యులందరకు చక్కగా తెలిసినది స్వామి నిరుపమానగురుభక్తిని, విశ్వమానవ ప్రేమను ప్రకటించు నిట్టి సంఘటన లనేకములు గలవు

స్వామికి గృహస్థశిష్యులుగూడ పలువురేర్పడిరి వీరి చరిత్రలుగూడ సన్న్యాసిశిష్యులచరిత్రలవలెనే పరమపవిత్రములు గృహస్థులందరకు ఆదర్శప్రాయములు వారిలో మహాకవి గిరీశచంద్రుడు ముఖ్యుడు నాగమహాశయుడు గూడ ఇట్టివాడే వీరిద్దరి చరిత్రలను ప్రత్యేకముగ తెలుగులో [illegible] [illegible] ఇట్టి గ్రంథము[illegible] శ్రీరామకృ[illegible] [illegible]మువారు ప్రకటించినవి చదివి వానిలోనిమంచిని గ్రహించి ఆచరించి మీ జన్మలు జీవితములు ధన్యము గావించుకొందురు గాక!

ఉత్తరదేశ జీవితము

అనారోగ్యస్థితి స్వామికి బాధాకరముగా నుండెను స్వస్థతనొందు టకై స్వామి కలకత్తా వీడి ఆల్మోరా కరిగెను లక్నోలోను, లోడియా లోను వేలకొలది ప్రజలు స్వామి కఖండ స్వాగతసన్మానములు జరిపిరి ఆల్మోరాలో స్వామికి పూర్వారోగ్యము లభించెను

మరల ఆయన తన సందేశమును ఉత్తరదేశమున వ్యాప్తిచేయ సంక ల్పించెను వివిధ రాష్ట్రములనుండి అనేకాహ్వానములు రాసాగెను స్వామి ఆల్మోరా, బారెల్లీ, అమృతసరము, జమ్మూ మున్నగు పట్టణ ములలో ఉపన్యసించి లాహోరు చేరెను

భారత దేశోద్ధరణకై స్వామి తన ఉపన్యాసపర్యటనమున తెల్పిన ముఖ్యవిషయము లివి

1 వర్ణములలో ఉపశాఖలు పోవిడిచి పెండ్లిండ్లు జరుపుకొనవలెను

2 తత్త్వబోధలకు ముం దన్నపానములు సమకూర్చి జనసా మాన్యుల పరిస్థితి బాగుచేయవలెను దీనికై విద్యావ్యాప్తి ముఖ్యావసరము

3 సంస్కృతవిద్యావ్యాప్తి దేశమంతటను జరుగవలెను

4 బలిష్ఠులను మేధానిధులను సృష్టించు జాతీయ విద్యాలయములు స్థాపింపవలెను

5 త్యాగము, సేవ అను మహోత్తమాదర్శముల విలువ భార తీయులు గుర్తింపవలెను

6 అంతఃకలహములను పోనడచి జనులలో ఐకమత్యము పెంపొం దింపజేయవలెను

7 సనాతనధర్మతత్త్వములను పాశ్చాత్యులకు బోధించుటకును వారి పారిశ్రామిక విద్యలను నేర్చుకొనుటకును యువకులకు తగు శిక్షణనిచ్చి పంపవలెను

శిష్య శిక్షణ

ఆసేతుహిమాచలము స్వామి తన సందేశము వ్యాప్తిచేసెను ఇక దేశోద్ధరణకార్యక్రమము, నిర్మాణకార్యక్రమము నిర్వహింపవలసియున్నది శిష్యులకు తగు శిక్షణ నిచ్చుటకై స్వామి బేలూరు మఠమున కరుదెంచెను

కలకత్తాలో రామకృష్ణపురమున నవగోపాల్ ఘోష్ అను ఒక భక్తుడు తన యింట రామకృష్ణ పూజామందిరము నిర్మించి, విగ్రహప్రతిష్ఠాపనకై స్వామి నాహ్వానించెను స్వామి సోదరశిష్యబృందసమేతుడై వందలకొలది జనులు వెంబడింప వంగకీర్తనలు పాడుచు మహోత్సాహముతో బయలుదేరెను కాషాయవస్త్రములతో స్వయముగా మృదంగము వాయించుచు భజనచేయుచు సామాన్య బైరాగివలె నేగుచుండిన ఆ యతివరేణ్యుని చూచి 'తన వేదాంతదుందుభిచే పాశ్చాత్యులయొక్క కర్ణభేరులు బ్రద్దలు కొట్టిన జగద్గురుడా యీతడు' అని జను లాశ్చర్యముతో, భక్తిపులకితులై 'జయ శ్రీరామకృష్ణపరమహంస, జయ శ్రీ వివేకానందయతీశ్వర' అని జయధ్వనులు చేసిరి వానిచే భూమ్యాకాశములు దద్దరిల్లిపోయెను స్వామి అచట శ్రీరామకృష్ణుని విగ్రహప్రతిష్ఠచేయుచు జగత్ప్రసిద్ధమగు ఈ శ్లోకమును రచించెను—

> స్థాపకాయ చ ధర్మస్య సర్వధర్మస్వరూపిణే,
> అవతారవరిష్ఠాయ రామకృష్ణాయ తే నమ

1898 వ సంవత్సరారంభమున గంగాతీరమున బేలూరులో శాశ్వత శ్రీరామకృష్ణమఠ నిర్మాణమునకై స్వామి పదునైదెకరముల భూమిని ఒక భవనమును కొనియుండెను ఆ ధనమున నెక్కువ భాగము స్వామి శిష్యురాలగు ముల్లరుకన్య సమర్పించెను ఇట్లే అమెరికావాసిని ఓలిబుల్ సతీమణి రామకృష్ణపూజామందిరమునకై ధనమొసగి కృతార్థురాలయ్యెను ఆ మఠనిర్మాణమునకు ఇక్షరూపాయ లయ్యెను

అప్పుడే స్వరూపానందు డను శిష్యుడు స్వామిని సన్న్యాసము నర్థించెను స్వామి యీతని పాండిత్యమునకు, త్యాగమునకు, జ్ఞానమునకు ముగ్ధుడై వెంటనే దీక్ష నిచ్చి యీతని రాకచే మనకు మహాలాభము కలిగినదని శిష్యులతో వచించెను ఈతడే ప్రబుద్ధభారత పత్రికాధిపతియై హిమాలయమందలి అద్వైతాశ్రమమున కధ్యక్షుడై స్వామికి తనయందు గల అఖండ విశ్వాసమును బలపరచెను

సోదరి నివేదితకు స్వామి బ్రహ్మచర్యదీక్ష నిచ్చెను భారతదేశము నకు తన సర్వస్వము నివేదించుటకే ఆమె తన దేశము వదలి స్వామివద్ద కేతెంచెను ఆమె గంగానదీ తీరమున కుటీరము నిర్మించు కొని, జోసఫన్ మెక్లాడ్, ఓలిబుల్, ముల్లరు అను వనితామణులతో కలసి బ్రహ్మచర్యవ్రత మాచరింపసాగెను

స్వామి శరీరారోగ్యలాభమునకై మరల డార్జిలింగు కేగెను కలకత్తాలో ప్లేగు వ్యాధి ప్రబలి ప్రజలను తుడిచిపెట్టుచున్న దను వార్త విని స్వామి వెంటనే దాని నరికట్టుటకై కలకత్తాకు తిరిగి వచ్చెను సహాయకార్యక్రమమునకు ధన మెచ్చటనుండి వచ్చునని శిష్యు లడుగగా మహావేశపూరితుడై స్వామి యిట్లు పలికెను "మనము కొన్న కొత్త మఠ మమ్మి వేయుదము మనము సన్న్యాసులము గదా ! వల యునచో వెనుకటివలెనే చెట్లక్రింద నివసించుచు బిచ్చమెత్తుకొని బ్రతుక సిద్ధమైయుండవలెను" స్వామి లోకసేవాపరాయణత యెట్టిదో చూచి తిరా! అదృష్టవశమున మఠ మమ్మవలసిరాలేదు సహాయము దానంతట నదియే లభించెను

ప్లేగుశాంతికి తగిన ప్రతిక్రియలు చేయించి స్వామి మరల ఆల్మోరా కేగి అచట భారతీయ విజ్ఞానమును గూర్చి ప్రసంగించెను నివేదిత ఆ ప్రసంగములు గ్రంథస్థము చేసి మనకు మహోపకారము చేసినది

భక్తియోగ గ్రంథకర్తయు, మహావిద్వాంసుడు అగు అశ్వినీకుమార దత్తు స్వామి నచటనే దర్శించెను స్వామి యిట్లనెను– "మీరు విద్యా విషయకకృషిచేయుట బాగున్నది మహాశక్తి మీయందు కార్య రూపము నందుచున్నది జ్ఞానదాన మొక్కటే మహోత్తమ త్యాగము ధీరులను చేయు విద్యను జనులలో వ్యాపింపజేయుడు విద్యకు ముఖ్య లక్ష్యము శీల నిర్మాణము విద్యార్థుల శీలము వజ్రతుల్యముగా చేయు టకు త్రికరణ శుద్ధిగా పాటుపడుడు

విద్యార్థులారా! చూచితిరా! మీయెడల మహాపురుషుల భావములు! విద్యార్థుల పురోభివృద్ధికై వివేకానందు డెంత కృషి చేసెనో తెలిసికొనుడు సర్వవిధములుగా మీ రభివృద్ధి చెంది, సంఘమును, రాష్ట్రమును, దేశమును, ప్రపంచమును మీ సేవానిరతిచే గౌరవించిననాడే మీకు గౌరవము లభింపగలదు సుడీ!

అశ్వినీ కుమారుడు స్వామిని "చెన్నపురి బ్రాహ్మణులు మిమ్ము వేదాధికారములేని శూద్రు డని పలుకగా నేను శూద్రుడ నయినచో చెన్నపురి బ్రాహ్మణులారా, మీరు చండాలురలో కెల్ల చండాలురని పల్కి తీరట, నిజమేనా? ఒకవేళ మీగ రట్లు నిందించి యుండినచో అది ధర్మ మేనా?" అని ప్రశ్నించెను

"ధర్మమని యెవ రందురు? నా యీ నిందను ధర్మమని యెన్న డును నేను సమర్థించుకొనను వారి యధికప్రసంగముచే నా యెడలు మండగా క్రోధాహంకారములచే అప్రయత్నముగా ఆ మాటలు నా నోటి నుండి జారినవి ఎవరు చేసనను తప్పు తప్పేగదా!" ఇది దానికి స్వామి సమాధానము చూచితిరా, స్వామి నిగర్వశీలము! ఇట్టివాడు గదా మన నరేంద్రుడు! ఇట్టివాడుగదా వివేకానంద సామ్రాజ్య పట్టభద్రుడు, మన మహర్షి వివేకానందస్వామి!

దివ్యానుభవములు

స్వామి తన శిష్యులతో ఆల్మోరానుండి కాశ్మీరము చేరెను అచ టినుండి శ్రీనగర్ కేగుచు నిట్లు ప్రసంగించెను "సన్న్యాసి కాంచన వాంఛనే ఆత్మహత్యగా భావింపవలెను దేశోన్నతి, వంశాభివృద్ధి ఇవియే హైందవవివాహోదర్మములు పాశ్చాత్యులు దుఃఖారాధకులు పశ్చిమ ఖండమున కానవచ్చునది పైకి పకపకలు, లోన వలవలలు ఇచటనో బాహ్యమున దుఃఖము, లోపల నిశ్చింత, ఉల్లాసము "

నివేదిత వెంటరాగా కాశ్మీరమునుండి స్వామి అమరనాథ్ కేగెను అమరనాథ పరమశివుడు తనకు ప్రత్యక్షమై స్వచ్ఛంద మరణ మను గ్రహించెనని స్వామి శిష్యులకు తెల్పెను

తర్వాత ఆతని మానసము లోకమాతృభావనలో లగ్నమయ్యెను గావ నడవునొక మహమ్మదీయ బాలికను నాల్గేండ్లదానిని స్వామి ఉమా ఎమారీ భావమున ఆరాధింపసాగెను ఆ సమయమున ఆ జగన్మాతయే ులువై పుల ఆయనకు సాక్షాత్కరించుచుండెడిది ఇట్టి దివ్యానుభవమున న్మయుడైన స్వామి చేతినుండి కలము జారి క్రింద పడిపోయెను స్వామి వెంటనే మహోన్నతభావసమాధిలో నిమగ్నుడయ్యెను

ప్రియమైన బిడ్డలారా! ఇట్టి కావ్యము లనేకములు రచించుటచేతనే ఆయనకు విశ్వకవి అను బిరుదము లభించినదని లోగడ తెలిపితిని గదా! స్వామి రచన సంస్కృతశ్లోకమొకటియు, తెనుగున అనువాద పద్య మొకటియు ఇచ్చుట మచ్చుగా ఇచ్చుచున్నాను వీనిలోని భావ గాంభీర్యము, తదితర కవితాగుణములు తెలిసికొని ఆనందింపుడు

"పీత్వా పీత్వా పరమ మమృతం వీత సంసారరాగాః
హాత్వా హాత్వా సకల కలహప్రాపిణీం స్వార్థసిద్ధిమ్,
ధ్యాత్వా ధ్యాత్వా గురువరపదం సర్వకల్యాణ రూపం
నత్వా నత్వా సకలభువనం పాతు మామంత్రయామః"

"జననీ, యీనుడిగాడ్పుదెబ్బఁ బడి స్పందించి, యీస్వల్ప
జీవనపుందోనె మునింగిపోయె జలధిన్, బర్వెన్ తుఫాన్, బుద్ధి పో
యినవారున్ బలహీను లీ పడవవా రేవుంద్రు, చుక్కాని వ
ట్టినవాడున్ చలియించె, నీ యనుగుపట్టిన్ నన్ను రక్షింపవే"

యాత్రలో వీరభవానిలో స్వామి జీవితమున అతి ముఖ్యసంఘటన జరిగెను "మహమ్మదీయుల క్రూరకరవాలముల కెరయయిన భవానీ దేవి ఆలయముగాంచి స్వామి రోషవిషాదములు పెనగొనగా నిట్లు పలికెను– "అపుడు హైందవు లెట్లూరకుండిరో గదా! నేనే యవ్వు డిచట నుండిన దివ్యమాతకై అరక్షణములో నా ప్రాణము బలియి చ్చెడివాడను" ఇంతలో లోనుండి జగన్మాత వాణి యిట్లు వినవచ్చెను "నీ కెందుల కీ తాపత్రయము! నీవా నన్ను రక్షించువాడవు? లేక నేనా నిన్ను రక్షించుదానను?"

సోదరబృందమున స్వామి

శరీర మను ఇంటనున్నందుకు చెల్లింపవలసిన అద్దెయే వ్యాధి సద్గురువులు శిష్యుల పాపములను వ్యాధుల రూపమున తామే యనుభవింతురు దీనికి నిదర్శనమా అనునట్లు స్వామి ఉబ్బసముతో బాధపడుచుండెను అయినను ప్రేమమూర్తియగు స్వామి దయామృతధారలు పాపాత్ముల మీదను, పుణ్యాత్ములమీదను గూడ సమానముగనే కురియసాగెను కాని లోకులు కాకులుగదా! స్తోత్రముల కుబ్బిపోయి స్వామి ప్రతివానిని ఆశీర్వదించుచున్నా డను వదంతి లోకములో వ్యాపించెను అది విని

స్వామి యిట్లనెను "నా వద్దకు వచ్చు వా రెట్టివారో నే నెరుగకుండగనే వారిని దీవించుటలేదు వారి పూర్వజన్మవృత్తాంతము గూడ నాకు కరతలామలకమే అయినను నేను దీవించకపోయినచో అశాంతిచే కొట్టుమిట్టాడు ఆ నిర్భాగ్యులను చేరదీసి ఊరడించు వారెవరు?" అహో! కరుణాపయోనిధి యగు శ్రీ రామకృష్ణుని హృదయమే స్వామి హృదయము గదా!

త్రిగుణాతీతుని ఆధిపత్యమున 'ఉద్బోధన' అను వంగపత్రిక వెలువడెను శారీరక మానసికాధ్యాత్మికాభివృద్ధిని చేకూర్చి భారతజాతీయతను పెంపొందించు భావములనే ప్రకటించుట, కవితావాఙ్మయ తత్వశాస్త్రములను గూర్చి ప్రాచీన సంప్రదాయములు నిరసించక ప్రాచీనాధునికాభిప్రాయములను సమన్వయించుట దాని నాదర్శములుగా స్వామి నిర్ణయించెను

కలకత్తానుండి విశ్రాంతికై స్వామి వైద్యనాథమున కరిగి యొక భక్తునింట కొంతకాలముండెను మరల బేలూరు మఠమున కరుదెంచి శిష్యశిక్షణమున నిమగ్నుడయ్యెను త్యాగసేవలే గృహస్థులకు పరమాదర్శములని తెలుపు మహాభారతమందలి కపోతోపాఖ్యానము తరచు శిష్యులకు బోధించుచుండువాడు ప్రజాసేవయే పరమాదర్శముగా గ్రహించి స్వామి విరజానంద, ప్రకాశానందులను ఢాకాకు పంపెను శారదానందుని గుజరాతుకు, శివానందుని నంపాళమునకు పంపెను రామకృష్ణానందు డీవరకే చెన్ననగరమున కేగి సేవాసంస్థ స్థాపించుట మన మెరుగుదుము గదా!

స్వామి యారోగ్యము మరల చెడెను సముద్రయానము చేసినచో మంచిదని వైద్యులు చెప్పగా స్వామి తురియానందుని తనతో తీసుకొని అమెరికాకు మరల ప్రయాణమయ్యెను శిష్యులు వీడ్కోలు జరిపిరి అంద స్వామి యిట్లుపన్యసించెను "శీలనిర్మాణమే మీ యాదర్శము కావలెను మీ రందరు మహర్షులు కావలెను శ్రీరామకృష్ణమఠ సేవాసంఘమునం దఖండ గౌరవముతో వర్తింపవలెను మహాబలవంతుడయి గూడ అబలవలె నవనీతమానసుడయి యుండువాడే నిజమయిన మానవుడు, ధీరుడు" నిజమే గదా

"సంపత్సు మహతాం చిత్తం భవేదుత్పలకోమలమ్,
అపత్సు చ మహాశైలశిలాసంఘాతకర్కశమ్"

"సంపదలు గల్గు తఱి మహామహుల హృదయ
మభినవోత్పలకోమలం బగుచు వెలయు
నాపదలు పొందునపుడు మహామహీధ
రాశ్మసంఘాత కర్కశంబై తనరు"

—భర్తృహరి

ప్రయాణ నిర్ణీతదినమున మాతృశ్రీ శారదాదేవి స్వామికిని, శిష్య బృందమునకును, తన యింట గొప్పవిందు చేసెను

విదేశ పర్యటనము

నివేదితా తురీయానందులతో శారదామాత యాశీర్వాదములతో స్వామి 1899 వ సంవత్సరమున గోల్కొండయను ఓడపై రెండవసారి అమెరికాకు ప్రయాణమయ్యెను కొలంబో చేరగనే అచటివారు స్వామికి ఖండస్వాగతమిచ్చిరి ఆ సముద్రయాత్రలో స్వామిచేసిన ప్రసంగములు నివేదిత "గురుదేవుడు నేను గ్రహించిన చందమున" అను గ్రంథమున ఇంపుగా వర్ణించెను

ఏడెన్, సూయజ్‌ల మీదుగా స్వామి లండనుచేరి కొన్ని దినము లట గడపి న్యూయార్కు చేరెను అచట వేదాంతసంఘాధ్యక్షుడుగా పనిచేయుచున్న అభేదానందుడు స్వామిని కలసికొనెను తానిక మూడు, నాల్గు సంవత్సరములకు మించి జీవింపనని ఆతనికి స్వామి తెలిపెను అటనుండి స్వామి లాస్‌ఏంజిల్స్‌మీదుగా ఓక్లాండ్ చేరెను స్వామి భావముల నచటివా రామోదించిరి మిల్స్ పండితుడు "ఈ మహనీయుని ప్రమాణమున విశ్వవిద్యాలయ పండితోత్తములు కేవలము పసిబాలుర" అని పలికి స్వామిని ప్రశంసించెను కాలిఫోర్నియాలో స్వామి ఉద్యమము అమితముగా వ్యాపించెను శాన్‌ఫ్రాన్సిస్కో, ఓక్లాండ్ మున్నగు నగరములలో వేదాంతసంఘములు స్థాపింపబడెను కాలిఫోర్నియాలో శాశ్వతాశ్రమస్థాపనకై ఒక శిష్యోత్తమురాలు నూట అరువది యెకరముల భూమి నొసగెను తురీయానందుడా యాశ్రమ కార్యములు నిర్వహింపసాగెను

1900వ సంవత్సరమున ప్యారిస్‌లో ప్రపంచ చారిత్రక మహాసభ జరుగునని తెలిసి స్వామి బయలుదేరెను మార్గమున పారమార్థిక శిక్షణను గూర్చి యిట్లు పలికెను "మెకాలే వ్రాసిన ఇంగ్లాండు చరిత్ర మూడు మార్లు చదివి నేను కంఠస్థము చేయగా, నా తల్లి యే మత గ్రంథమయినను ఒక్కసారి చదువగనే కంఠస్థము చేయగలియుండెడిది మనోనిగ్రహామున్నచో అసాధ్యమనునది ప్రపంచమున లేనేలేదు"

ఆ ప్యారిస్ సభకు జగదీశచంద్రుడుగూడ వచ్చెను. వృక్షవిజ్ఞానవేత్త యగు ఆతని ఘనతను గూర్చి స్వామి తన శిష్యులతో సంతోషముతో ముచ్చటించుచువాడు ఆ సభను సందర్శించి స్వామి తర్వాత ఓలిబుత్ సతి కతిథిగానుండి బ్రిటానీ చేరెను మరల ప్యారిస్ వచ్చి, వియన్నా కాన్‌స్టాంటినోపిల్, ఏథెన్సు, ఈజిప్టుల చూచి అటనుండి ఏకాకిగా స్వామి భారతదేశమునకు బైలుదేరెను

మఠ జీవనము

స్వామిరాక బేలూరు మఠమున ఎవరికిని తెలియదు 1900 డిశంబరు 9 వ తేదీన రాత్రి తొమ్మిది గంటలకు స్వామి మఠమున కేతించినంతనే శిష్యులందరును 'స్వామీజీ వచ్చినారు, స్వామీజీ వచ్చినారు' అని బ్రహ్మానందభరితులయిరి భోజనానంతరము స్వామీజీ తన యాత్రనుగూర్చి పలికెను "మొదటి యాత్రలో నేను పాశ్చాత్యుల శక్తి సామర్థ్యముల కబ్బురపడితిని, కాని ఇపుడో వారి వ్యాపారధోరణి, అధికారవాంఛ, తలచుకొని నాకు చాల రోత కలుగుచున్నది వారి సంఘీభావ బుద్ధి కొనియాడదగినదే కాని తోడేళ్ళ సమావేశమున అందమేమున్నది? పాశ్చాత్యుల జీవనవిధానము నాకు నరకప్రాయమనిపించుచున్నది"

బేలూరు మఠమున బ్రహ్మచారులును, సన్యాసులును తన మహాభారమును వహించుటకు సమర్థులను చేయుటొక్కటే స్వామి కిక మిగిలిన మహాకార్యము! స్వామి యాదేశానుసారము సోదర శిష్యులు నూతన శిష్యులకు పలయు సుశిక్షణ నీయసాగిరి

స్వామికి మరల ఢాకాప్రాంతము నుండి ఆహ్వానములు రాసాగెను స్వామితల్లి భువనేశ్వరీదేవి అస్సాము, ప్రాచ్యవంగదేశములలోని పుణ్య క్షేత్రములను దర్శింపదలచెను తల్లిని, కొందరు శిష్యులను వెంట బెట్టుకొని స్వామి కలకత్తా నుండి 1901 మార్చి 18 వ తేదీన ఆ యాత్రకు బయలుదేరెను

ఢాకాలో స్వామికి గొప్ప స్వాగతము లభించెను స్వామి అచటి జగన్నాథకళాశాలలో నేనేమి తెలిసికొంటినను విషయము గూర్చి ప్రసంగించెను అటనుండి కామాఖ్యచంద్రనాథ పుణ్యక్షేత్రము దర్శించి, గౌహాటి మీదుగా షిలాంగ్‌కు వెళ్ళెను భారతదేశమిత్రుడు, సర్ హెన్రీ కాటన్ మహాశయుడు, స్వామితో భారత జాతీయసమస్యలను గూర్చి చర్చించెను ఉదారహృదయుడగు ఆ దొర భారతదేశ పరిస్థితులను భారతీయాశయములను గ్రహించి మన దేశక్షేమమునకై కృషి చేసెను మహా త్యాగమూర్తి యని స్వామి యాయనను ప్రశంసించెను గోదా వరికి ఆనకట్టను కట్టించి గంగను మన ఆంధ్రదేశమున పారించుటచే కొన్ని జిల్లాలను సస్యశ్యామలము చేసిన యీ అపరభగీరథుడు అట్టి అభినందన లందుకొనుటకు అర్హుడనుటలో ఆశ్చర్యమేమి?

స్వామి యీ సమయమున సోదరశిష్యుడు నాగమహాశయుని గృహ మున ఆప్యాయముగా ఆయన గృహిణి యొసగిన ఆతిథ్యము స్వీకరించి ఎంతో ఆనందించెను ఢాకాలో మరల స్వామి ఆరోగ్యము విశేషముగా క్షీణించెను అతిమూత్రము, ఉబ్బసము స్వామిని పీడింపసాగెను తన యస్వస్థతను తలచుకొని స్వామి యిట్లు పలికెను "ఈ శరీర మేమయి ననేమి? జనులకు పదునైదువందల సంవత్సరములవరకు ఆచరించుటకు వలయు సందేశ మొసంగియున్నాను గదా!"

స్వామి మరల బేలూరు చేరెను శిష్యులు చికిత్సనిమిత్తము వైద్యుని నియమించిరి వారికి తనపైనున్న భక్తి శ్రద్ధలు, ఆత్రము చూచి ఆయన ఆనందాశ్చర్యములతో తల మున్కలగుచుండువాడు ఒకప్పు డాతడు కౌపీనధారియై తిరుగును మరొకపుడు కాషాయములు తాల్చి దీర్ఘాలోచనచేయును. వేరొక సమయమున ధ్యాననిమగ్నుడగును ఇంకొక సమయమున గ్రంథపఠనానందసాగరమున ఓలలాడును

నేలమీదనే ప్రక్కవైచుకొని పరుండును ఆ గదిలో వ్రాత పరిక రములతో బల్లయొకటి యుండెను ఒకవైపున లేడి చర్మము స్వామి ధ్యానమును జ్ఞప్తికి తెచ్చును గదిలో మరొక ఆకర్షకవస్తువు గలదు అదియే శ్రీరామకృష్ణుని చిత్రపటము అందలి మూర్తిని ప్రేమానురా గములతో అఖండభక్తితో స్వామి అవలోకించుచుండును దాని భావము బహుశః "గురుదేవా! మీరు నాకు వప్పగించిన పని శతగుణాధికముగా నిర్వహించినాను ఇక నన్ను నీ దగ్గరకు ఎలిపించుకొండు నే నిచ టకు వచ్చినపని పూర్తి అయినదిగదా! ఇంకను ఈ ప్రపంచములో ఈ బాధలు పడుచు నే నెంత కాలముండుట" అని అయియుండును!

బ్రహ్మచర్యము, త్యాగము, మాతృదేశోద్ధరణవిధానము, భారతీయ కళానైపుణ్యము, సంస్కృతవాఙ్మయము, ఈశ్వరానుగ్రహము మొద లగు వానిని గూర్చి స్వామి బోధించువాడు వీణాగానమును మించు తన గాత్రముతో స్వామి తరచు సంకీర్తనచే మైమరచువాడు స్వామికి పాదములుబ్బుటచే నడచుట గూడ కష్టమయ్యెను నిద్రపట్టదయ్యెను అయినను ఆ శరీరబాధలను స్వామి లెక్కించువాడే కాదు

పుష్పచనాదులను వృద్ధిచేయుట, గోసంరక్షణ స్వామికిష్టము పాదులు, పూలకోటలు, బ్రహ్మానందస్వామి పంచుకొనెను ఆవులు మేయు పొలముల వివేకానందస్వామివి పొలముల సరిహద్దుల విషయమై వివేకానందుడు బ్రహ్మానందునితో బాలకునివలె తగవులాడుట శిష్యులకు వినోదముగా నుండెడిది

దుర్గా కాళీ లక్ష్మీ పూజలను స్వామి సోదరశిష్యసమేతుడై యథాశా స్త్రముగా జరిపెను వేలకొలది దరిద్రనారాయణుల నన్నాదులచే యర్చిం చుట యీసారి యీ పూజయందలి ప్రధానవిషయము మాతృశ్రీ శారదాదేవికూడ భక్తబృందముతో దుర్గాపూజా సమయమున మఠము నకు విచ్చేసెను ప్రసిద్ధ సనాతనపండితు లందు పాల్గొనుట మరొక విశేషము!

స్వామి ఆరోగ్యము దినదినము క్షీణింపసాగెను కాని యాతడు విశ్రాంతియే తీసికొనడు 1901 వ సంవత్సరమున జపాన్ నుండి వచ్చి యిద్దరు ప్రఖ్యాత పురుషులు కోరగా స్వామి వారితో బుద్ధగయ కేగెను అటనుండి వారణాసి కేగి విశ్వనాథుని చివరిసారి దర్శించి స్వామి బేలూరు తిరిగివచ్చెను

మఠప్రాంతమున పనిచేయు సంతాలులను కూలీలు పడుబాధలు గాంచి స్వామి యిట్లాక్రోశించెను "అయ్యో! వారి దుఃఖమును, దారిద్ర్యమునుచూచి నే నెట్లు భరింతును! దేవతారాధనార్భాటము మన కింక వలదు మన విద్యాగర్వము, శాస్త్రజ్ఞానము మూలకు తొసి యూరూర తిరిగి దరిద్రనారాయణ సేవకై మన జీవితములను ధారపోయుదము"

మరొకప్పుడు స్వామి యిట్లు వ్యథ చెందెను "తమ సోదరహిందువులు తమ్మాదరింపకుండుటచే చెన్నరాజధానిలో వేలకొలది పంచములు క్రైస్తవులుగా ఎట్లు మారిపోవుచున్నారొ చూడుడు కాని వా రిట్లు మారుటను ఆకలి, దారిద్ర్యము మాత్రము కారణము కాదు మనము వారిని మానవమాత్రులుగా చూడకపోవుటయే అందుకు కారణము ఇట్టి తుచ్ఛాచారములు ధ్వంసము చేయుడు ఎవడు జీవారాధకుడో వాడే దైవారాధకుడు" స్వామి తన అస్వస్థతను పాటింపక సోదరదేశీయులకై మహోన్నతాశయములు ఘోషించిన సమయములు కొకొల్లలు!

శిష్యు లొక దినమున నియమానుసారము ధ్యానింపలేదు స్వామి క్రుద్ధుడై వారలను నరమున భుజింపరాదని, బైట మాధుకరమెత్తు కొనుడని ఆజ్ఞాపించెన వా రట్లు చేయుటకు బైలుదేరగా స్వామి గూడ వారి ననుసంంచెను కాని వారు బిచ్చమెత్తుట చూడజాలక స్వామి ఏదొ మిషతో కలకత్తాకేగి మరునాడు మఠమునకు తిరిగి వచ్చెను తమ తమ యనుభవములను స్వామికి తెలిపి స్వామితో గూడ వారంద రానందించిరి

వంగభాషలో రచించిన వర్తమానభారత మను గ్రంథమందలి స్వామి చరమోపదేశ వి

"హే భారతజననీ, నీ సతిత్వాదర్శము సీత సావిత్రి — దమయంతి అనుమాట మరువకుము — సర్వసంగపరిత్యాగి శంకరుడు ఉమామహేశ్వరుడు ని కారాధ్యుడను మాట మరువకుము — నీ యైశ్వర్యమునకు, నీ వివాహమునకు, జీవితమునకు తుచ్ఛవిషయసుఖములు మాత్రము ముఖ్యముగా దను మాట మరువకుము — యజ్ఞనారాయణున కాహుతియగు నిమిత్తము జన్మించితి వనుమాట మరువకుము"

మహాసమాధి

ప్రాచ్యపాశ్చాత్య దేశములందలి యజ్ఞానాంధకారమును వివేకానంద సూర్యోదయముచే పటాపంచలు చేసిన స్వామి ఇహజీవితము చాలించ వలసిన సమయ మాసన్నమైనది ఈ సంగతి యెరిగి దుఃఖించుచున్న శిష్యులతో స్వామి యిట్లు వచించెను "శిష్యుల నెన్నడును విడువక, వారి నంటిపట్టుకొనియుండుటచేతనే గురువు తరచుగా వారిని పాడు చేయును అనుచరులు సుశిక్షితులు కాగానే నాయకుడు వారిని స్వేచ్ఛగా వదిలివేయవలెను లేనిచో వా రభివృద్ధి నొంద లేరు"

వారముదినములకు తాను గతించు ననగా స్వామి పంచాంగమున ఒక తిథియెదుట గుర్తుంచెను ఆయన మహా సమాధి నందిన తర్వా తమాత్రమే అది 4–7–1902 అని శిష్యులు గ్రహాంపగలిగిరి!

తన యంత్యదినమున స్వామి పూజామందిరమునకేగి ఏకాంతమున మూడు గంటలు ధ్యానించెను తర్వాత బయటకు వచ్చి పచారుచే యుచు తనలో తానిట్లనుకొనుట ప్రేమానందు డను శిష్యుడు విని దిగ్భ్రాంతుడయ్యెను "వివేకానందు డేమి యొనర్చెనో మరొక వివే కానందు డుండిన గ్రహించెడివాడు – ఐనను కాలగర్భమున ఎందరు వివేకానందు లుద్భవింప నున్నారో గదా!"

భోజనానంతరము స్వామి ఒంటిగంటకు బ్రహ్మచారుల గది కేగి వ్యాకరణపాఠము చెప్పెను నాటి సాయంకాలము ప్రేమానందునితో అనేకము ప్రసంగించెను మఠమున వేదకళాశాలా నిర్మాణ మత్యవస రమని నొక్కి చెప్పెను

స్వామి ధ్యానార్థము సంధ్యాసమయమున తన గది కేగెను ఒక శిష్యుని ఎలచి గది కిటికీలు తెరచి విసరమనెను స్వామి నిదురించు చున్నట్లు తోచెను ఒక గంట గడచెను శిష్యుడు పాదము లొత్తుచునే యుండెను కుడివైపున కొత్తిగిలి స్వామి పసిబిడ్డలు స్వప్నమున రోదన ముచేయు నట్లొకవిధమయిన ధ్వనిచేసెను ఎమ్మట దీర్ఘనిశ్వాసము – తలగడనుండి తలజారిపోయెను మరియొక దీర్ఘ నిశ్వాసము – అలసట చెందిన ఆ శిశువు జగజ్జనని యొడిలో పవ్వళించెను స్వామి స్వచ్ఛంద

మరణము చెందెను! విశ్వనాథుని వర మూరక పోనిచ్చువాడా స్వామి! యోగియై పుట్టి యోగియై ఆతడు శరీరము చాలించెను అనేక జన్మ లెత్తి యీ జన్మయందు సిద్ధుడై పరాగతి నందెను

"అనేక జన్మసంసిద్ధః తతో యాతి పరాంగతిం"
అనిగదా గీతాసూక్తి!

నలుబది యేండ్లయిన నిండకమునుపే మన స్వామికి నూరేండ్లు నిండిపోయెను

నరుడై అవతరించి, నరేంద్రుడని పేరొంది, ఉజ్జ్వల పవిత్రాశయసాధనచే నరోత్తముడై, శ్రీరామకృష్ణ పాదారవింద సంస్పర్శచే మహర్షియై, తన యద్వితీయబోధలచే వివేకానందస్వామి యను బిరుదనామముతో, ఖండఖండాంతరములందును విఖ్యాతిచెందిన యీ బ్రహ్మర్షి, యీ విధముగా ఇహలోకము వీడి పరతత్త్వము నారాయణునం దైక్యమందెను

మరసమీపశిష్యులకు, ఇతర ప్రజలకే గాదు, దూరదేశములకు, సుదూరఖండములకు గూడ ఈ వార్తతంత్రీ సహాయముతో క్షణములో వ్యాపించెను 'ఏమీ? స్వామి మరణించెనా? ఇది సాధ్యమా?' అని స్వామి శిష్యులతో బాటు ప్రపంచప్రజలుగూడ దుఃఖముతో తల్లడిల్లిరి తెల్లవారకముందే జొరులతో ఇసుకవేసిన రాలకుండ మరము నిండిపోయెను

శ్రీరామకృష్ణుని నిర్యాణమాదిగా శిష్యులిట్టి మహాపద నెరుగరు గురుదేవుడు స్వామికి తమ్మప్పగించి వెళ్ళిపోయినాడు కన్న తల్లి దండ్రులకంటె ఎక్కుడు ప్రేమానురాగములు చూపిన తమ ప్రియతమ సోదరుడు, తమ సంశయాంధకారము బాపు సద్గురువరేణ్యుడు తమ కిక లేనే లేడా? అవసాన సమయమున స్వామి త మ్ముద్దేశించి "వీరు నా బిడ్డలు, వీరికి బోధించుటలోనే శరీరము శిథిలమైనచో, అది నాకు తృణప్రాయము! అని వచించెనే? ఇక తమ యోగక్షేమముల నరయువా రెవ్వరు? ఇకనెవరు తమరిని కష్టసుఖములలో ఆదుకొనగలరు?" ఇట్టి భావసంఘర్షణతో ఆ శిష్యులు పడిన పరితాపము అవర్ణనీయము!

మఠప్రదేశమంతయు ఆనాడు వేలకొలది జనులతో నిండిపోయెను అపరాహ్ణ మగుసరికి స్వామి శరీరము క్రిందకు తెచ్చి కాషాయవస్త్రములతో కప్పి ఒక తల్పముపై ఉంచిరి పాదపద్మముల ముద్రలు తీసి పూజార్థమై భద్రపరచిరి శంఖఘంటారవములతో ఆరతి ఇచ్చి అందరును స్వామికి తుదిసారిగా కన్నీరు కాలువలు కట్టగా సాష్టాంగ దండప్రణామములు చేసిరి !

శ్రీరామకృష్ణుని సన్న్యాసపుత్రులు స్వామిశరీరమును తమ భుజములపై ఇడికొని "శ్రీగురుమహారాజ్ కీ జయ్" అని జయ జయ ధ్వనులు చేయుచు ఆవరణమందలి బిల్వవృక్షమువద్దకు చేరిరి అచట ఆ శరీరము నుంచి చితి కగ్నిముట్టించిరి చందనకాష్ఠకర్పూరాదికములు స్వామి శరీరమును త్రుటిలో నిర్దాక్షిణ్యముగా దహించి విభూతిమయమొనర్చెను

చితినుండి అస్థులు తీసి భద్రపరచిరి నేడీ తావుననే శ్రీ వివేకానంద దివ్యాలయము వెలసి యున్నది ఇందు క్రింది భాగమున చలువరాతితో నిర్మితమయిన శ్రీ వివేకానంద విగ్రహమును, పై యంతస్థున పరమేశ్వరుని చిహ్నమగు ఓంకారమును విరాజిల్లు చున్నవి

"ఉత్తిష్ఠత, జాగ్రత, ప్రాప్య వరా న్నిబోధత"

"లెండు మేల్కొనుడు పరమపదప్రాప్తి పర్యంతము తపింపుడు ఆగవలదు" ఇదియే శ్రీరామకృష్ణవివేకానంద సందేశము

ఆనందసరోవరము

తెలుగు బిడ్డలారా!

నడిసముద్రమున పుట్టి మునిగినట్లు స్వామి జీవిత మిట్లు నడిమి యున్ననే అకాలమృత్యువునకు బలియయిపోయినదే అని విచారించుచున్నారా! కేవలము వెతగుందుటయే కాదు, మీలో కొంతమంది ఈ చరిత్ర శ్రద్ధగా చదివి, చక్కగా అవగాహన చేసుకొన్నవారు, గుండె చెరువయి కన్నీరు వదలక మానరని గూడ నే నెరుగుదును! ఈ దివ్య మానవుని మహోజ్జ్వల త్యాగకథ విని గూడ దుఃఖానందాశ్చర్యములు ముప్పిరి గొనగా కండ్లు చెమర్చని వాడు నిజముగ మానవుడేనా?

కాని పుట్టుట గిట్టుట కొఱకే గదా! ఇది ధ్రువమైన సత్యము దీనికి తిరుగులేదు నిజమునకు చావుపుట్టుకలు విచారింపదగినవికావు సుమండీ శరీరము వేరు, ఆత్మ వేరు, అని తెలుసుకొన్న వారు విచారింపరుకూడ పాతవస్త్రములు వదలి మనము క్రొత్తదుస్తులు ధరించునట్లే జీవుడు శిథిలమైన శరీరము వదలి పూర్వజన్మానుభవమునుబట్టి మరొక శరీరము ధరించుటయే పుట్టుక, దానిని వదలుటయే చావు

"పరివర్తిని సంసారే మృతః కోవా న జాయతే?
స జాతో యేన జాతేన యాతి వంశః సమున్నతిమ్"

—భర్తృహరి

"ప్రాణిలోకంబు సంసార పతితమగుట
వసుధపైఁ గిట్టిపుట్టని వాఁడు గలఁడె?
వాని జన్మంబు సఫల మెవ్వానివలన
వంశమధికోన్నతి వహించి వన్నె కెక్కు!"

ప్రతిజీవికిని మరణము తప్పదు కాని ఎవ్వాడు జీవింపననేకులు జీవింతు రట్టివాని మనుగడయే మనుగడ బుద్ధిమంతులు మాత్రము పుట్టని చావని త్రోవ కనుగొనుటకే సదా పరితపించుచుందురు కేవలము పుస్తకములు చదివినంతమాత్రమున, లేదా పురాణాదులు విన్నంత మాత్రమున, నిజమయిన భగవత్పరితాపము కలుగదు సుమండీ! అట్టి పరితాపము అనుభవించిననాడు భగవంతుని చేరుటకు మార్గములు వానియంతట నవియే లభించును విశుద్ధము, అవ్యాజము అయిన అట్టి పరితాపము లేకపోగా సంసారపంకమున పోనుపోను తగులాటము పెంచుకొనుచు ఎప్పుడో ఒకసారి భగవన్నామ ముచ్చరించుటచేత, హృదయదఘ్నముగా గాక నామమాత్రముగా పూజచేసినంతమాత్రమున, భగవంతునియందు భక్తి కుదురుకొనదు భాగవతోత్తముడగు ప్రహ్లాదుని యీ సూక్తి యెంత నిజము!

"అచ్చవుఁ జీకటింబడి గృహవ్రతులై విషయప్రవిష్టులై
చచ్చుచుఁ బుట్టుచున్ మరలఁ జర్వితచర్వణులైన వారికిన్,
జెచ్చెరఁ బుట్టునే? పరులు సెప్పిన నైన, నిజేచ్ఛనైన, నే
* మిచ్చిన నైన, గానలకు నేగిన నైన, హరిప్రబోధముల్"

ఈ హరిప్రబోధమునకు సదా సాధుసంగతియేగాక జన్మాంతర సుకృతము గూడ ఆవశ్యకము అవ్యాజమైన హరికీర్తనచే మాత్రమే

ముక్తికాంత జీవుని వరించును మన శరీరమును మాత్రము కాంక్షించు నది సామాన్యకాంత ఆత్మను కాంక్షించునది ముక్తికాంత జన్మరాహిత్యమే—చావు పుట్టుకలు తప్పించుకొని జీవుడు దేవుని చేరుటయే — మోక్షము

"జన్మ దుఃఖం జరా దుఃఖం జాయా దుఃఖం పునః పునః,
సంసారసాగరం దుఃఖం తస్మాత్, జాగృత, జాగృత!"

జన్మజరామరణాదులతోను, దారా పుత్రాదులతోను ఈ సంసారము దుఃఖమే కల్గించును చిత్ర మేమన క్షణికము, నిస్సారమునగు ఈ సుఖమునకే ఎంతటివాడైనను తాపత్రయ పడుచుండును సరస్సులో ఉన్న తామరాకు నీటిలో ఉండి గూడ మునుగకుండ జలముపై తేలియాడుచుండును గదా! అట్లే సుఖదుఃఖమయమగు ఈ సంసారమున జీవించుచుండి గూడ వానిని పట్టించుకొనకుండ నిర్లిప్తుడుగా నుండువాడు మాత్రమే ధీరుడు వాడే జ్ఞాని, వాడే విరాగి అట్టివాని నే కష్టమును క్రుంగదీయదు, ఏ సుఖమును పొంగజేయదు వాడు మాత్రమే మోక్ష సామ్రాజ్య పట్టభద్రుడు కాగలడు అడుగో వాడే పరమహంస! ఆ పరమహంస మాత్రమే బ్రహ్మానందసరోవరమున సదా తేలియాడుచుండును వాని జన్మమే ధన్యము, వాని జీవితమే సార్థకము ఆ మహాపురుషుని గన్న తల్లిదండ్రుల కడుపులే నిజముగా పండినట్టివి వానిచే వాని వంశమేగాక ఆ దేశముకూడ ఘనత వహించును గౌరవాస్పదమగును వానిని తలచుకొని తద్దేశీయుడు ప్రతివాడును గర్వముతో తలయెత్తుకొని తిరుగగలడు!

మనమెరిగినంతలో ఈ జగత్తులో శ్రీ రామకృష్ణపరమహంస యిట్టి మహాపురుషుడు కాననే జగమెరిగిన బ్రాహ్మణుడు సదా బ్రహ్మానంద సరోవరమున ఓలలాడుచుండువాడు తానొకడే కాదు, శిష్యులకు గూడ తన బ్రహ్మానందానుభూతి నాతడు పంచిపెట్టినాడు కామినీకాంచనములను తృణప్రాయములుగా విసర్జించిన ధీరోదాత్తుడు భార్యతో ఏక [illegible] కామపిశాచమునకు లొంగని ఈ సాధుపుంగవు

శ్రీరామకృష్ణు డొకచోట మాత్రమే కుదురుకొని యున్న సరోవరము ఆ మానససరస్సు తన్ను వెదకుకొనుచు సమీపించువారికి మాత్రమే బ్రహ్మానందామృతమును పంచిపెట్టుచుండునది తరుగని తన హృదయసరోవరముననున్న ఆ అమృతమును భారతదేశముననే గాక యావత్ప్రపంచమునకు పంచి పెట్టి తృప్తి కాంచవలెనని ఆతడెంతో తహ తహలాడెను దాని ఫలితమే శ్రీ వివేకానందావతరణము!

హంసకు మానససరస్సు విశ్రమస్థానము గదా! అచటి శైత్యము ప్రశాంతి, ఆనందానుభవమున కనుకూలమైన వాతావరణము— సుమనోహరము, అనుభవైకవేద్యము ఆ హంసకును, పరమహంసకును ఎంతో అంతరము కలదు పక్షి కేవలము శరీరానందము కొరకే మానససరస్సున విహరించును మరి పరమహంసయో ఆత్మానందమునకై అందోలలాడును ఇట్టి పరమహంసకును, మన యీ శ్రీరామకృష్ణపరమహంసకునుగూడ మరల నెంతో భేదము కలదు ఈయన ఆత్మమోక్షమునకుమాత్రమే గాక జగత్కల్యాణమునకై— జగత్తులోని మానవమాత్రుని భుక్తిముక్తులకై—పరితపించెను తానుపొందిన బ్రహ్మానందానుభవమును బాధాపరితప్తులయిన జీవులందరికిని పంచిపెట్టి వారికి మోక్షమార్గము సుకరముచేసెను ఆత్మమోక్షముతోబాటు లోక సంగ్రహము కూడ ఆ యోగిలక్ష్యము జ్ఞానియైనవాడు తా ననేకవిపత్పరంపరలకు లోనయి కూడ వానిని లెక్క సేయక తోడి మానవుల త్రివిధతాపములు తీర్చుటకే సదా తపించును మత కర్తల లక్ష్యమదియే కదా! శ్రీరామకృష్ణుడు తన యుదారాశయములను విశ్వమున వ్యాపింపజేయగల ప్రజానాయక లక్షణయుక్తునకై, నరేంద్రునకై పరితపించెను గదా! ఆ పరితాపమే మూర్తీభవించిన మన యీ వివేకానందస్వామి!

శ్రీ పరమహంస బ్రహ్మానందసరోవరము నిర్మించెను ఘోరతపస్సాధనచే తాను సంపాదించిన ఆనందామృతమును ఆత డందు కూడబెట్టెను ఆతని జ్ఞానపుత్రుడు శ్రీ వివేకానందుడు ఆ ఆనందధనమును దేశదేశములందును తిరిగి జాతిభేదమును లెక్కింపక అధికారిభేదమును పాటింపక అందరికిని పంచిపెట్టెను ఈ విధముగా ఆతడు గురు నిర్మితమైన బ్రహ్మానందసరస్సుకు బ్రహ్మాండమయిన ఆనకట్ట కట్టి, కాలువలు త్రవ్వి, తన మేధావిశేషముచే— ప్రతిభాతిశయముచే— ఊహా చాతుర్యముచే— కార్యదక్షతచే ఆ ఆనందజలమును పల్లములకే గాక మెరక

ప్రదేశములకుగూడ పారించి చూపి కార్యశూరుడయ్యెను! ఏ లక్ష్యసాధనకై గురుదేవుడు తన్ను చేరదీసెనో, దానిని నూరురెట్లుగా సాధించి తన గురుదేవుని ఋణము వడ్డీతో గూడ తిర్చుకొనిన వాడాయెను!

మహర్షివివేకానందుడు తన అద్వితీయమేధాసంపదచే, భారతదేశము నకేగాక ప్రపంచమంతటికిని సేవచేసి ప్రఖ్యాతి గాంచుచున్న శ్రీ రామకృష్ణ మఠసేవాసంస్థలను స్థాపించి సార్థక నామముడగు జగద్గురువు కాగలిగెను కేవలము జ్ఞానోపదేశము చేయువాడుమాత్రమే గురువు కాజాలడని, శిష్యుని ఐహికములగు ఆవశ్యకతలు తీర్చవలసిన భాధ్యతగూడ గురువు వహించి తీరవలెనని ఆతడు తన క్రియాశీలముచే- పవిత్రబోధలచే- ఋజువుపరచినాడు కొరితెచ్చుకొన్న కష్టాగ్నిజ్వాలలలో తన శరీరము తపింప జేసి మేలిమిబంగారమై వన్నెకెక్కి వాసిగాంచినాడు అల్ప వయస్సునందే శరీరము త్యజించి గూడ పదునైదువందలవత్సములవరకు కాచరించినను తరుగనంతటి సందేశసంపదను ప్రజల కనుగ్రహించినాడు ఆ మహర్షి శీలసంపదాయము వివరించుటకు మరొక వివేకానందుడే అవతరించ వలెను ఈ అల్పజ్ఞునకట్టి సామర్థ్యముగాని సాహసముగాని లేవు అట్టి మహాపురుషుని అవతరణకే మున మెదురు చూచెదము గాక!